# వామనావతారం

ఆర్.శర్మ దంతుర్తి



శ్రీ
కౌముది
మీ ముంగిళ్లో సాహితీ వెన్నెల
www.koumudi.net

ప్రచురణ సంఖ్య: 256

*స్వామి శివానంద సరస్వతి, స్వామి సత్యానంద సరస్వతి*

*గురుదేవులకి వినమ్రంగా*

# వామనావతారం

– ఆర్. శర్మ దంతుర్తి

మొత్తం భాగవతంలో నీకేది అత్యంత ఇష్టం అనడిగితే కలలోకూడా తడుముకోకుండా చెప్పేది – వామానావతారం. బలి చక్రవర్తి మొత్తం కులం, తానూ, ప్రపంచం, తన ఖ్యాతి అన్నీ పోతున్నా సరే సంతోషంగా వామనుడు అడిగినది – ఎవరు అడిగారో, ఎందుకడిగారో తెలిసి కూడా – దానం చేయడం చూస్తే మనం రోజూ బతికే బతుకూ ఒక జీవితమేనా అనిపిస్తూ ఉంటుంది. వామానావతారం లో అర్ధం ఏమిటంటే, "ఆత్మార్ధే పృధ్వీం త్యజేత్" అనేదే. బ్రహ్మ జ్ఞానం కావాలంటే మొత్తం ప్రపంచాన్ని విడనాడాలి. దానికోసం పాటు పడాలంటే ఎంతో కష్టపడాలి. దీన్నే స్వామి వివేకానంద ఋగ్వేదంలోని ఒక్క మాటతో చెప్పారు, జీవితానికేమిటి పరమావధి అనేది (రామకృష్ణా మఠం కి సంబంధించిన వెబ్ సైట్లలో చూడవచ్చు) – “ఆత్మనో మోక్షార్ధం, జగత్ హితాయచ.”

పోతన రాసిన ఈ వామనావతారంలో ఏ పద్యం కూడా వదిలేది కాదు. ఎప్పటికప్పుడు చెప్తున్నట్టుగా ఇందులో పద్యాలు గానీ వచనం గానీ స్వంతంగా చదివితే తప్ప అసలు పోతన అనే మానవుడు ఇలా రాయగలడా అనిపించడం సర్వ సాధారణం. అందుకే – ఎన్ని సార్లు చెప్పిందే అయినా మళ్ళీ అదే మాట – “పలికించెడు వాడు రామభద్రుండట..”

నారదుడు బ్రహ్మ దగ్గిరకెళ్ళి, ఈ జగత్తంటటికీ ఏమిటి కారణం? భగవంతుడేయే రూపాల్లో అవతరిస్తూ ఉంటాడు ఇవన్నీ నీకు తెలిసి ఉంటాయి, నాకు చెప్పు అంటే, బ్రహ్మ భగవంతుడి గుణగణాలూ, అవతారాలూ చెప్తూ అంటాడు (భాగవతం రెండో స్కందం లో) – “భగవంతుడు ఎంత శక్తిమంతుడో ఆయనకే తెలియదు ఎందుకంటే ఆకాశం, అంతరిక్షం ఎంత విస్తారంగా ఉంటాయో వాటికే తెలియదు కదా?“ దీన్నే శివమహిమా స్తోత్రంలో పుష్పదంతాచార్యులు చెప్తున్నారు చూడండి.

అసితగిరి సమం స్యాత్ కజ్జలం సింధుపాత్రే సురతరువరశాఖా లేఖనీ పత్రముర్వీ |
లిఖతి యది గృహీత్వా శారదా సర్వకాలం తదపి తవ గుణానామీశ పారం న యాతి || (32)

సరస్వతీ దేవి కల్పవృక్షం కొమ్మని కలంగా తీసుకుని భూమండలమంత కాయితం మీద సర్వకాల్లోనూ భగవద్విభూతి రాస్తోందిట. కలంలో సిరా ఏమిటంటే కాటుక కొండ పట్టుకొచ్చి సముద్రంలో కలిపితే వచ్చేదే. ఎప్పటికీ తరిగిపోని అంత సిరా, అరిగిపోని కల్పవృక్ష శాఖ కలంగా ఉండి రాస్తున్నా భగవంతుడి గుణగణాలు రాయడానికి ఇవన్నీ సరిపోవట్లేదు. అదే అవ్యక్తం అంటే. అంటే మనం ఆయన్ని ఎంత వర్ణించినా ఇంకా పూర్తిగా తెలుసుకోనట్టే. దీన్నే రామకృష్ణ పరమహంస చెప్పిన ఉప్పుబొమ్మ సముద్రం లోతు వెదకడంఅమ్ వంటిది అంటారు, భగవంతుడి గురించి వర్ణించడం అంటే. ఉప్పు బొమ్మ సముద్రం లోపలకి వెళ్ళగానే అందులో లీనమవడమే కాని వర్ణించడానికేం ఉంది?

ఆ తర్వాత ఒక్కొక్క అవతారం గురించి చెప్తూ వామనావతారం వచ్చేసరికి బలి గురించి చెప్తున్నాడు బ్రహ్మ నారదుడితో

చ. బలి నిజమౌళి నవ్వటుని పాదసరోరుహ భవ్యతీర్థ ము
త్కలిక ధరించి, తన్నును జగత్త్రయమున్ హరికిచ్చి, కీర్తులన్
నిలిపె వసుంధరాస్థలిని నిర్జరలోక విభుత్వహానికిం
దలఁకక శుక్రు మాటల కుఁదారక భూరివదాన్యశీలుఁడై [2-151]

తనకున్నవన్నీ పోతాయని తెల్సినా సరే భగవంతుడి కాళ్ళు కడిగి ఆ నీళ్ళు నెత్తిమీద చల్లుకుని మొత్తం జగత్రయాన్ని కాదనకుండా దానమిచ్చాడు. తనకి హాని జరుగుతుందనీ, నూరు అశ్వమేధాలు తనచేత చేయించిన గురువుకు కోపం వస్తుందనీ తెల్సినా అవన్నీ పెడచెవిన పెట్టి సంతోషంగా దానం ఇచ్చాడు.

అసలు వామనావతారం ముందు కొంచెం భాగవతం చూద్దాం. శుక మహర్షి భాగవతం పరీక్షిత్తుకు చెప్తూ అందులో ప్రతీ మహా యుగానికీ మనువులెవరు, వాళ్ళ క్రమం అదీ చెప్తున్నాడు.

క. జగతీశ! త్రికాలములనుఁ
బొగడొందు మనుప్రకారములు చెప్పఁబడెం;
దగఁ బదునలువురు మనువులుఁ
దెగ యుగములు వేయు నడవ దివ మజున కగున్. [8-429]

పధ్నాలుగు మనువులు మనని పాలిస్తూ ఉంటారు. మరి వీళ్లనెవరు ఉద్యోగాల్లో పెట్టేది? మనుషులు పుణ్యం చేసుకుంటే మనువైపోవచ్చా? అదే అడుగుతున్నాడు పరీక్షిత్తు.

ఆ. ఈ పదంబులందు నీ మను ప్రముఖుల
నెవ్వఁ డునుచు? వార లేమి కతన
నధిక విభవులైరి? హరి యేల జనియించె?
నెఱుఁగఁ బలుకు నాకు నిద్ధచరిత! [8-431]

వీళ్లనెవరు నియమిస్తారు? ఏవిధంగా వీళ్ళు మాములు వాళ్ళకన్నా అధికులయ్యారు? అసలు విష్ణువు అవతారాలెందుకెత్తుతున్నాడు అవన్నీ నాకు చెప్పు.

ఒకాయన ఋషీకేష్ వెళ్ళి శివానంద సరస్వతి గార్ని అడిగారుట "మీరు దేవుణ్ణి చూసారా?" అని. ఆయన సమాధానం ఏమిటంటే, "నేను దేవుణ్ణి తప్ప దేన్నీ చూడను. నాకు కనిపించే మనుషుల్లో, పురుగుల్లో, పశుపక్ష్యాదుల్లో, స్థావర జంగమమైన దేనిలోనైనా సరే నాకు భగవంతుడు తప్ప మరోటి కనిపించదు." అదే కదా విశ్వరూప సందర్శనం అంటే? ఇదే శుకమహర్షి చెప్తున్నాడు, "హరి మయము విశ్వమంతయు, హరి విశ్వమయుడు సంశయము పనిలేదా ..." అనే విధంగా అన్నమాట.

సీ. మనువులు మునులును మనుసుతు లింద్రులు;
నమరులు హరి యాజ్ఞ నడఁగువారు
యాజ్ఞాదు లందఱు హరిపౌరుషాకృతు;
లా మనువులు దత్సహాయశక్తి
జగముల నడుపుదు రొగి నాల్గుయుగముల;
కడపటఁ గాల సంగ్రస్తమైన

నిగమచయంబును నిజతపోబలముల;
మరలఁ గాంతురు ఋషివరులు; దొంటి [8-433]

తే. పగిది ధర్మంబు నాలుగు పాదములను
గలిగి వర్తిల్లు; మనువులు గమల నేత్రు
నాజ్ఞఁ దిరుగుదు; రేలుదు రవని పతులు
జగతి భాగించి తమతమ సమయములను. [8-433.1]

సప్తర్షులు, మనువులు, ఇంద్రుడు, మిగతా అందరి దేవతలూ కూడా శ్రీ హరి ఆజ్ఞ చేత పరిపాలిస్తూ ఉంటారు. వీళ్ళందరికీ కూడ ఒకటే ఆధారం – శ్రీహరి. ధర్మాన్ని నాలుగుపాదాలమీద నడిపించడానికి వీళ్లందర్నీ విష్ణువే ఏర్పాటు చేస్తూ ఉంటాడు. ప్రపంచం ఈ విధంగా నడుస్తూ ఉంటుంది.

వ. మఱియుం బ్రాప్తులయిన వారల నింద్రపదంబులను, బహుప్రకారంబుల దేవపదంబులను, హరి ప్రతిష్ఠించుచుండు; వారలు విహిత కర్మంబుల జగత్త్రయంబునుం బరిపాలింతురు; లోకంబులు సువృష్టులై యుండు. [8-434]

ప్రాప్తులైన వారిని – అంటే ఆయా పదవులు సంపాదించడానికి తగిన పుణ్యం చేసుకున్నవాళ్లకి శ్రీహరి పదవులిస్తూ ఉంటాడు. ఆ ప్రకారంగా ప్రపంచంలో ధర్మం తప్పకుండా కాలం గడుస్తూ ఉంటుంది.

సీ. యోగీశరూపుఁడై యోగంబుఁ జూపుచు;
మౌని రూపమునఁ గర్మంబుఁ దాల్చు
సర్గంబు చేయుఁ బ్రజాపతి రూపుఁడై;
యింద్రుఁడై దైత్యుల నేపడంచు
జ్ఞానంబు నెఱిఁగించుఁ జతుర సిద్ధాకృతిఁ;
గాలరూపమునఁ బాకంబు చేయు

నానావిధములైన నామరూపంబులఁ;
గర్మలోచనులకుఁ గానఁబడఁడు [8-435]

ఆ. చనిన రూపములనుఁ జనురూపముల నింక
జనఁగనున్న రూపచయము నతఁడు
వివిధుఁడై యనేక వృత్తుల వెలిఁగించు
విష్ణుఁ డవ్యయుండు విమలచరిత! [8-435.1]

ఆ హరి ఇంకా ఎటువంటివాడంటే, కర్మ చేసేవాడూ, యోగం నేర్పేవాడూ, రాక్షసులని జయించే ఇంద్రుడూ, అనేకానేక వృత్తులన్నీ చేసేవాడూ ఆయనే, ఎందుకంటే ఆయన అవ్యయుడు (ఓం పూర్ణమదః పూర్ణమిదం పూర్ణాత్ పూర్ణముదచ్యతే, పూర్ణాస్య పూర్ణామాదాయ పూర్ణమేవావషిష్యతే – ఈశావాస్యోపనిషత్). మామూలు కళ్ళకి కనబడేవాడు కాదు. అంటే వీళ్ళందర్నీ పదవుల్లో పెట్టినా వాళ్ళు కూడా తానే; ఒక్క ఆకృతి వేరు అంతే. అంటే భగవద్గీత చెప్పినట్టుగా స్థావర జంగమాలలో ఆయన లేకుండా నిలవ గలిగేది ఏమీ లేదు. (యచ్చాపి సర్వభూతానం బీజం తదహమర్జున, న తదస్తి వినాయస్యాత్ మయాభూతం చరాచరం. విభూతి యోగం 10.39) ధర్మానికి గ్లాని జరుగుతున్నప్పుడు ఆయన ఏదో విధంగా అవతరిస్తూ ఉంటాడు. దీని కోసం ఆయన ఆఖరికి చేయి చాచి దేహి అనడానిక్కూడా వెనుకాడడు. అందుకే ఓసారి వామనుడిగా అవతారం ఎత్తి బలిని అడిగి ముల్లోకాలూ పుచ్చుకుని ఇంద్రుడికిచ్చాడు. పరీక్షిత్తుకి ఇక్కడో సందేహం వచ్చింది మనకొచ్చినట్టే. అదే అడుగుతున్నాడు శుకమహర్షిని.

మ. బలి నంభోరుహ నేత్రుఁ డేమిటికినై పాదత్రయిన్ వేఁడె? ని
శ్చలుఁడున్ బూర్ణుఁడు లబ్ధకాముఁడు రమా సంపన్నుఁడై తాఁ బర
స్థలికిన్ దీనునిమాడ్కి నేల చనియెం? దప్పేమియున్ లేక ని
ష్కలుషున్ బంధన మేల చేసెను? వినం గౌతూహలం బయ్యెడిన్. [8-437]

ఏవిటేవిటీ, శ్రీహరి అవ్యయుండంటూనే వేరే వాళ్ళ దగ్గిర మూడు అడుగుల నేల కోసం చేయి ఎందుకు చాసాల్సి వచ్చింది? అన్నీ ఆయనే, అన్నీ తనవే అయినప్పుడు అసలు నువ్వూ నేనూ అనే "వేరు" అనిపించడం ఉండనప్పుడు చేయి

సాచే పరిస్థితి ఎందుకొచ్చింది? విష్ణువు సాక్షాత్ లక్ష్మీదేవిని తన వక్షత్సలంలో ఉంచుకుని బికారిలాగా వెళ్ళి దేహీ అని ఎందుకనాల్సి వచ్చింది? పోనీ వెళ్ళాడనుకుందాం, బలి తప్పు ఏమీ లేకపోయినా ఆతన్ని ఎందుకు బంధించాడు దానం తీసుకుని కూడా?

ఇదీ వామనావతారం ప్రారంభించే ముందు అసలు కథ. ఇక్కడ్నుంచి బలి ఎలా నూరు అశ్వమేధాలు చేసాడూ, తర్వాత ఏమైందీ అవన్నీ వస్తాయి.  ఓ చిన్న విషయం చెప్పుకుందాం. వివేకానందులు తండ్రి పోయేక నానా కష్టాలూ పడుతూ వీలున్నప్పుడు మాత్రం దక్షిణేశ్వరంలో ఉన్న గురువుగార్ని చూడ్డానికొచ్చేవారుట. అలాంటి రోజుల్లో ఓ సారి రామకృష్ణులతో అన్నారుట, "మీరు భగవంతుణ్ణి చూసాననీ ఆయన ఎటువంటి కోరిక అడిగినా తీరుస్తాడనీ చెప్తూ ఉంటారు. మీరు తల్చుకుంటే ఏదైనా చేయగలరు కదా, నేనూ మా కుటుంబం రోజూ తిండికి కూడా మాడుతున్నాం. నాకెందుకు మీరు సహాయం చేయరు?" రామకృష్ణుల సమాధానం, "నాయనా నీ కోసం నేను గడప గడపకీ ఎక్కి బిక్షాటన చేయగలనని నీకు తెలియదా?" టూకీగా చెప్పాలంటే ఇదే వామనావతారం అంతా చెప్పేది. నిజ భక్తుడి కోసం భగవంతుడు బిక్ష ఎత్తడానికైనా సిద్ధంగా ఉంటాడు.  అయితే మనం నిజ భక్తులమేనా అనేది తెలుసుకోవాల్సింది మనమే. మరో విషయం చెప్పుకుందాం దీని గురించి. శివానంద సరస్వతి గారితో ఒకాయన అన్నాడుట, "I want to find the perfect Guru" అని.  తుపాకి గుండులా వచ్చిందిట సమాధానం, "Are you a perfect disciple?" అని. అదండి సంగతి.

వామనావతారంలో బలి గర్వం అణచడం (దానవోద్రేక స్థంభన), అదే సమయంలో బలి చక్రవర్తిచేసుకున్న నూరు అశ్వమేధాల పుణ్యం నష్ట పోకుండా చూడడం అవన్నీ ఓ ప్రణాళిక ప్రకారం జరిగినట్టూ మనకి చివర్లో తెలుస్తుంది. వామనావతారం మొత్తంగా చూస్తే శ్రీహరి గొప్పతనం ఏమి కనిపించదు కానీ బలి చక్రవర్తికి “ఇంతింతై వటుడింతయై..” అన్నట్టు ఆత్మ సాక్షాత్కారం కలగడం మనకి కనిపిస్తుంది.  మొదట్లోనే చెప్పుకున్నట్టు ఇదే "ఆత్మార్థే పృధ్వీం త్యజేత్" అంటే. తపస్సు మొదలు పెట్టినప్పుడు భగవంతుడి మీద కుతూహలంతోనో, కోరికతోనో; తర్వాత మోక్షం కోసం, ఆ తర్వాత స్థితి మోక్ష సన్యాసం. అప్పుడు చివరగా కలిగేది బ్రహ్మ జ్ఞానం లేక సత్య సందర్శనం. ఆ సత్యం ఎటువంటిది?

అనేజదేకం మనసో జవీయో నైనద్దేవా
ఆప్నువన్ పూర్వమర్షత్

తద్ధావతో న్యానత్యేతి తిష్ఠ
త్తస్మిన్నపో మాతారిశ్వా దధాతి [ఈసావాస్యోపనిషత్ – 4]

అది మనస్సు కంటే వేగవంతమైనది. మనసుకన్నా ముందే వెళ్లగలదు. ఇంద్రియాలకు అందదు. స్థిరంగా ఉన్నా పరుగెత్తే అన్నింటికన్నా వేగవంతమైనది. సకల ప్రాణికోటి కార్యకలాపాలనీ భరించడానికి ప్రాణశక్తిని సమకూర్చేది.

తదేజతి తన్నేజతి తద్దూరే తద్వంతికే
తదన్తరస్య సర్వస్య తదు సర్వస్యాస్య బాహ్యతః [5]

ఆత్మ చలిస్తోంది, చలించదు. దూరంలో ఉంది, దగ్గిరకూడా ఉంది. లోపల ఉంది, బయటకూడా ఉంది. ప్రహ్లాదుడు తండ్రికి చెప్పినట్టే – "ఇందుగలడందులేడని సందేహము వలదు," అని అన్నమాట. అలాగే భగవంతుణ్ణి ఏ రూపంలో ధ్యానించినా చివరకి ఆయన ఒకడే. దీన్నే పోతన చెప్పింది.

క. హరిమయము విశ్వమంతయు
హరి విశ్వమయుండు సంశయము పనిలేదా
హరిమయముగాని ద్రవ్యము
పరమాణువు లేదు వంశపావన వింటే [2-17]

ఆత్మ గురించి ఈ పద్యానికి దీటుగా సరిపోయే శివానంద గారి అద్భుతమైన వ్యాఖ్య చూడండి.

"You see a waterfall. The water flows continuously. If you take a photograph, you see the waterfall in the picture but there is no motion in the water in the picture. Motion is a mental creation. It is a trick of the mind and the eye. Motion is a relative term. Only the object appears to move. Motion is an illusion. Behind the objects that move, there is the

absolutely motionless Atman. Where can this Brahman move when He is all pervading and infinite!"

## వామనావతారం – 2

భాగతవం కథలో పాల సముద్రంలో చిలకడం అయిపోయేసరికి, అందులోంచి బయటకొచ్చినవాటిని ఇటు రాక్షసులూ అటు దేవతలూ పంచుకున్నారు కదా? చివర్లో అమృతం దొరికింది కానీ ధన్వంతరి చేతిలోంచి రాక్షసులు ఎత్తుకుపోయే సరికి విష్ణువు మోహినీ అవతారం లో దాన్ని దేవతలకి పంచిపెట్టాడు. అంటే ఉచ్ఛైశ్రవం, మత్తు కలిగించే వారుణి లాంటివి తప్ప మిగతా పనికొచ్చేవి రాక్షసులకి దక్కలేదు. బ్రహ్మ జ్ఞానం లభించే దారిలో అ మిగతా చెడు గుణాలు, కోరికలు ఇంకా మిగిలిపోయేయి ఇటువైపు. అవి పోవాలి కదా? దానికోసం మళ్ళీ పాటుపడాలి.

అదే విధంగా అమృతం పోగొట్టుకున్న బలి, రాక్షసులూ మళ్ళీ గురువుగారి దగ్గిరకెళ్ళి మొరపెట్టుకున్నారు (అంటే మళ్ళీ సాధన మొదలు పెట్టారన్నమాట).

సీ. పురుహూతుచే నొచ్చి పోయి భార్గవులచే;
బలి యెట్టకేలకు బ్రతికి వారి
చిత్తంబురాఁ గొల్చి శిష్యుఁడై వర్తింప;
వారు నాతని భక్తి వలన మెచ్చి
విశ్వజిద్యాగంబు విధితోడఁ జేయింప;
భవ్యకాంచనపట్ట బద్ధ రథము
నర్కువాజులఁ బోలు హరులుఁ గంఠీరవ;
ధ్వజము మహాదివ్యధనువుఁ బూర్ణ [8-439]

తే. తూణయుగళంబుఁ గవచంబుఁ దొలుత హోమ
పావకుం డిచ్చె; నమ్లాన పద్మమాలఁ
గలుష హరుఁడగు తన తాత కరుణ నొసఁగె;
సోమ సంకాశ శంఖంబు శుక్రుఁ డిచ్చె. [8-439.1]

గురువుకి బలి చేసిన సేవ వల్ల మంచి అభిప్రాయం ఏర్పడింది. దాంతో బలిచేత విశ్వజిద్యాగం చేయించాడు. అందులోంచి బంగారు రథం, దివ్యమైన ధనువూ అవన్నీ బయటకొచ్చేయి. ఇక్కడ బలి తాత ప్రహ్లాదుణ్ణి పోతన ఏమన్నాడో గమనించారా? కలుష హరుడు – పాపాలని పోగొట్టేవాడు.

క. పాణియు, రథియుఁ, గృపాణియుఁ,
తూణియు, ధన్వియును, స్రగ్వి తురగియు, దేహ
త్రాణియు, ధిక్కృత విమత
ప్రాణియు, మణి కనక వలయ పాణియు నగుచున్. [8-441]

ఇవన్నీ పట్టుకుని మిగతా విషయాలు చూడ్డానికి బయల్దేరేడు. అసలు విషయం ఏమిటంటే ఇంద్రుణ్ణి జయించాలి. దేవతలెవరూ లేకుండా చేస్తే తానే ఇంద్రుడైపోవచ్చు. దానిక్కావాల్సిన ధనువూ, గుర్రాలు, రథం అన్నీ సిద్ధంగా ఉన్నాయి కదా? ఇప్పుడు వీటితో బయల్దేరి వెళ్ళాడు. సాధారణంగా తెలుగు కవులు సులువైన అక్షరాలతో పద్యాలు రాస్తూ ఉంటారు. అంటే "క్ష," "ణ" మొదలైనవి వదిలేసి. అంటే అసలు అలాంటి కవులు లేరని కాదు కానీ చదివేవాళ్ళకి అర్థం అవడం కోసం అన్నమాట. ఈ పద్యంలో పోతన "ణ" అక్షరాన్ని ఎలా వాడారో చూసారా?

మ. పలుదానంబుల విప్రులం దనిపి తద్భద్రోక్తులం బొంది పె
ద్దలకున్ మ్రొక్కి విశిష్టదేవతల నంతర్భక్తిఁ బూజించి ని
ర్మలుఁ బ్రహ్లాదునిఁ జీరి నమ్రశిరుఁడై రాజద్రథారూఢుఁడై
వెలిఁగెన్ దానవ భర్త శైల శిఖరోద్వేల్లద్దవాగ్నిప్రభన్. [8-442]

అన్నీ సమకూర్చుకున్న బలి ఎక్కడికి బయల్దేరేడు? యుద్ధానిక్కాదు! ముందు వెళ్ళి విప్రులందరికీ దానాలు అవీ ఇవ్వడానికీ, ఉన్న కులదేవతల్నీ వాళ్ళనీ పూజించి, తాతగారైన ప్రహ్లాదుడి దీవెనలు అందుకోవడానికీను. ఓ విషయం గమనించారా? ధనువూ, రథం అవీ దొరగ్గానే ఒక్కసారి పరుగెట్టుకుంటూ పోలేదు యుద్ధానికి. ఎందుకంటే శత్రువు అమృతం తాగిన ఇంద్రుడు. తన దగ్గిరెంత బలం ఉన్నా వెనకా ముందూ చుసుకోకుండా వెళ్ళకూడదు కదా? పెద్దల ఆశీస్సులూ, దేవతల

దీవెనలూ, విప్రుల ఆశీర్వచనాలూ సంపాదించడం మొదటి ఎత్తు. ఈ క్రమంలో చూస్తే బలి హిరణ్యకశిపుడిలాగే ప్రణాళికలన్నీ సిద్ధం చేసుకుంటున్నాడన్నమాట. "వెలిఁగెన్ దానవ భర్త శైల శిఖరోద్వేల్లద్దవాగ్నిప్రభన్" అనేది చదివితే హిరణ్యకశిపుడి తపస్సులో "ఉగ్రాచార దైత్యేంద్రమూర్ధ దిశోద్ధూత సధూమ హేతిపటలోదంచత్తపోవహ్నిచేన్ [7-73]" అనే పద్యం గుర్తురాక మానదు

క. దండిత మృత్యు కృతాంతులు
ఖండిత సుర సిద్ధ సాధ్య గంధర్వాదుల్
పిండిత దిశు లమరాహిత
దండాధీశ్వరులు సములు దన్నుం గొలువన్. [8-443]

ఇదంతా అయ్యాక, రాక్షస సేనానాయకులూ, సుర సిద్ధ సాధ్య గంధర్వాదులందరూ సేవిస్తూండగా వీళ్లందర్నీ వెంటబెట్టుకుని యుద్ధానికి బయల్దేరేడు.

క. చూపుల గగనము మ్రింగుచు
నేపున దివి భువియు నాత లీతల చేయన్
రూపించుచు దనుజేంద్రుఁడు
ప్రాపించెను దివిజనగర పథము నరేంద్రా! [8-444]

విశ్వజిద్యాగంలో తనకొచ్చిన దివ్యమైన ధనస్సు ఉంది. కూడా యోధానుయోధులున్నారు. వీళ్ళని వెంటబెట్టుని వెళ్ళే బలి ఎలా ఉన్నాడు? చూపులతో గగనము మింగేలాగా ఉన్నాట్ట. దివిని భువినీ తలకిందులు చేయడానికి (దివి భువియు నాత లీతల చేయన్) సిద్ధంగా ఉన్నాడు. అంటే తాను పాలించే భువిమీదకి ఇంద్రుణ్ణి తోసేసి తాను అమరావతికి రాజవ్వడానికి బలి బయల్దేరేడు అని పోతన చమత్కారం.

మ. కనియెం బుణ్యజనౌకమున్ విగతరోగస్వప్న పీడాన్న ఖా
దన సంశోకముఁ బుష్ప పల్లవ ఫలోద్దామద్రుమానీకమున్

స్వనితోద్ధూత పతాకముం బ్రవిచరద్వైమానికానీకమున్
ఘన గంగాసలి లైకమున్ మఘవయుక్తశ్రీకమున్ నాకమున్. [8-446]

అలా అమరావతి కేసి పోయి పోయి స్వర్గాన్ని చేరేడు దండయాత్రకి. ఆ స్వర్గం – ఆకలీ, రోగాలు రొచ్చులూ లేని చోటు. ఆకాశగంగా జలాలు, ఉరుములవలె ఎగురుతున్న జండాలు కలది. విమానాలు తిరుగుతున్నదీ అయిన స్వర్గాన్ని (నాకమున్) చేరాడు. ఈ పద్యంలో ప్రాస ఎలా ఉందో గమనించారా? (ద్రుమానీకమున్, వైమానీకమున్, గంగాసలి లైకమున్, మఘవయుక్తశ్రీకమున్, నాకమున్)

సీ. బలి వచ్చి విడియుట బలభేది వీక్షించి;
గట్టిగాఁ గోటకుఁ గాపు పెట్టి
దేవవీరులుఁ దాను దేవతామంత్రిని;
రప్పించి సురవైరి రాకఁ జెప్పి
ప్రళయానలుని భంగి భాసిల్లుచున్నాఁడు;
ఘోరరాక్షసులను గూడినాఁడు
మన కోడి చని నేఁడు మరల వీఁ డేతెంచె;
నే తపంబున వీని కింత వచ్చె? [8-452]

ఆ. నీ దురాత్మకునకు నెవ్వఁడు దోడయ్యె?
నింక వీని గెల్వ నేది త్రోవ?
యేమి చేయువార? మెక్కడి మగఁటిమి?
నెదురు మోహరింప నెవ్వఁ డోపు? [8-452.1]

బలి రావడం ఇంద్రుడు చూసాడు. కోటకి కాపు పెట్టి అందర్నీ రావించి అడుగుతున్నాడు, "మొన్నటికి మొన్న వీడు మనచేతిలో చావు దెబ్బలు తిన్నాడే, మరి ఇప్పుడింత బలం ఎలా వచ్చింది బలికి? వీడికి గానీ వేరే ఎవరైనా తోడయ్యారా?

ఇప్పుడు మనకేమిటి దారి?" ఈ సీస పద్యం ఎంత సులభంగా ఉందో గమనించారా? ద్రాక్షాపాకం రాయడంలో పోతనకి సాటిరారు ఎవరూ అనిపిస్తుంది భాగవతం చదువుతూ ఉంటే.

క. మ్రింగెడు నాకాశంబునుఁ
బొంగెడు నమరాద్రి కంటెఁ బొడవై వీఁడున్
మ్రింగెడుఁ గాలాంతకు క్రియ
భంగించును మరలఁ బద్ధ బంకజగర్భున్. [8-453]

ఇప్పుడు ఇంద్రుడి పరిస్థితి ముందు నుయ్యీ వెనక గొయ్యీ అన్నట్టుంది. అదే అంటున్నాడు బృహస్పతితో. మేరు పర్వతం కంటే పొడవై మొత్తం అమరావతి మింగేసేలా ఉన్నాడు బలి ఇప్పుడు. బ్రహ్మదేవుడైనా వీణ్ణి ఆపగలడా?

క. ఈరాదు రాజ్య మెల్లనుఁ
బోరాదు రణంబు చేయఁ బోయితి మేనిన్
రారాదు దనుజుచేతను
జారా దిట మీఁద నేమిజాడ మహాత్మా! [8-454]

పోనీ బలిని రప్పించి రాజ్యం ఇచ్చేద్దామా అంటే అలా కుదరదు; బలి అసురుడు కదా? అదలా ఉంచి యుద్ధానికి పోదామా అంటే వీడి ప్రతాపం చూస్తే ఒళ్ళు జలదరిస్తోంది – యుద్ధానికెళ్తే వెనక్కొస్తామనే ఆశ లేదు. ఈ సంకటం నుంచి ఎలాగా తప్పించుకోవడం, మీరే చెప్పండి మహాత్మా అని అడుగుతున్నాడు. ఇప్పటిదాకా చదివిన పద్యాలని పోతన "దుర్భర దానవ ప్రతాపము" అని వర్ణించాడు. ఇప్పుడు బృహస్పతి చెప్తున్నాడు ఇంద్రుడితో.

సీ. వినవయ్య దేవేంద్ర వీనికి సంపద;
బ్రహ్మవాదులు భృగుప్రవరు లర్థి
నిచ్చిరి; రాక్షసు నెదురను నిలువంగ;
హరి యీశ్వరుఁడు దక్క నన్యజనులు

నీవును నీ సముల్ నీకంటె నధికులుఁ;
జాలరు; రాజ్యంబు చాలు; నీకు
విడిచి పోవుట నీతి విబుధనివాసంబు;
విమతులు నలఁగెడువేళ చూచి [8-456]

తే. మరలి మఱునాఁడు వచ్చుట మా మతంబు;
విప్రబలమున వీనికి వృద్ధివచ్చె
వారిఁ గైకొన కిటమీఁద వాఁడి చెడును;
దలఁగు మందాక రిపుఁ బేరు దలఁపరాదు [8-456.1]

చూడు నాయనా ఈ బలం అంతా బలికి బ్రాహ్మణ తేజం వల్ల వచ్చింది. శుక్రాచార్యులు విశ్వజిద్యాగం చేయించి శస్త్రాస్త్రాలు ఇచ్చారు. వీటితో వచ్చిన బలిని ఎదుర్కోవడానికి నారాయణుడు, పరమశివుడూ తప్ప మిగతావాళ్ళు ఎందుకూ పనికిరారు. మనం ఇప్పుడు చేయ గలిగింది ఏమిటంటే వీడికి స్వర్గాన్ని వదిలేసి పారిపోవడం మంచిది. రాబోయే రోజుల్లో బలికి కీడు మూడుతుంది. అప్పుడు మరో ఉపాయం ఆలోచించవచ్చు.

వ. అనినఁ గార్యకాల ప్రదర్శి యగు బృహస్పతి వచనంబులు విని కామరూపులై దివిజులు త్రివిష్టపంబు విడిచి తమతమ పొందుపట్లకుం జనిరి; బలియునుం బ్రతిభట వివర్జిత యగు దేవధాని నధిష్ఠించి జగత్రయంబునుం దన వశంబు జేసికొని విశ్వవిజయుండై పెద్ద కాలంబు రాజ్యంబు జేయుచుండె, శిష్యవత్సలులగు భృగ్వాదు లతని చేత శతాశ్వమేధంబులు చేయించిరి; తత్కాలంబున. [8-458]

అలా అనగానే ఇంద్రుడూ దేవతలూ స్వర్గాన్ని బలికి వదిలేసి వెళ్ళిపోయారు. ఇంద్రపదవి ఆక్రమించుకున్న బలి ఇప్పుడు అసలైన ఆలోచన అమల్లో పెట్టాడు. అదేమిటంటే తనకి తెల్సినంతలో దేవతలని జయించడం పెద్ద పని కాదు కానీ స్థిరంగా ఇంద్రపదవిలో కూర్చోవడం కుదరదు. అదీగాక దేవతలకి ఎప్పుడు కావాలిస్తే అప్పుడు సహాయం చేయడానికి త్రిమూర్తులూ అందరూ కాసుకుని కూర్చునుంటారు. అయితే మరో విధంగా ఇంద్రపదవి సంపాదించవచ్చు; అదేమిటంటే నూరు అశ్వమేధాలు చేయడం. ఈ ఆలోచనల్తో వెంతనే ముల్లోకాలనీ లోబరచుకుని నూరు అశ్వమేధాలు చేసేడు. అంటే

ఇంక ఇంద్రపదవి తనదే. ఇదంతా ఎందుకు చేసాడో ఓ సారి గమనిస్తే బలి బ్రహ్మాండమైన తెలివితేటలు కలవాడని మనకి తెలుస్తుంది. తాత ప్రహ్లాదుణ్ణి శ్రీహరి కనికరించాడు సరే, మరి ముత్తాత హిరణ్యకశిపుణ్ణో? ఎంత కష్టమైన కోరిక కోరినా నాగుపాము ఎలకని పట్టినట్టూ సంహరించేశాడు కదా? అంటే యుద్ధంలో శ్రీహరిని గెలవడం అసంభవం. తాను అసుర తత్వం గలవాడు కనక ప్రహ్లాదుడిలా శ్రీహరి భక్తుడవలేడు. తాత ముత్తాతల మాట అటుంచి తండ్రి సంగతి ఆలోచిస్తే బలి తండ్రి విరోచనుడు ఎవరొచ్చి ఏమడిగినా ఇవ్వాలనుకుని ఓ యాగం మొదలుపెట్టాడు. ఆ యాగం పూర్తైతే ఇంద్రపదవి దొరుకుతుంది. అప్పుడు ఇంద్రుడు మారు రూపంలో వెళ్ళి దేహి అనడం, ఏమి కావాలో కోరుకో అంటే మీ దేహం ఇవ్వండి అని అడగడం, దానితో తన తండ్రి విరోచనుడు తనువు చాలించడం బలి ఎరిగిందే. మరి ఇంకెలా ఇంద్రపదవి శాశ్వతంగా సంపాదించడం? ఇవన్నీ జాగ్రత్తగా ఆలోచించుకుని ఈ శతాశ్వమేధాల బాట ఎంచుకున్నాడన్న మాట. ఇప్పుడు నిజంగానే బలి ఇంద్రపదవి అధిష్టించడానికి అర్హుడు. మరి ఇద్దరు ఇంద్రులు ఒకే సింహాసనం మీద కూర్చోవడం కుదరదు కదా?

బలి మనఃస్థితి ఓ సారి గమనిస్తే మనకి విశదమయ్యేది ఏమిటంటే ఒక్కో అశ్వమేధయాగం చేస్తూ పోయేసరికి తనకి తెలియకుండా తాను పవిత్రమౌతూ ఆత్మ సాక్షాత్కారానికి ఆయుత్తమౌతున్నాడు. ఇంద్రపదవి మాట అటుంచి తాను వేసుకున్న ప్రణాలికల వల్ల శ్రీహరి దర్శనానికి సిద్ధంగా ఉన్నాడు ఈ శతాశ్వమేధాలవల్ల. ఈ యాగాలలో ఇచ్చే దానాలు ఎంత గొప్పగా ఉంటే తాను అంత గొప్పగా ఇంద్రపదవి నిర్వహించవచ్చు. అయితే ఈ ఇవ్వడం అనేది ఒక అలవాటులాగా తయారైంది నూరు ఆశ్వమేధాలవల్లాను. ఈ అలవాటు వల్ల "నేను ఇవ్వ(లే)ను" అనడం మర్చిపోయేడు. ఎప్పుడైతే ఇవ్వనూ అని అంటాడో అప్పుడు ఇంద్రపదవికి అర్హత పోతుంది. మొదట్లో “దానం చేస్తే పుణ్యం వస్తుందనే కోరిక” వల్ల దానం చేయడం, ఆ తర్వాత అది అలవాటుగా మారడం ఒక మార్పు. ఆ తర్వాత ‘పుణ్యమో పాపమో, అవతలవాడిని ఆదుకోవాలి’ అనే ఆలోచన తో దానమివ్వడం. ఆ తర్వాత పై మెట్టు – సూర్యుడు ఇటుతిరిగి అటుతిరిగినా సరే ఇచ్చితీరుతాననడం. ఇలా మార్పు వస్తూ మనం మనకి తెలియకుండానే మారుతూ ఉంటాం. బలికి జరిగిందిదే. ఇప్పుడు అన్నింటికీ రంగం సిద్ధమైంది. మరి ఇంతటి పుణ్యం చేసుకున్న బలిని శ్రీహరి స్వహస్తాలతో సంహరించగలడా? ఆయనే కదా చెప్పేడు భగవద్గీతలో –

పార్ధనైవేహ నాముత్ర వినాశస్తస్య విద్యతే
నహి కల్యాణకృత్కస్చిద్దుర్గతిం తాత గచ్ఛతి (సాంఖ్య యోగం 6.40)

(నాయనా, మంచి పనులు చేసేవాళ్ళు ఎన్నటికీ దుర్గతి పొందరు). బుద్ధికీ మేధస్సుకీ, మనసుకీ అందదు కదా భగవంతుడంటే? మరి ఇన్ని ప్రణాలికల్ని వేసుకున్న బలిని తప్పించడం ఎలా? చావు రాకూడదని క్లిష్టమైన కోరిక కోరిన హిరణ్యకశిపుణ్ణి సంహరించిన శ్రీహరి బలిని ఏమి చేయబోతున్నాడో చూద్దాం.

## వామనావతారం – 3

ఇంద్రాదులని అమరావతిలోంచి బయటకి తోసేసి బలి చక్రవర్తి ఇంద్రపదవి శాశ్వతంగా అధిష్ఠించదానికి సిద్ధంగా ఉన్నాడు కదా? మరి అసుర గుణాలు కల బలి పరిపాలనలో ఇంతటి రాజ్యం ఎలా ఉంది?

శా. అర్థుల్ వేఁడరు; దాతలుంజెడరు; సర్వారంభముల్ పండుఁ; బ్ర
త్యర్థుల్ లేరు; మహోత్సవంబులను దేవాగారముల్ పొల్చుఁ బూ
ర్ణార్థుల్ విప్రులు; వర్షముల్ గురియుఁ గాలార్హంబులై; ధాత్రికిన్
సార్థంబయ్యె వసుంధరాత్వ మసురేంద్రాధీశు రాజ్యంబునన్. [8-459]

ఇచ్చేవారికి లోటు లేదు, పుచ్చుకునేవారు అడగనే అడగరు. ఏ పని చేసినా ఫలిస్తూ ఉంది. సకాలంలో వర్షాలు కురుస్తున్నాయి. భూమికి వసుంధర అనే పేరు సార్థకం అయింది. అంటే ముందు ఉన్న ఇంద్రుడికన్నా ఇప్పుడు బలి చక్రవర్తి పాలనే బాగున్నట్టుంది.

సీ. తన తనూజుప్రోలు దనుజులు గొనుటయు;
వేల్పు లెల్లను డాఁగ వెడలుటయును
భావించి సురమాత పరితాపమునఁ బొంది;
వగ ననాథాకృతి వనరుచుండ
నా యమ్మ పెనిమిటి యగు కశ్యపబ్రహ్మ;
మఱి యొకనాఁడు సమాధి మాని
తన కుటుంబిని యున్న ధామమునకు నేగి;
నాతిచే విహితార్చనములు పడసి [8-461]

ఆ. వంది వ్రాలి కుంది వాడిన యిల్లాలి
వదనవారిజంబు వడువుఁ జూచి
చేరఁ దిగిచి మగువ చిబుకంబు పుడుకుచు
వారజాక్షి యేల వగచె దనుచు. [8-461.1]

ఇక్కడ బలి చక్రవర్తి పని బానే ఉంది కానీ అటువైపు దేవతలకి దిక్కులేకుండా పోయింది. దాంతో వాళ్ళ తల్లి అయిన అదితికి బెంగ పట్టుకుంది. ఎందుకంటే బలి ఎప్పుడో తప్పుచేసేదాకా ఎంతకాలమని చూడాలి? పోనీ ఈ రాజ్యంలో ఎవరైనా ఏడుస్తున్నారా, ఎవరికైనా కష్టాలున్నాయా, బలి ఏదైనా అధర్మం చేస్తున్నాడా అంటే అదీ లేదు – సర్వారంభముల్ పండు... ధాత్రికిన్ సార్థంబయ్యె వసుంధరాత్వ మసురేంద్రాధీశు రాజ్యంబునన్ – అని చెప్తున్నాడు కదా? ఇలాగైతే దేవతలందరి ఉనికే పోతే? ఈ దిగులుతో ఆవిడ అలా ఉండగా భర్త కశ్యప ప్రజాపతి తపస్సు చాలించి ఇంటికొచ్చాడు. అదితి పరిస్థితి చూసి అడుగుతున్నాడు.

మ. తెఱవా! విప్రులు పూర్ణులే? చెలగునే దేవార్చనాచారముల్?
తఱితో వేలుతురే గృహస్థులు? సుతుల్ ధర్మానుసంధానులే?
నెఱి నభ్యాగత కోటి కన్న మిడుదే? నీరంబునుం బోయుదే?
మఱి లే కర్థుల దాసులన్ సుజనులన్ మన్నింపుదే? పైదలీ! [8-463]

ఇంటికొచ్చిన వాళ్లనీ, సజ్జనులనీ, యాచకులనీ బాగా ఆదరిస్తున్నావా? అన్నంపెట్టి నీళ్ళు ఇస్తున్నావా? పూజా, హోమాలూ, పునస్కారాలన్నీ జరుగుతున్నాయి కదా? పరిస్థితి అంతా బాగుందా? మనం గమనించ వల్సింది, ఇక్కడ భాగవతంలో గృహస్తు ధర్మం చెప్తున్నాడన్నమాట. ఇంకా ఉన్నాయి చేయాల్సినవి. అవి కూడా అడుగుతున్నాడు ఇప్పుడు.

ఆ. అన్నమైనఁ దక్రమైనఁ దోయంబైన
శాకమైన దనకుఁ జరగు కొలఁది
నతిథి జనుల కడ్డ మాడక యిడరేని
లేమ! వారు కలిగి లేనివారు. [8-464]

తనకి ఉన్నంతలో అన్నమో, మజ్జిగో, కాయో, పండో అడిగిన వాళ్ళకి ఇవ్వడం చేయకపోతే వాళ్ళకి ఎంత ఉన్నా ఏమీ లేనట్టే. ఇంత ఎందుకు చెప్తున్నాడంటే ఇదిగో కారణం కూడా తెలియపరుస్తున్నాడు.

ఆ. నెలఁత! విష్ణునకును నిఖిలదేవాత్మున
కాననంబు శిఖియు నవనిసురులు;
వారు దనియఁ దనియు వనజాతలోచనుం
డతఁడుఁ దనియ జగము లన్నిఁ దనియు. [8-466]

నిఖిల దేవాత్ముడైన విష్ణువు వదనం బ్రహ్మ వేత్తలకి నివాసం.వాళ్ళని తృప్తి పరుస్తే శ్రీహరి తృప్తి పడినట్టే. పోతన ఈ పద్యంలో రెండు విషయాలు చెప్తున్నాడు – మొదటిది, మహావిష్ణువు వదనం వేదాలకి మూలం. ఎప్పుడైనా గమినించారా ఎందులోనైనా నిష్ణాతులైన వారి మొహం చూస్తే అదో రకమైన బ్రహ్మ వర్చస్సు కనబడుతూ ఉంటుంది. అదే ఇక్కడ చెప్పినది. రెండోది, విష్ణువుని ప్రాసకోసమో మరి దేనికోసమో కానీ వనజాతలోచనుడు అన్నాడు. వనజాతము అంటే పద్మం. పద్మములవంటి కనులు కలవాడు – విష్ణువు. గజేంద్రమోక్షంలో హరి, హరి, హరి అదే పనిగా చెప్పినవాడు ఇక్కకూడా హరి అనే పదంతో రాయొచ్చు పద్యాన్ని కానీ వనజాతలోచనుండు అని ఎందుకన్నాడంటే, వదనం ఎలా ఉంది? బ్రహ్మ వర్చస్సుతో ఉంది. కానీ మొహంలో అది ఎక్కడ ప్రస్ఫుటంగా కనిపించేది? కళ్లలోనే కదా? అందుకే ఆ ప్రయోగం.

చిన్న సరదా ప్రశ్న. పై మూడు పద్యాల్లో అదితిని "తెరువా (సుందరీ)", "పైదలీ (చిన్నదానా)", "లేమ (లేత యవ్వనము గల స్త్రీ)", "నెలత (చంద్రునివలెచల్లనియామె)" అనీ సంభోదింపచేసాడు పోతన కశ్యపుడి చేత. ఈ పదాలు ఎప్పుడైనా వాడారా నిజ జీవితంలో?

క. బిడ్డలు వెఱతురె నీకఱ
గొడ్డంబులు జేయ కెల్ల కోడండ్రును మా

ఔొద్ధారింపక నడతురె
యెద్దము గాకున్నదే మృగేక్షణ! యింటన్. [8-467]

పోనీ గృహస్తు ధర్మాలు సరిగ్గా చేస్తున్నానంటావేమో, అయితే ఇది చెప్పు మరి. పిల్లలు భయభక్తులతో నీమాట వింటున్నారా? కోడళ్ళ వల్ల ఇంట్లో ఏమీ ఇబ్బంది లేదు కదా?

ఉ. ప్రేమ యొకింత లేక దితి బిడ్డలు బిడ్డలబిడ్డలున్ మహా
భీమ బలాఢ్యులై తనదుబిడ్డల నందఱఁ దోలి సాహసా
క్రామిత వైరులయ్యు నమరావతి నేలుచు నున్నవారు; నీ
కే మని విన్నవింతు? హృదయేశ్వర! మేలుఁ దలంచి చూడవే? [8-469]

ఇలా అడిగేసరికి అదితి చెప్తోంది – అన్నా తమ్ముళ్ళని చూడకుండా దితి పిల్లలు నా బిడ్డలనందర్నీ హింసిస్తున్నారు. ఇప్పుడు వాళ్ళే అమరావతిని ఏలేది. మీతో ఏమని చెప్పాలి? (చెప్తే సవతి మీద చాడీలు చెప్తోంది అనుకుంటాడేమో అని)

క. అక్కా చెల్లెండ్రయ్యును
దక్కరు నాతోడి పోరుఁ; దానున్ దితియున్
రక్కసులు సురల మొత్తఁగ
నక్కట! వల దనదు చూచు నౌనౌ ననుచున్. [8-470]

మేమిద్దరం అక్కా చెల్లెళ్లమే కదా అయినా సరే దితి బిడ్డలు నా పిల్లల్ని మొత్తుతూ ఉంటే ఏమీ అనదు. అలా చూస్తూ ఉంటుంది అంతే. పోనీ అలా అని ఊరుకుంటుందా అంటే అదీ లేదు "అవునవును" అంటోంది.

సీ. ఎండకన్నెఱుగని యింద్రుని యిల్లాలు;
పలుపంచలను జాలిఁ బడియె నేఁడు
త్రిభువన సామ్రాజ్య విభవంబుఁ గోల్పోయి;

దేవేంద్రుఁ డడవులఁ దిరిఁగె నేఁడు
కలిమి గారాబు బిడ్డలు జయంతాదులు;
శబరార్భకుల వెంటఁ జనిరి నేఁడు
నమరుల కాధారమగు నమరావతి;
యసురుల కాటపట్టయ్యె నేఁడు [8-471]

ఆ. బలి జగముల నెల్ల బలియుచు నున్నాఁడు
వాని గెలువరాదు వాసవునకు
యాగభాగమెల్ల నతఁ డాహరించుచుఁ
గడఁగి సురల కొక్క కడియుఁ నీఁడు. [8-471.1]

మరి దేవతలు ఎలా ఉన్నారు ఈ బలి పరిపాలనలో? అసూర్యం పశ్య అయిన ఇంద్రుని ఇల్లాలికి గతిలేదు – పరుల పంచన బతుకుతోంది. త్రిభువనాలని ఏలే ఇంద్రుడో? అడవుల్లో తిరుగుతున్నాడు. సంపదలకి కారణమైన జయంతాదులు బోయవాళ్ల పిల్లల్లా తిరుగుతున్నారు. అమరావతిని ఏలేది రాక్షసులే ఇప్పుడు. పోనీ యుద్ధం చేసి గెలుద్దామా అంటే కుదరదు. ఎందుకంటే బలి జగత్రయంలో బలుస్తూ ఉన్నాడు మంచి పరిపాలన చేస్తూ. యాగాల్లో వచ్చే హవిర్భాగాలన్నీ ఇప్పుడు బలివే.

ఇవన్నీ ఎందుకు చెప్పాల్సి వచ్చిందంటే, ఇప్పుడు చెప్తోంది కారణం.

క. ప్రజలకు నెల్లను సముఁడవు
ప్రజలను గడుపారఁ గన్న బ్రహ్మవు నయ్యుం
బ్రజలందు దుష్టమతులను
నిజముగ శిక్షింప వలదె నీవు? మహాత్మా! [8-472]

నీకు ప్రజలందరూ ఒకటే. వీళ్లందర్నీ పుట్టించిన ప్రజాపతివి. మరి ఈ ప్రజల్లో దుష్టులని శిక్షించాలి కదా? అలా వదిలేస్తే ఎలా?

మ. సురలన్ సభ్యుల నార్తులన్ విరథులన్ శోకంబు వారించి ని
ర్జరధానిన్ నిలుపంగ రాత్రిచరులన్ శాసింప సత్కార్య మే
వెర వేరీతి ఘటిల్లు నట్టి క్రమమున్ వేగంబ చింతింపవే?
కరుణాలోక సుధాఝరిం దనుపవే? కళ్యాణ సంధాయకా! [8-473]

ఇప్పుడు దేవతల కష్టాలు తీర్చి మళ్ళీ వాళ్లని అమరావతిలో కూర్చోబెట్టాలి. రాక్షసులని శిక్షించాలి. మరి దీనికి మార్గం ఏమిటి? వెంఠనే ఏదో ఒకటి ఆలోచించండి. అమరావతిని ఏమన్నాడో ఈ పద్యంలో చూసారా? "నిర్జరధాని" (నిర్జర – ముసలితనం లేని దేవతల రాజధాని).

మరోసారి చూద్దాం ఈ దేవాసుర యుద్ధాల గురించి. ఇవన్నీ మనలోపల ఉండేవే. అమరావతి అంటే మన దేహమే. ఇక్కడ అదితి అంటే మనలోని శుభ్రమైన మనస్సు అన్నమాట. పాడు గుణాలతో కొంతకాలం బాగున్నా మొత్తానికి వాటిని బయటకి పంపించడం వల్లే మనకి భగదనుగ్రహం కలిగేది. కానీ మనకి మనమే ప్రయత్నం చేసుకుంటే ఇవన్నీ గెలవడం కష్టం కదా? దానికోసం గురువో, మరొకరో సహాయం చేయాలి. ఎవరు సహాయం చేసినా భగవదనుగ్రహం రావాలంటే శరణాగతి తప్పనిసరి అనేది మనకి తెలుసు. ఆ శరణాగతి ఒక్కసారి రాగానే నిరాటంకంగా భగవంతుడి అనుగ్రహం ప్రవహిస్తుంది. కొన్ని చెడు గుణాలు వదిలించుకోవడం ఎంత కష్టపడ్డా కుదరకపోవచ్చు. అప్పుడేం చేస్తాం? పరమేశ్వరా, నీ ఇష్టం వచ్చినట్టే కానియ్యి. నేను అశక్తుణ్ణి అని అనుకోమూ? అలాగే ఇక్కడానూ. జీవితంలో మనందరికి ఏదో ఒక సందర్భంలో అవగతమే ఇవన్నీ.

అదితి చెప్పినది అంతా విన్నాక కశ్యపుడి సమాధానం చూద్దాం.

## అదితి వ్రతం – వామనావతారం – 4

బలి ఇంద్రపదవిలో కూర్చున్నాక ప్రపంచం అంతా మునుపటికన్నా బాగున్నట్టే ఉంది. మరి దేవతలో? వాళ్ళు చెట్టుకొకరు, పుట్టకొకరు చొప్పున సర్దుకున్నారు. అదితి ఇదంతా చూసి కశ్యపుడితో మొరపెట్టుకుంది. ఇప్పుడు ఆయనేం చేయాలి? ధర్మబద్ధంగా ఇంద్రుడైన బలిని పదవీచ్యుతుణ్ణి చేయడానికి ఎవరికుంది అధికారం? తానేదో చేయగలడనుకున్నా చేస్తాడా? పోనీ ఏదో విధంగా చేసాడనుకుందాం, అలా చెయ్యొచ్చా? ఎంతటి మహాత్ముడైనా భగవదేచ్ఛ దాట(లే)డు కదా?

వ. అనిన మనోవల్లభ పలుకు లాకర్ణించి ముహూర్తమాత్రంబు చింతించి విజ్ఞానదృష్టి నవలంబించి భావికాల కార్యంబు విచారించి కశ్యప బ్రహ్మ యిట్లనియె. [8-474]

ఓ క్షణం కళ్ళుమూసుకుని దివ్య దృష్టితో చూసేసరికి అంతా తెలిసింది. ముందేం చేయాలో విచారించి – ఆవిడ వింటుందని కాదు కానీ చెప్పాలి కనక – చెప్తున్నాడు.

 మ. జనకుం డెవ్వడు? జాతుఁ డెవ్వఁడు? జనిస్థానంబు లెచ్చోటు? సం
జననం బెయ్యది? మేను లేకొలఁదిఁ? సంసారంబు లేరూపముల్?
వినుమా యింతయు విష్ణుమాయ దలఁపన్వేఱేమియున్ లేదు; మో
హ నిబంధంబు నిదాన మింతటికి జాయా! విన్నఁబో నేటికిన్? [8-475]

తండ్రి ఎవడు, కొడుకెవడు? మన పుట్టుక ఎటువంటిదీ, మన శరీరాలేపాటివి? ఈ సంసారం ఎటువంటిది? ఇదంతా విష్ణుమాయ తప్ప మరేంలేదు సుమా. అందుచేత ఇదంతా తలకి ముడివేసుకోవడం ఎందుకు? ఈ జీవితాలలో ఏదో జరిగినా చిన్నబుచ్చుకోవడం, పొంగిపోవడం ఎందుకు? ఈ చెప్పడం ఎలాంటిదంటే, మనకో పెద్ద సమస్య వచ్చిందనుకోండి. ఎటూ తేలకుండా ఉంది పరిస్థితి. అప్పుడు ఓ స్వామిగారు ఊర్లో ఉన్నట్టు తెల్సింది. వెళ్ళి అయ్యా ఇలా ఈ సమస్య వచ్చింది. ఏం చేయమంటారు అని అడుగుతాం. ఉన్న రోగాలు రొచ్చులుతో మనలోకం మనది. కానీ ఈ స్వామి గారికి అవన్నీ ఓ పెద్ద తలనెప్పి కనక అవన్నీ వదులుకుని సన్యసించాడు. ఆయనలోకంలో భగవంతుడొకడే

ఆయనికి కావాల్సింది. అందుకని ఆయనకి మనకున్న రోగాలు రొచ్చులూ పెద్ద సమస్యల్లా కనిపించవు. కళ్ళు మూసుకుని భగవంతుణ్ణి ధ్యానం చేయి అన్నీ సర్దుకుంటాయి అని చెప్తారు మనతో. ఎందుకంటే ఈ రోగాలూ రొచ్చులూ ఎప్పుడూ ఉండేవే. మనదాకా రానంతవరకూ మనకేం ఢోకా లేదని అనుకుంటూ ఉంటాం. తీరా వస్తే? ఇవన్నీ సన్యసించిన వాడికి ముందే తెలుసు. అసలు ఆయన సన్యాసం తీసుకున్నదే ఇవన్నీ తెలిసి కదా? ఇదే విధంగా ఇప్పుడు కశ్యపుడు అదితితో చెప్పాడన్న మాట.

మ. భగవంతుం బరముం జనార్దనుఁ గృపాపారీణు సర్వాత్మకున్
జగదీశున్ హరి సేవజేయు మతఁడున్ సంతుష్టనిం బొంది నీ
కగు నిష్టార్థము లెల్ల నిచ్చు; నిఖిలార్థావాప్తి చేకూరెడిన్
భగవత్సేవలఁ బొందరాదె బహుసౌభాగ్యంబులం బ్రేయసీ! [8-477]

ఇక్కడ కశ్యపుడు కూడా సరిగ్గా ఇలాగే చెప్తున్నాడు. దయాసముద్రుడైన భగవంతుణ్ణి హరిని ధ్యానించు ఆయనే చూసుకుంటాడు. భగవంతుణ్ణి అడిగితే ఏమిస్తాడు ఆయన? అది కూడా చెప్తున్నాడు – నిఖిలర్థావ్యాప్తి చేకూరెడిన్ – సమస్తమైన ప్రయోజనములు చేకూరుతాయి; అయితే ఆయన ఇస్తాడా ఇవ్వడా అనేది మనం అడిగే విధానం బట్టి ఉంటుంది. దీని గురించి ముందు మళ్ళీ చూద్దాం.

క. నారాయణుఁ బరమేశ్వరు
నేరీతిఁ దలంతు? మంత్ర మెయ్యది? విహితా
చారంబు లే ప్రకారము?
లారాధన కాల మెద్ది? యానతి యీవే. [8.479]

మరిప్పుడు హరి పేరు చేప్పాడు కనక ఎలా ధ్యానించాలో అడుగుతోంది అదితి. ఎలాచేయాలి ఈ ధ్యానం? ఎంతకాలం చేయాలి? ఏయే ఆచారాలు పాటించాలి అంటూ. అదికూడా చెప్తున్నాడు.

వ. అనినఁ గశ్యప ప్రజాపతి సతికిఁ బయోభక్షణంబను వ్రతంబుపదేశించి తాత్కాలంబునుఁ, దన్మంత్రంబును, దద్విధానంబును, దదుపవాస దాన భోజన ప్రకారంబులును నెఱింగించెను. అదితియును ఫాల్గుణ మాసంబున శుక్లపక్షంబునఁ బ్రథమదివసంబునన్ దొరకొని పండ్రెండు దినంబులు హరి సమర్పణంబుగా వ్రతంబు జేసి వ్రతాతంబున నియత యై యున్న యెడఁ జతుర్బాహుండునుఁ బీతవాసుండును శంఖ చక్ర గదాధరుండునునై, నేత్రంబుల కగోచరుండైన నారాయణదేవుండు ప్రత్యక్షంబైనం గనుంగొని [8-480]

సరే అడిగింది కనక నారాయణ మంత్రం, అదెలా జపించాలి, ఎన్నాళ్ళు చేయాలి, వ్రతం, దాంట్లో చేయాల్సిన ఉపవాసాలు, భోజనం అన్ని చెప్పి ఆయన పక్కకి తప్పుకున్నాడు. ఇక్కడొక విషయం గమనించారా? ధ్రువుడు నారదుడి దగ్గిర ఉపదేశం పొందాక నారదుడు ఏం చెప్పేడు ధ్రువోపాఖ్యానంలో?

వ. ఉత్తమశ్లోకుండగు పుండరీకాక్షుండు నిజమాయా స్వేచ్ఛావతార చరితంబుల చేత నంచింత్యముగా నెద్దిచేయు నద్ది హృదయగతంబుగా ధ్యానంబు చేయందగు; మఱియుఁ గార్యబుద్ధింజేసి చేయంబడు పూజావిశేషంబులు వాసుదేవమంత్రంబున సర్వేశ్వరునికి సమర్పింపవలయు; ఇట్లు మనోవాక్కాయ కర్మంబులచేత మనోగతంబగునట్లుగా భక్తియుక్తంబు లయిన పూజలచేతఁ బూజింపంబడి, సర్వేశ్వరుండు మాయాభిభూతులు గాక సేవించు పురుషులకు ధర్మాది పురుషార్థంబులలో నభిమతార్థంబునిచ్చు; విరక్తుం డగువాఁడు నిరంతర భావంబయిన భక్తియోగంబునం జేసి మోక్షంబుకొఱకు భజియించు" ... [4-256]

అక్కడ ధ్రువుడు "మాయాభిభూతులు గాక సేవించు" కుర్రవాడు. వాణ్ణి ఈ సంసారంలోకి లాగడం అనవసరం. మరి అదితి సంగతో? ఆవిడకి కావాల్సింది మోక్షం కాదు. దేవతలు బాగుపడాలి అంతే. మరి ఇటు కోరికలు లేని ధ్రువుడికీ అటు కోరికలు కోరే అదితికీ భగవంతుడు అన్నీ ఇవ్వగలడా? అదికూడా నారదుడు చెప్పేడు కదా "....ధర్మాది పురుషార్థంబులలో నభిమతార్థంబునిచ్చు." అందుకే భగవంతుడంటే కల్పవృక్షం వంటివాడు. ఏది అడిగితే అదే ఇవ్వగలడు. అయితే ఇక్కడ అదితి మోక్షం గురించి అడగట్లేదు కనక కశ్యపుడు ఇలా భగవంతుణ్ణి ఆరాధించూ అని చెప్పాడంతే. కానీ ఆయన కనిపిస్తాడా, కనిపిస్తే ఏమి అడగాలి అనేవి చెప్పలేదు. ఎందుకంటే భగవంతుడు కనబడాలి అంటే చేయవల్సిన పరిశ్రమా, కష్టం, కనపడ్డాక అడిగేదీ మన మనః స్థితుల మీద ఆధారపడి ఉంటాయి కనక.

సరే, ఈ వ్రతం పద్ధతీ అన్నీ విన్నాక అదితి ఫాల్గుణ మాసంలో మొదటి రోజునుంచి పన్నెండు రోజులు దీక్షగా తపస్సూ, వ్రతం ఆచరించింది. ఎలా చేసింది వ్రతం? "హరి సమర్పణంబుగా.." అంటే కోరిక మనసులో ఉన్నా అది తీరినా తీరకపోయినా వ్రతం మాత్రం హరికి దక్కేలాగ అన్నమాట. దీన్నే "యోగః కర్మసు కౌశలం" అనడం. వ్రతం అయ్యాక మామూలు కళ్ళకి కనబడని శ్రీహరి ప్రత్యక్షమయ్యేడు. ఎలాగ కనిపించాడు? "జతుర్భాహుండునుఁ బీతవాసుండును శంఖ చక్ర గదాధరుండునునై.."

భలేవారండీ, పన్నెండురోజుల్లో వ్రతం చేసాక శ్రీహరి కనిపించేస్తే సన్యసించడం ఎందుకూ, సంసారం అన్నీ వదులుకోవడం ఎందుకూ? ఆత్మ సాక్షాత్కారం ఇంత సులభం అయితే ఓ రామకృష్ణులూ, బుద్ధుడూ ఇంట్లోంచి పారిపోయి వంటరిగా అన్ని సంవత్సరాలు తపస్సుచేయడం ఎందుకూ? ఫాల్గుణ మాసంలో అదితి చేసినట్టు పన్నెండురోజులు వ్రతం చేస్తే చాలదూ? ఈ పన్నెండు రోజులూ తప్ప మిగతా రోజుల్లో ఎవర్ని ఎలా మోసం చేసినా, ఎన్ని అబద్ధాలాడినా ఎలా ఉన్నా ఫర్వాలేదు కదా?

దీని గురించో చిన్న కథ చెప్పుకుందాం. శంకర భగవత్పాదులు సన్యసించాక చిన్న వయసులో ఓ రోజు భిక్షాటనకి వెళ్ళి ఓ ఇంటి తలుపు తట్టేరుట. ఆ ఇంట్లో ఉన్నావిడ అతి పేదరికపు స్త్రీ. ఏనాడూ తాను ఇంత తిన్నదీ లేదు ఎవరికీ పెట్టినదీ లేదు. కానీ శంకరులని చూడగానే ఏదో ఇవ్వాలనిపించింది. ఇంట్లోకి వెళ్ళి అన్నీ వెతికారు. ఏమీ లేదు ఇవ్వడానికి. కానీ ఈయన్ని వట్టి చేతులతో పంపించకూడదు. అలా వెతగ్గా వెతగ్గా ఓ ఉసిరి కాయ కనిపించింది ఇంటావిడకి. అదే తీసుకొచ్చి పాత్రలో వేసారు కన్నీళ్ళతో. ఇది చూసిన శంకరులకి కళ్ళు చెమర్చాయి. వెంఠనే ఆవిడ దరిద్రం పోవాలని "అంగం హరే పులకభూషణ మాశ్రయంతీం...." అంటూ లక్ష్మీదేవిమీద కనకధారా స్తవం చదివారు. దేనికోసం? నాకు డబ్బులివ్వమ్మా అనికాదు. ఇంతటి పేదరికంలో ఉన్నా ఈవిడ నాకు ఏదో ఇవ్వడానికి ముందుకొచ్చింది, ఆవిడని కనికరించవమ్మా అని. దానితో ఒక్కసారి ఆవిడింట్లో బంగారు ఉసిరిపళ్ళు రాలాయి. అంటే భగవంతుడి అనుగ్రహం రావడానికి ఏమిటి ముఖ్యం? మనస్సు. సన్యాసం కాదు. మరి సన్యసించడం ఎందుకూ? ఆ మనః స్థితి సంపాదించడానికి. ఆ స్థితి సంపాదించాక భగవద్దర్శనం ఎంతసేపు? క్షణ మాత్రం. అది మనం చేరగానే ఆయన "సిరికించెప్పడు, శంఖ చక్రయుగమున్ చేదోయి సంధింపడు..." అంటూ పరుగెట్టుకొస్తాడు. అందుకే అదితికి పన్నెండు రోజుల్లో కనిపించాడు. ఎంత కష్టపడినా భగవంతుడు కనికరించలేదు అనుకునేవారు తెలుసుకోవల్సినది ఇదే. పన్నెండురోజులు ఒక్క క్షణం కూడా శ్రీహరి తప్ప మనుసులో ఇంకేమీ రాకుండా చూడగలిగితే ఎందుక్కనిపించడూ? దీన్నే

శ్రీరామకృష్ణ పరమహంస చెప్పిన కథలో చూస్తాం. ఓ శిష్యుణ్ణి గురువు ఒక్కసారి నీటిలో ఊపిరి ఆడకుండా ఉంచి తీసాక 'ఎలా ఉంది?' అని అడిగితే 'ఊపిరి అందకపోతే ప్రాణం పోతుందనుకున్నాను' అన్నాట్ట. సరిగ్గా అదే మనఃస్తత్వంతో అంటే భగవంతుడు కనిపించకపోతే చచ్చిపోతాను అనే స్థితికి చేరితే ఒక్క క్షణంలో కనిపిస్తాడు.

భగవంతుడో కల్ప వృక్షం కానీ అడిగేవాడి మనః స్థితి బట్టి ఏది ఇస్తాడో ఏది ఇవ్వడో అనేది మారుతూ ఉంటుంది. శివానందగారు చెప్పినట్టు 'హేయ్ దేవుడా నాకు పదిరూపాయలు కావాలిప్పుడు; ఇచ్చేయ్" అని అడగడం వేరూ, "ఏమీ లేకపోయినా నాకు ఉసిరికాయ ఇచ్చిన ఆవిడ దరిద్రం తీర్చు అనడం వేరూను". గమనించవల్సిన విషయం ఏమిటంటే శంకరులు లక్ష్మీ దేవితో "అమ్మా నువ్వు నాకు డబ్బులిస్తే నేను ఆవిడకిస్తా" అనక పోవడం. అదే శుద్ధమైన మనస్సుతో "అయ్యో ఆవిడకేమీ లేదు, ఆవిడ దరిద్రం తీర్చవమ్మా" అని అడగడానికీ, "ఇది నాకు ఇస్తే నేను నీకు తల నీలాలు ఇస్తా, అది ఇస్తా ఇది ఇస్తా" అని బేరం పెట్టడానికి ఉన్న తేడా. శంకరులు అడిగినదాంట్లో "నేను" అనేదానికి తావులేదు. ఆ "నేను" అనేది పోయింది కనకే ఆయన శ్రీ శంకరభగవత్పాదులు.

అసలు భగవంతుడనేవాడు ఉన్నాడని ఒప్పుకుంటే మనకి లభించేవన్నీ భగవంతుడిచ్చినవే కదా? అంటే మనకొచ్చే జీతం, ఉన్న డబ్బులూ ఇళ్ళూ, వాకిలీ, సంతానం అవన్నీ ఆయనిచ్చినవే అయినప్పుడు, అందులోంచి ఓ పది రూపాయలు తీసి హుండీలో వేయటం, వేసినందుకు ఏదో ఘనకార్యం చేసినట్టు పొంగిపోయి భగవంతుడు మనకేదో ఇవ్వాలనుకోవడం చాలా హాస్యాస్పదంగా అనిపించదూ? అందుకే "భవతు భవదర్థం మమ మనః" – మనస్సనేది భగవంతుడికివ్వాలని శంకరులంటారు. మళ్ళీ ఆ ఇచ్చే మనసు ఎలా ఉండాలి? శుభ్రమైనది. హనుమాన్ చాలీసా చివర్లో తులసీదాసు కూడా అలాగే అంటారు – "పవన తనయ సంకట హరణ మంగళ మారతి రూప్, రామ లఖన సీతా సహిత హృదయ బసహు సురభూప్" అని. అంటే పవన సుతుణ్ణి సీతారామ లక్ష్మణుల సమేతంగా వచ్చి తన హృదయంలో ఉండమని అడుగుతున్నారు. మరి ఆయన వచ్చి వుండాలంటే మనం ఆ హృదయమనే ప్రదేశాన్ని శుభ్రంచేసి ఉంచాలి కదా? అలాంటి శుభ్రమైన మనస్సుకోసం ఎన్నేళ్ళూ, ఎన్ని జన్మలు పడుతుందో ఎవరికెరుక? మళ్ళీ ఈ శుభ్రపరుచుకునే విషయంలో మోసుకోవడానికి ఎవరి శిలువ వారిదే.

క. చూపుల శ్రీపతి రూపము
నాపోవక త్రావి త్రావి హర్షోద్ధతయై
వాపుచ్చి మంద మధురా
లాపంబులఁ బొగడె నదితి లక్ష్మీనాథున్. [8-482]

సీ. యజ్ఞేశ! విశ్వంభరాచ్యుత! శ్రవణ మం;
గళనామధేయ! లోకస్వరూప!
యాపన్న భక్త జనార్తి విఖండన! ;
దీనలోకాధార! తీర్థపాద!
విశ్వోద్భవస్థితి విలయకారణభూత! ;
సంతతానంద! శశ్వద్విలాస!
యాయువు దేహంబు ననుపమ లక్ష్మియు;
వసుధయు దివముఁ ద్రివర్గములును [8-483]

తే. వైదికజ్ఞాన యుక్తియు వైరిజయము
నిన్నుఁ గొలువని నరులకు నెఱయఁ గలదె
వినుతమందార! గుణహార! వేదసార!
ప్రణత వత్సల! పద్మాక్ష! పరమపురుష! [8-483.1]

ఆ. అసురవరులు సురల నదలించి బెదరించి
నాక మేలుచున్న నాఁట నుండి
కన్న కడుపుఁ గాన కంటఁ గూరుకు రాదు
కడుపుఁబొక్కు మాన్పి కావవయ్య. [8-484]

కనిపించిన విష్ణువుని అన్ని విధాలా స్తుతించి అదితి చెప్తోంది – బలి ఇంద్రపదవి ఎక్కినప్పట్నుంచి నాకు కంటి మీద నిద్రలేదు. కన్న కడుపుశోకం తీర్చు అంటూ. నిన్ను కొలవని వారికి “వైదికజ్ఞాన యుక్తియు వైరిజయము” అనడంలో కశ్యపుడికున్న విజ్ఞానం నీవల్లే వచ్చింది సుమా, నాకు కూడా అలాగే శత్రువులమీద విజయం వస్తుందనుకుంటున్నాను అని చెప్పకనే చెప్తోంది. అదితి ప్రార్థన విన్నాక శ్రీహరి ఏమన్నాడో చూద్దాం.

## వామన జననం – వామనావతారం – 5

భగవంతుడు కల్ప వృక్షం అనీ, ఏది అడిగితే అది ఇస్తాడనీ, అయితే ఏ మనసు పెట్టి ఎలా అడిగామనేది ముఖ్యం అని చెప్పుకున్నాం. ఇక్కడ పోతన కూడా అదే చెప్తున్నాడు కనపడిన విష్ణువు గురించి – ఆశ్రిత కామధేనువైన పరమేశ్వరుడు అని. అదితికి, చేసిన వ్రతం ఫలితంగా కనిపించిన విష్ణువు ఇప్పుడు చెప్తున్నాడు.

వ. అనిన విని దరహసితవదనుండయి యాశ్రితకామధేనువైన యప్పరమేశ్వరుం డిట్లనియె. [8-485]

శా. నీ కోడండ్రును, నీ కుమారవరులున్, నీ నాథుఁడున్, నీవు సం
శ్లోకింపన్ సతులుం బతుల్ మిగుల సమ్మోదింప రాత్రించరుల్
శోకింపన్, భవదీయ గర్భమునఁ దేజోమూర్తి జన్మించెదన్
నాకున్ వేడుక పుట్టు నీ సుతుఁడనై నర్తించి వర్తింపఁగాన్. [8-486]

నువ్వూ నీ కుటుంబం అందరూ సంతోషించేలాగ, దైత్యులందరూ శోకించేలాగా చేయడానికి నీకు కొడుకై పుట్టబోతున్నాను. నాకు కూడా నీ ఒడిలో ఆడుకోవాలని ఉంది. మరి ఈ పుట్టడం ఎందుకయ్యా, ఆ సుదర్శన చక్రానికి పురమాయిస్తే ఓ క్షణంలో పనైపోదూ? ఇలాంటి ప్రశ్న ఉదయిస్తుందనే ఎందుకో చెప్తున్నాడు.

మ. బలిమిన్ దైత్యులఁ జంపరాదు వినయోపాయంబునం గాని; సం
చలనం బొందకు; నేను నీ నియతికిన్ సద్భక్తికిన్ మెచ్చితిన్;
బలి విద్వేషియు నా నిలింపగణముం బౌలోమియున్ మెచ్చ దై
త్యుల రాజ్యంబు హరింతు; నింద్రునికి నిత్తున్; దుఃఖమింకేటికిన్? [8-487]

నూరు అశ్వమేధాలు చేసి ఇంద్రపదవికి అర్హత సంపాదించినవాణ్ణి ఎలా చంపడం? అది కుదిరేపనికాదు. వినయంగా వెళ్ళి మాయలతో రాజ్యం వెనక్కి తీసుకోవాలి. నీ భక్తికి మెచ్చాను. ఇంక చింతించవల్సిన పనిలేదు. శోకమూ

అఖ్ఖర్లేదు. ఇలా అని శ్రీహరి అదితి గర్భంలోకి ప్రవేశించాడు. వామనావతారంలో కూడా కృష్ణావతారంలో ముందు దేవకికి కనిపించి చెప్పి ముహుర్తాలూ అన్నీ నిర్ణయించుకుని రాబోయే జన్మకి విష్ణువు తయారుగా పెట్టాడన్నమాట. ఎప్పుడు, ఏ లగ్నంలో పుడితే ఇవన్నీ సానుకూలంగా జరుగుతాయో అవన్నీ ఆయనికి తెలుసు కాబట్టి ఆ ముహుర్తంలో పుట్టడానికి అన్నీ సిద్ధంగా ఉన్నాయి.

మ. రవి మధ్యాహ్నమునం జరింప గ్రహతారాచంద్రభద్రస్థితిన్
శ్రవణద్వాదశినాఁడు శ్రోణ నభిజిత్సంజ్ఞాత లగ్నంబునన్
భువనాధీశుఁడు పుట్టె వామనగతిం బుణ్యవ్రతోపేతకున్
దివిజాధీశ్వరు మాతకుం బరమపాతివ్రత్య విఖ్యాతకున్. [8-506]

శ్రావణ ద్వాదశి నాడు సూర్యుడు మధ్యాహ్నం అభిజిత్ లగ్నంలో ఉన్నప్పుడు వామనుడు అవతరించాడు. అభిజిత్ లగ్నం అంటే, మిట్టమధ్యాహ్నము 24 నిమిషముల ముందు నుండి 24 నిమిషములవరకు ఉండే కాలం. దీనినే రోజులో 8వ ముహూర్తము అనడం కూడా. ఈ అభిజిత్ ముహుర్తంలోనే, సీతని వెదకడానికి దక్షిణంగా వెళ్ళే వారనసేన బయల్దేరిందనీ, శివుడు త్రిపురాసుర సంహారం చేసాడనీ చెప్తారు.

వ. మఱియు నద్దేవుండు శంఖచక్రగదా కమల కలిత చతుర్భుజుండునుఁ బిశంగవర్ణవస్త్రుండును. మకరకుండల మండిత గండభాగుండును, శ్రీవత్సవక్షుండును, నళినచక్షుండును, నిరంతర శ్రీవిరాజిత రోలంబ కదంబాలంబిత వనమాలికా పరిష్కృతుండును, మణికనకాంచిత కాంచీవలయాంగద కిరీటహార నూపురాలంకృతుండునుఁ, గమనీయ కంఠ కౌస్తుభాభరణుండును, నిఖిలజన మనోహరణుండునునై యవతరించిన సమయంబున. [8-507]

పుట్టిన వామనుడెలా వచ్చాడు? కిరీటం, మకర కుండలాలు, శంఖ చక్ర గదా కమల కలిత చతుర్భుజుండునుఁ అన్నీ వెంటబెట్టుకుని వచ్చాడు. "కిరీటి మకర కుండల, కేయూర, హార కటక కౌస్తుభ మణి మేఖలాంబర వలమాలికా విరాజితుండును" లాంటి వర్ణన ఎక్కడైనా కనబడితే దాదాపు ముప్పాతిక మూడొంతులు అది పోతన రచనే అని వెంఠనే చెప్పేయవచ్చు. అందుకే – పోతన మొత్తం భాగవతంలో విష్ణువుని వర్ణిచడానికి ఒకే విధమైన వర్ణన ఎన్నిసార్లు చెప్పాడో చూస్తే, తన కళ్లముందు విష్ణువుని చూస్తూ భాగతవం తెనిగించాడేమో అనిపిస్తూ ఉంటుంది.

శా. చింతం బాసిరి యక్ష తార్క్ష్య సుమనస్సిద్ధోరగాధీశ్వరుల్
సంతోషించిరి సాధ్య చారణ మునీశబ్రహ్మ విద్యాధరుల్
గాంతిం జెందిరి భానుచంద్రములు; రంగద్గీత వాద్యంబులన్
గంతుల్ వైచిరి మింటఁ గింపురుషులున్ గంధర్వులుం గిన్నరుల్. [8-508]

హమ్మయ్యా, కష్టాలు తీరిపోయే రోజు దగ్గిర్లోనే ఉందని యక్ష, తార్క్ష్య (అంటే గరుడులు) సుమనలు (దేవతలు) స్సిద్ధోరగాధీశ్వరుల్ (సిద్ధులూ, ఉరగులంటే నాగులు) అందరూ సంతోషించారు. గ్రహణం తొలగిపోయాక వచ్చే కళలతో సూర్య చంద్రులు వెలిగారు. కిన్నరులూ కింపురుషులూ రంగద్గీత వాద్యాలతో నాట్యం చేసారు. భగవంతుడి ముందు ఏయే గీతాలూ, రాగాలూ, వాద్యాలూ ఉంటాయనేది తెలుసుకోవాలంటే ఓ సారి స్వామి రామానుజలు రాసిన శ్రీనివాస గద్యం మధ్యలో చదివి చూద్దాం.

"…. మడ్డుడిండిమ ఢమరు జర్ఝర కాహళీ పటహావళీ మృదుమర్దలాది మృదంగ దుందుభి ఢక్కికాముఖ హృద్యవాద్యక మధురమంగళ నాదమేదుర నాటారభి భూపాళ బిలహరి మాయామాళవ గౌళ అసావేరీ సావేరీ శుద్ధసావేరీ దేవగాంధారీ ధన్యాసీ బేగడ హిందుస్తానీ కాపీ తోడి నాటకురుంజీ శ్రీరాగ సహన అఠాణ సారంగీ దర్బారు పంతువరాళీ వరాళీ కళ్యాణీ భూరికళ్యాణీ యమునాకళ్యాణీ హుశేనీ జంఝోటీ కౌమారీ కన్నడ ఖరహరప్రియా కలహంస నాదనామక్రియా ముఖారీ తోడీ పున్నాగవరాళీ కాంభోజీ భైరవీ యదుకులకాంభోజీ ఆనందభైరవీ శంకరాభరణ మోహన రేగుప్తీ సౌరాష్ట్రీ నీలాంబరీ గుణక్రియా మేఘగర్జనీ హంసధ్వని శోకవరాళీ మధ్యమావతీ జేంజురుటీ సురటీ ద్విజావంతీ మలయాంబరీ కాపీపరశు ధనాసిరీ దేశికతోడీ ఆహిరీ వసంతగౌళీ సంతు కేదారగౌళ కనకాంగి రత్నాంగి గానమూర్తి వనస్పతీ వాచస్పతీ దానవతీ మానరూపీ సేనాపతీ హనుమత్తోడీ ధేనుకా నాటకప్రియా కోకిలప్రియా రూపవతీ గాయకప్రియా వకుళాభరణ చక్రవాక సూర్యకాంత హాటకాంబరీ ఝుంకారధ్వనీ నటభైరవీ కీరవాణీ హరికాంభోదీ ధీరశంకరాభరణ నాగానందినీ యాగప్రియాది విస్మమర సరస గానరుచిర సంతత సంతన్యమాన నిత్యోత్సవ పక్షోత్సవ మాసోత్సవ సంవత్సరోత్సవాది వివిధోత్సవ కృతానందః శ్రీమదానందనిలయ విమానవాసః, …."

మరీ రాగాలకి వాద్యాలో? అవి కూడా వివరిస్తున్నారు చూడండి.

"... రథ గజ తురగ పదాతి సేనా సమూహ భేరీ మద్దళ మురవక ఝల్లరీ శంఖ కాహళ నృత్యగీత తాళవాద్య కుంభవాద్య పంచముఖవాద్య అహమీమార్గన్నటీవాద్య కిటికుంతలవాద్య సురటీచౌండోవాద్య తిమిలకవితాళవాద్య తక్కరాగ్రవాద్య ఘంటాతాడన బ్రహ్మతాళ సమతాళ కొట్టరీతాళ ఢక్కరీతాళ ఎక్కాళ ధారావాద్య పటహకాంస్యవాద్య భరతనాట్యాలంకార కిన్నెర కింపురుష రుద్రవీణా ముఖవీణా వాయువీణా తుంబురువీణా గాంధర్వవీణా నారదవీణా స్వరమండల రావణహస్తవీణాస్తక్రియాలంక్రియాలంకృతానేకవిధవాద్య వాపీకూపతటాకాది గంగాయమునా రేవావరుణా శోణనదీశోభనదీ సువర్ణముఖీ వేగవతీ వేత్రవతీ క్షీరనదీ బాహునదీ గరుడనదీ కావేరీ తామ్రపర్ణీ ప్రముఖాః మహాపుణ్యనద్యః సజలతీర్థైః సహోభయకూలంగత సదాప్రవాహ ఋగ్యజుస్సామాథర్వణ వేదశాస్త్రేతిహాస పురాణ సకలవిద్యాఘోష భానుకోటిప్రకాశ చంద్రకోటి సమాన నిత్యకళ్యాణ పరంపరోత్తరోత్తరాభివృద్ధిర్భూయాదితి భవంతో మహాంతోஉనుగృహ్ణంతు..."

ఇందులో "గాంధర్వవీణా నారదవీణా స్వరమండల రావణహస్తవీణా" అనడంలో కూడా ధర్మాధర్మాలూ, శత్రుమిత్రులూ, అనేకానేక విభిన్నమైనవన్నీ భగవంతుడే అని చెప్తున్నారన్నమాట.

క. దిక్కులకావిరి వాసెను
నెక్కువ నిర్మలత నొందె నేఁడు పయోధుల్
నిక్కమెయి నిలిచె ధరణియుఁ
జుక్కల త్రోవయును విప్రసుర సేవ్యములై. [8-509]

క. ముంపుఁగొని విరుల వానల
జొంపంబులు గురియు సురలు, సమనోమధువుల్
తుంపర లెగయఁ బరాగపు
రొంపుల భూభాగమతి నిరూషిత మయ్యెన్. [8-510]

మరి వామనుడు మంచి ముహూర్తంలో పుట్టాక ఏమైంది? దిక్కులన్నీ ప్రకాశవంతం అయ్యాయి. సముద్రాలు నిర్మలంగా – అంటే ఏ ఉత్పాతాలు లేకుండా – ఉండడం మొదలైంది. మంచి వర్షాలు కురిసి భూమి సుందరంగా తయారైంది. ఇదే శ్రీనివాస గద్యం చివర్లో చెప్తున్నారు కూడా ఆశిర్వాదం ఇస్తున్నాట్టూ "...బ్రహ్మణ్యో రాజా ధార్మికోఽస్తు, దేశోయం నిరుపద్రవోఽస్తు, సర్వే సాధుజనాస్సుఖినో విలసంతు, సమస్త సన్మంగళాని సంతు, ఉత్తరోత్తరాభివృద్ధిరస్తు, సకలకళ్యాణ సమృద్ధిరస్తు ." గమనించారా? ఆశీర్వచనం ఇచ్చేటప్పుడు గానీ దీవించేటప్పుడు కానీ ఏమంటున్నారో? "....సమస్త సన్మంగళాని సంతు, ఉత్తరోత్తరాభివృద్ధిరస్తు, సకలకళ్యాణ సమృద్ధిరస్తు." ఒక్క మనిషికోసం ఎప్పుడూ ఆశీర్వచనం ఇవ్వరు. సర్వేజనా సుఖినోభవంతు అనేదే ముఖ్యం. అటువంటి ప్రపంచం వల్లే మన అందరి అభివృద్ధీ సులభ సాధ్యం.

ఆ. ఈ మహానుభావుఁ డెట్లింత కాలంబు
నుదర మందు నిలిచి యుండె ననుచు
నదితి వెఱఁగుపడియె నానంద జయశబ్ద
ములను గశ్యపుండు మొగి నుతించె. [8–512]

మరి అదితి ఎలా ఉంది ఇటువంటి కొడుకు పుట్టాక? ఇంతటి మహానుభావుడు ఇంతకాలం నా గర్భంలో ఎలా ఉన్నాడా అని ఆశ్చర్యపడింది. కశ్యపుడు కూడా సంతోషించాడు.

వ. అంత నవ్విభుండు సాయుధసాలంకారంబగు తన దివ్యరూపంబు నుజ్జగించి రూపాంతరం బంగీకరించి కపటవటు చందంబున నుపనయనవయస్కుండైన వామన బాలకుండై తల్లి ముంగటఁ గుమార సముచితాలాపంబు లాడుఁచు గ్రీడించు సమయంబున నదితియుం దనయ విలోకన పరిణామ పారవశ్యంబున. [8–513]

మొదట వచ్చినప్పుడు ఎలా ఉన్నాడు? "కిరీట మకర కుండల కేయూర..." అలా అన్నింటితో వచ్చాడు కదా? అవన్నీ ఉపసంహరించి, కుర్రవాడిలా రూపాంతరం చెంది, అదితి వడిలో చేరాడు. ఎలా చేరాడు? "వామన బాలకుండై..." అటువైపు కష్టాలు తీర్చే కొడుకు పుట్టాడని అదితి సంతోషం ఆవిడది.

క. నన్నుఁ గన్న తండ్రి! నా పాలి దైవమ!
నా తపఃఫలంబ! నా కుమార!
నాదు చిన్ని వడుగ! నా కులదీపిక!
రాఁగదయ్య; భాగ్య రాశి వగుచు [8-514]

క. అన్నా! రమ్మని దగ్గఱి
చన్నుల పాలేఁటువాఱ సంశ్లేషిణి యై
చిన్నారి మొగము నివురుచుఁ
గన్నారం జూచెఁ గన్నకడుపై యుంటన్. [8-515]

క. పురు డీ బోటికి నిందిర
పురు డంబిక గాక యొరులు పురుడే? యనుచున్
బురుటాలికిఁ బది దినములు
పురుడు ప్రవర్తించి రెలమిఁ బుణ్యపు గరితల్. [8-516]

ఈ పద్యాలలో అదితి మాతృత్వాన్ని వర్ణిస్తున్నాడు పోతన. అప్పుడే కదా పుట్టాడు? ముందే చెప్పాడు కదా, తాను వచ్చి ఇంద్రాదులందరికీ మళ్ళీ రాజ్యం ఇప్పిస్తానని? అందుకే అది తి "కులదీపిక" అంటోంది. ఇక్కడ విష్ణువు ఇంద్రుడుకి తమ్ముడై పుట్టాడన్న మాట.

వ. అంత నబ్బాలునకు సంతసంబున మహర్షులు కశ్యపప్రజాపతిం బురస్కరించుకొని సముచితోపనయనకర్మ కలాపంబులు చేయించిరి; సవిత సావిత్రి నుపదేశించె, బృహస్పతి యజ్ఞోపవీతధారణంబునుఁ, గశ్యపుండు ముంజియుఁ, గౌపీనం బదితియు, ధరణి కృష్ణాజినంబును, దండంబు వనస్పతి యగు సోముండును, గగనాధిష్ఠానదేవత ఛత్రంబునుఁ, గమండలువు బ్రహ్మయు, సరస్వతి యక్షమాలికయు, సప్తర్షులు కుశపవిత్రంబులు నిచ్చిరి; మఱియును. [8-517]

వామనుడు పెరిగి కొంచెం పెద్దవాడయ్యేసరికి ఉపనయనం సంకల్పించారు. ఉపనయనంలో పంచశిఖలు పెట్టి గాయత్రీ మంత్రం ఉపదేశం ఇస్తారు. ఇక్కడ ఎవరెవరు వామనుడికేమిచ్చారో చెప్తున్నాడు. సవిత (సూర్యుడు) గాయత్రీ మంత్రం ఇస్తే బృహస్పతి యజ్ఞోపవీతం, కశ్యపుడు ముంజి ధర్భలూ, అదితి బట్టలూ, భూదేవి కృష్ణాజినంబును, దండంబు వనస్పతి యగు సోముండును, గగనాధిష్ఠానదేవత (అంటే ఎండ పడకుండా ఆకాశానికి అధిష్టాన దేవత) ఛత్రంబునుఁ, గమండలువు బ్రహ్మయు (ఆ కమండలంలో ఉండేది తెలుసు కదా?) , సరస్వతి యక్షమాలికయు (జపమాల), సప్తర్షులు కుశపవిత్రంబులు (ధర్భలు). ఇంకా ఎవరేమిచ్చారంటే..

క. బిక్షాపాత్రిక నిచ్చెను
యక్షేశుఁడు వామనునకు; నక్షయ మనుచున్
సాక్షాత్కరించి పెట్టెను
బిక్షునకు భవాని పూర్ణబిక్ష నరేంద్రా! [8-518]

కుబేరుడు వచ్చి బిక్షాపాత్ర ఇచ్చాడు. మరి అందులో బిక్ష వేసిందెవరు? భవాని (అంటే అన్నపూర్ణ) సాక్షాత్కరించి మొదటి భిక్ష వేసింది. ఇచ్చేటప్పుడు ఏమన్నారు? "అక్షయమనుచున్..." అంటే ముందు ముందు ఎక్కడ బిక్ష అర్ధించినా "లేదు" అని ఎవరూ అనలేరన్న మాట.

క. శుద్ధబ్రహ్మర్షి సమా
రాద్ధుండై విహితమంత్రరాజిఁ జదువుచుం
బ్రోద్ధంబగు ననలంబున
వృద్ధాచారమున వటుఁడు వేల్చెన్ గడకన్! [8-519]

ఇలా ఉపనయనంలో అన్నీ శాస్త్రోక్తంగా జరగగానే వేదమంత్రాలు చదువుతూ ఉపనయన సమయంలో సంప్రదాయబద్ధంగా హోమం చేసాడు వామనుడు. ఇంక బయల్దేరే సమయం వచ్చింది.

ఇక్కడ్నుంచి పోతన రాసిన పద్యాలు అత్యద్భుతం. ఆడిగేవాడినీ తీసుకునేవాడినీ ఎన్ని వివిధమైన పదాలతో రాసాడో జాగ్రత్తగా గమనించండి. ఈ పదాలకి కిందగీత ఉంచాను గుర్తుపెట్టుకోవడానికి. అసలు తెలుగులో ఇన్ని పదాలున్నాయా అని మనకి ఆశ్చర్యం వేస్తూ ఉంటుంది. తెలుగు మాట అటుంచితే ఇక్కడ్నుంచి రాసిన పద్యాల్లో భక్తిభావం ఎటువంటుదంటే ఎన్నోసార్లు కళ్ళు చెమర్చి అక్షరాలు కనబడకుండా పోతాయి చదువుతూంటే.

వ. ఇట్లు కృతకృత్యుండైన మాయామాణవకుండు దేశాంతర సమాగతు లగు బ్రాహ్మణులం గొందఱ నవలోకించి యిట్లనియె. [8-520]

క. వత్తురె విప్రులు? వేఁడఁగ
నిత్తురె దాతలును వేడ్క నిష్టార్థములం?
దెత్తురె మీరును సంపద?
లిత్తెఱఁగున దాన వీరుఁ డెవ్వఁడొ చెపుడా. [8-521]

ఇలా అన్ని సిద్ధం చేసుకున్న మాయా మాణవకుడు (కపట బ్రహ్మచారి) ఇతర దేశాలనుంచి వచ్చిన కొంతమందిని కల్సి అడుగుతున్నాడు. ఇచ్చేదాతలు ఉన్నారా దేశంలో? ఇచ్చేవారున్నా పుచ్చుకునే విప్రులున్నారా? ఈ రోజుల్లే అడిగినదల్లా ఇచ్చే మొనగాడెవడైనా ఉన్నాడా? తెలిస్తే చెప్పండి అని అడుగుతున్నాడు. అంటే ఏమిటన్నమాటా? ఎవర్నో ఒకణ్ణి అడగడం, లేదనిపించుకోవడం అన్నీ ఎందుకూ? పుచ్చుకునేది సరైన దాత దగ్గిర్నుంచే పుచ్చుకోవాలి. ఆ రోజుల్లో ఎలా ఉండేదంటే తాను బ్రాహ్మణీకం చేస్తూ రాజుల దగ్గిరకి వెళ్ళి దానం అభ్యర్థించడం. రాజు ఇవ్వననడం సర్వసాధారణంగా ఉండేది ఉండదు ఎందుకంటే మొదట్లో శ్రీనివాస గద్యంలో చెప్పినట్టూ.. "బ్రహ్మణ్యోరాజా ధార్మికోస్తు."

మ. కలరున్ దాతలు; నిత్తురున్ ధనములుం; గామ్యార్థముల్ గొంచు వి
ప్రులు నేతెంతురు; గాని యీవిని బలిం బోలన్ వదాన్యుండు లేఁ
డలఘుండై యొనరించె నధ్వరశతం బా భార్గవానుజ్ఞచే;
బలి వేఁడం బడయంగ వచ్చు బహుసంపల్లాభముల్ వామనా [8-523]

ఆ విప్రులు సమాధానం చెప్తున్నారు వామనుడికి. "ఇచ్చే దాతలు ఉన్నారు. అడిగినవి ఇస్తూ ఉంటారు కూడా. అయితే నూరు అశ్వమేధాలు శుక్రాచార్యుల అనుజ్ఞతో చేసిన బలి ఉన్నాడే, ఆయనకి మించిన దాత లేదు. ఆయన్నడిగితే ఏమి కావలిస్తే అదే ఇస్తాడు."

క. ప్రక్షీణ దివిజ వల్లభ
రక్షాపరతంత్రుఁ డగుచు రాజీవాక్షుం
డా క్షణమున బలి యింటికి
భిక్షాగమనంబు జేసెఁ బేదఱికముతోన్. [8-525]

ఇవన్నీ విన్నాడు వామనుడు. తల్లికీ తండ్రికీ చెప్పి లోకాలకి మేలు చేయడానికి, దైన్యం పట్టిన దేవేంద్రుణ్ణి రక్షించడానికి పేదరికం అడ్డంపెట్టుకుని యాచించడానికి ఆ క్షణంలోనే బయల్దేరే వెళ్ళాడు బలి దగ్గిరకి. ఈ పద్యంలో "క్ష" అనే అక్షరాన్ని పోతన ఎంత సులభంగా వాడాడో తెలిస్తోంది కదా?

ముందు ముందు "హరి" అనే పదాన్ని పోతన ఎలా వాడతాడో, బలి దగ్గిరకి వామనుడెలా వెళ్ళాడో, వెళ్ళి ఏం చేసాడో, ఆ వచ్చిన వామనుణ్ణి బలి ఎలా ఆహ్వానించాడో చూద్దాం..

## వామనుడికి బలి ఆహ్వానం– వామనావతారం – 6

మహావిష్ణువంటే ఎవరు? శ్రీకాంతుడు, లక్ష్మీ పతి. లక్ష్మీ దేవిని వక్షస్థలంలో ఉంచుకున్నవాడు. ఆ లక్ష్మీ దేవి ఎటువంటిది? "దిగ్ఘస్తిభిః కనకకుంభముఖావసృష్ట స్వర్వాహినీ విమలచారుజలప్లుతాంగీమ్, ప్రాతర్నమామి జగతాం జననీమశేష లోకాధినాథగృహిణీమమృతాబ్ధిపుత్రీమ్" అన్నారు కదా శ్రీ శంకర భగవత్పాదులు? సకల సంపదలకీ, అష్టైశ్వర్యాలకీ మూలమైనది. అటువంటి లక్ష్మీ పతి , శ్రీహరి ఎందుకు వెళ్ళాడు బలి చక్రవర్తి దగ్గిరకి? బిక్షాటనికి! ఆ విచిత్రాన్నే పోతన చెప్తున్నాడు హరి అనే పదాన్ని వాడుతూ మనం భాగవతం ఎందుకు చదువుతున్నామో మర్చిపోకుండా చేయడానికి.

క. హరిహరి; సిరి యురమునఁ గల
హరి హరిహయుకొఱకు దనుజు నడుగం జనియెన్;
బరహితరత మతియుతులగు
దొరలకు నడుగుటయు నొడలి తొడవగుఁ బుడమిన్. [8–526]

అయ్యయ్యో (హరిహరి), లక్ష్మీ దేవిని వక్షంలో ఉంచుకుని హరి బిక్షాటనకి బయల్దేరాడు. ఎవరికోసం? పరుల హితం కోసం. మరి అలా పరుల హితం ఆశించి బిక్షాటన బయల్దేరేవారికి అడుక్కోవడం కూడా అలంకారమే కదా?

కరుణశ్రీగారి సంపాదకత్వంలో తి.తి.దే వారు ప్రచురించిన పోతన పుస్తకాలలో "హరిహరి" అనేదాన్ని "ఔరా" అని అనువదించారు సందర్భానుచితంగా. వారణాసిలో బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం కోసం మదన్ మోహన్ మాలవ్యా గారు ఇదే విధంగా డబ్బులు సేకరించారుట. ఆఖరికి శవాలు మోసేచోట వాళ్ళు వేసే చిల్లర కూడా ఏరి ఏరి విశ్వవిద్యాలయానికి ఇచ్చారంటారు. అలా కష్టపడి మొదలుపెట్టిన ఆ విశ్వవిద్యాలయం అధికారపు ముద్ర మీద సరస్వతీ దేవి బొమ్మతోబాటు ఈశావాస్యోపనిషత్ లోని "విద్యా అమృతమశ్నుతే" అనే వాక్యం రాయించారు.

క. సర్వప్రపంచ గురుభర
నిర్వాహకుఁ డగుటఁజేసి నెఱిఁ జనుదేరన్
ఖర్వుని వ్రేఁగు సహింపక
నుర్వీస్థలి గ్రుంగె; మ్రొగ్గె నురగేంద్రుండున్. [8-527]

ప్రపంచం అంతటినీ భరించే వాడు కదా భగవంతుడంటే? అటువంటివాడు బయల్దేరే సరికి ఆయన బరువుకి భూమి ఒక వేపు కుంగిపోయింది. దానితోపాటు ఆయన్ని మోసే ఆదిశేషుడూ (ఉరగేంద్రుండు) వంగిపోయేడు.

క. శర్మద, యమదండక్షత
వర్మద, నతి కఠిన ముక్తి వనితాచేతో
మర్మద, నంబునివారిత
దుర్మద, నర్మదఁ దరించెఁ ద్రోవన్ వటుఁడున్. [8-529]

వెళ్ళేదారిలో వటుఁడు నర్మదానదిని దాటాడు. ఆ నర్మద ఎటువంటిది? శుభాలనిచ్చేది, యముని దండాన్నుంచి కాపాడేది. దోషాలన్నీ నివారించేది. ఈ పద్యం మళ్ళీ ఓ సారి చదివితే పోతన వాడిన ప్రాస (శర్మద, వర్మద, నర్మద, దుర్మద, మర్మద...) చిరునవ్వు తెప్పించదూ?

వ. దాటి తత్ప్రవాహంబున కుత్తరతటంబు నందు. [8-530]

శా. చండస్ఫూర్తి వటుండుఁ గాంచె బహుధాజల్పన్నిశాటంబు, ను
ద్దండాహూత మునీభ్యబిభ్యదమృతాంధస్సిద్ధకూటంబు, వే
దండాశ్వధ్వజనీ కవాటము, మహోద్యద్ధామ సంఛన్న మా
ర్తాండస్యందన ఘోటమున్, బలిమఖాంతర్వేది కావాటమున్. [8-531]

అద్భుతమైన బ్రహ్మ వర్చస్సుతో వెలిగే వామనుడు అలా నడుచుకుంటూ పోయి నర్మదానదికి ఉత్తరంగా ఉన్న బలి యాగవేదిక సమీపించాడు. అక్కడ వామనుడుకి ఏమి కనిపించింది? నోటికొచ్చినట్టు మాట్లాడుతూ దేవతల్ని భయపెట్టే రాక్షసులు, యాగం చేయించే ఉద్ధండులైన మునులు, ఏనుగులూ గుర్రాలూ ఉన్న, సూర్యుడి రథంలా మెరిసిపోయే యజ్ఞవాటిక. ఈ పద్యంలో "జల్పననిశాటంబు" అని వాడాడు పోతన. జల్పనము అంటే? ఉపయుక్తం కాని మాట్లాడ్డం. ఇటువంటివాటికి మనం తెలుగు నిఘంటువు చూడాల్సిందే.

వ. కని దానవేంద్రుని హయమేధ వాటి దఱియం జొచ్చు నయ్యవసరంబున. [8-532]

అలా పోయి పోయి హయమేధ (అంటే అశ్వమేధం చేసే యజ్ఞవాటిక) వచ్చే సమయానికి

శా. శంభుండో హరియో పయోజభవుఁడో చండాంశుఁడో వహ్నియో
దంభాకారత వచ్చెఁ గాక ధరణిన్ ధాత్రీసురుం డెవ్వఁడీ
శుంభద్యోతనుఁ డీ మనోజ్ఞ తనుఁ డంచున్ విస్మయభ్రాంతులై
సంభాషించిరి బ్రహ్మచారిఁ గని తత్సభ్యుల్ రహస్యంబుగన్. [8-533]

ఆలా వచ్చే వామనుణ్ణి చూసి మొత్తం జనం అంతా ఆశ్చర్యంగా తమలో తాము అనుకుంటున్నారు – ఈ వచ్చేది మారువేషంలో ఉన్న శంభుండో (శివుడా?), హరియో (విష్ణువా?), పయోజభవుడో (అంటే పద్మంలోంచి పుట్టిన బ్రహ్మ?), చండాంశుఁడో (సూర్యుడా?), వహ్నియో (అగ్నిదేవుడా?). లేకపోతే ఇటువంటి వర్చస్సు ఎలా సాధ్యం? కొంతమంది రాసినట్టూ వచ్చే వామనుణ్ణి చూసి బలి, అక్కడున్న యజ్ఞవాటిక అంతా ఆ వామనుడి వర్చస్సుకు ఎండ మొహం మీద పడితే చేతులు అడ్డంపెట్టుకున్నట్టూ పెట్టుకుని తేరిపార చూసారుట.

క. గుజగుజలు పోవువారును
గజిబిజిఁ బడువారు చాలఁ గలకల పడుచున్
గజిబిజి యైరి సభాస్థలిఁ
బ్రజ లెల్లను బొట్టివడుగు పాపని రాకన్. [8-534]

ఇలా గుసగుసలాడుకుంటూ ఎవరో ఆ వచ్చేది అని తికమక పడుతూ వామనుడు యజ్ఞవాటికలోకి రావడం చూసారు. ఆ వచ్చిన వామనుడు వెంఠనే బలి దగ్గిరకి తిన్నగా వెళ్లాడా?

వ. ఆ సమయంబున బలిసభామండపంబుఁ దఱియం జొచ్చి. [8-535]

సీ. చవులుగాఁ జెవులకు సామగానంబులు;
చదువు నుద్గాతల చదువు వినుచు
మంత్ర తంత్రార్థ సంబంధభావములు పే;
ర్కొనెడి హోతలతోడఁ గూడికొనుచు
హోమకుండంబులం దున్న త్రేతాగ్నుల;
వెలిఁగించు యాజక వితతిఁ గనుచు
దక్షులై బహువిధాధ్వర విధానంబులు;
చెప్పెడు సభ్యులఁ జేరఁ జనుచుఁ [8-536]

తే. బెట్టుగోరెడు వేడుక పట్టుపఱుచు
నదితి పుట్టువు లచ్చికి నాటపట్టు
కోరి చరియించె సభలోనఁ గొంతఁదడవు
పుట్టు వెన్నఁడు నెఱుగని పొట్టివడుఁగు. [8-536.1]

చుట్టూరా ఉన్నదంతా గమనించుకుంటూ లోపల కాసేపు తిరిగాడు. ఎక్కడైనా ఒక చోట వేద పఠనం జరుగుతోందనుకోండి. కొత్తగా ఎవరైనా వస్తే – ఆ వచ్చినవాడు ఎంత పెద్ద మనిషైనా – ఏం చేస్తాడు? ఆ వేదపఠనంలో తన గొంతు కలుపుతాడు – అదే పద్ధతి కనక. అలా వేదం చదవడం రాకపోతే నిశ్శబ్దంగా అది అయ్యే వరకూ వేచి ఉంటాడు కదా? అలాగే ఈ యజ్ఞవాటికలో తిరుగుతూ వేద పఠనంలో పాలుపంచుకుంటూ, హోమం జరిగేచోట ఆ త్రేతాగ్నులన్నీచూస్తూ కలయతిరిగాడు కాసేపు.

క. వెఱచుచు వంగుచు వ్రాలుచు
నఱిముఱిఁ గబురులకుఁ జనుచు హరిహరి యనుచున్
మఱుఁగుచు నులుకుచు దిఱదిఱఁ
గురుమట్టపుఁ బడుచు వడుగుఁ గొంత నటించెన్. [8-538]

క. కొందఱతోఁజర్చించును
గొందఱతో జటలు చెప్పు గోష్ఠిం జేయుం
గొందఱతోఁ దర్కించును
గొందఱతో ముచ్చటాడుఁ; గొందఱ నవ్వున్. [8-539]

తన నిజరూపం ఎవరికీ అంటుబట్టకుండా ఉండడం కోసమా అన్నట్టు కాసేపు బెదురుతూ, కాసేపు ఇక్కడో చర్చా అక్కడో మాటా మాట్లాడుతూ యజ్ఞవేదికలో నటించాడు.

వ. మఱియు ననేక విధంబుల నందఱకు నన్ని రూపులై వినోదించుచు. [8-540]

క. వెడవెడ నడకలు నడచుచు
నెడనెడ నడు గిడక నడరి యిల దిగఁబడగా
బుడిబుడి నొడువులు నొడువుచుఁ
జిడిముడి తడఁబడగ వడుగు చేరెన్ రాజున్. [8-541]

ఇలా చిన్న చిన్న అడుగుల్తో, ఆయన అడుగులకి భూమి క్రుంగిపోతూండగా వడుగు మొత్తానికి బలి చక్రవర్తిని సమీపించాడు. ఇలా ఎందుకు? మొదట్లోనే తిన్నగా బలిదగ్గిరకి వెళ్ళిపోవచ్చు కదా? అలా కుదరదు. బలి చక్రవర్తి అడిగినది ఇస్తాడు కదా అని "హేయ్ ఇలా ఇది నాక్కావాలి ఇచ్చేయ్" అని అడగడం బావుండదు కదా? తన వేద పాండిత్యం చూపించాలి. తన వర్చస్సుకి బలి అదిరిపడి "ఏమి కావాలో కోరుకో" అని అడగాలి. అప్పుడు ఏదడిగినా

బాగుంటుంది. అదన్న మాట మొదటినుండీ మాయావటుడి ఆలోచన. అందుకే మొదట వచ్చి యజ్ఞవాటిక అంతా కలయతిరగడం, సామవేదం చదివే వాళ్లతో గొంతు కలపడం అవన్నీను. ఈ పద్యం చదువుతూంటే పాలసముద్రం చిలికేటప్పుడు మందర పర్వతం ఎలా తిరుగుతోందో (ఎడమఁ గుడి మునుపు దిరుగుచు .. 8.211) వర్ణించే పద్యం తప్పకుండా గుర్తుకొస్తుంది.

వ. ఇట్లు డగ్గఱి మాయాబిక్షుకుండు రక్షోవల్లభుం జూచి యిట్లనియె. [8-542]

మ. ఇతఁడే దానవచక్రవర్తి సురలోకేంద్రాగ్నికాలాది ది
క్పతి గర్వాపనయప్రవర్తి, గతలోభస్ఫూర్తి, నానా మఖ
వ్రతదానప్రవణానువర్తి, సుమనోరామామనోఖేదనో
ద్ధత చంద్రాతపకీర్తి, సత్యకరుణా ధర్మోల్లసన్మూర్తి దాన్. [8-543]

బలి దగ్గిరకి చేరిన వామనుడు రాక్షస చక్రవర్తిని చూసి ఇలా అన్నాడు – ఇతడేనా దానవ చక్రవర్తి? యముడి దగ్గిర్నుంచి అష్ట దిక్పాలకులతో సహా అందరి గర్వం అణిచిన వాడు; లోభం అనేది పోగొట్టుకున్నవాడు; వ్రతాలూ యజ్ఞాలూ ఆచరించేవాడు; అడిగినదల్లా ఇచ్చేవాడూ, వెన్నెల అంతటి కీర్తి ఉన్న బలి చక్రవర్తి ఇతనేనా? అంటే వామనుణ్ణి చూసి అతని వర్చస్సుకి బలి ఎంత ఆశ్చర్యపడ్డాడో అలాగే బలిని చూసి వామనుడు కూడా మెచ్చుకుంటున్నాడు. ఇక్కడ వామనుడు మాయాభిక్షువు, బలి రాక్షస చక్రవర్తి.

వ. అని కుశ పవిత్రాక్షత సంయుతం బయిన దక్షిణహస్తంబు సాఁచి యిట్లనియె. [8-544]

అంతేనా? ఇప్పుడు కుడిచేయి ఎత్తి ఆశీర్వచనం చెప్తున్నాడు ముందు. ఆ చేతిలో ఏమున్నాయి? పవిత్రమైన దర్భలు, అక్షతలూను. అవి ఎవరిచ్చారో ముందు చెప్పాడు కదా? “....సరస్వతి యక్షమాలికయు, సప్తర్షులు కుశపవిత్రంబులు నిచ్చిరి." ఆ అక్షతలు పవిత్రం ఎందుకయ్యాయంటే అవి పట్టుకున్న చేయి మహిమ అటువంటిది కనక.

ఏమని ఆశీర్వచనం?

ఉ. స్వస్తి జగత్త్రయీ భువన శాసన కర్తకు హాసమాత్ర వి
ధ్వస్త నిలింపభర్తకు, నుదారపదవ్యవహర్తకున్, మునీం
ద్రస్తుత మంగళాధ్వర విధాన విహర్తకు, నిర్జరీగళ
న్యస్త సువర్ణసూత్ర పరిహర్తకు, దానవలోక భర్తకున్. [8-545]

మొదటిమాట ఏమిటి ఆశీర్వచనంలో? స్వస్తి – శుభమగుగాక! నీ తపస్సంతా ఫలించడానికి సిద్ధంగా ఉంది. ఏ భయంలేదు; నేను ముందే చెప్తున్నాను, నేను ఏమడిగినా నువ్వేమిచ్చినా నీకు మాత్రం శుభం కలగాలి అని. సరే స్వస్తి వాచనం ఎవరికి? ముల్లోకాలనీ పాలించే బలి చక్రవర్తికి, ఒక్క నవ్వుతో దేవేంద్రుణ్ణి వెలవెలపోయేలా చేవాడికి, ఉన్నతమైన పదవిలో ఉండే బలి చక్రవర్తికి, మునీంద్రులు చేయించే యజ్ఞాలలో పాల్గొనేవాడికి, దేవతల మెడల్లో ఉన్న బంగారు మంగళసూత్రాలు తొలగించేవాడికి (నిర్జరీగళన్యస్త సువర్ణసూత్ర పరిహర్తకు), దానవలోక చక్రవర్తికి. రాక్షసులు దేవతల్ని చంపేస్తే పోయిన దేవతల భార్యల మంగళసూత్రాలు పోతాయిట. అవన్నీ ఈ బలి చక్రవర్తి గారి ప్రతాపమే సుమా అని చెప్తున్నాడు.

ఈ పద్యంలో స్వస్తి అనేదానికి రెండు రకాల అర్థం చెప్పుకోవచ్చు. ఒకటి ఏమిటంటే స్వస్తి అనడంలో వామనుడు, నీకేం ఫర్వాలేదు నేను ఆశీర్వచనం ఇచ్చాను సుమా అనే ధైర్యం కలిగించడం. రెండోది, నేను నిన్ను ఇప్పుడు దానం అడగడానికి వచ్చాను ఓ అవతారం ఎత్తి. అందువల్ల ఇప్పుడు నీకున్న ఆస్తులకీ సింహాసనానికి ఇంక స్వస్తి చెప్పుకో అని. మరి బలికి ఈ స్వస్తి వాచకంలో ఏమి అర్థమైందో, అది ఉత్తరోత్తరా ఎలా అన్వయించుకుంటాడో ముందు ముందు మనకి తెలుస్తుంది.

వ. అని దీవించి కరచరణాద్యవయవంబులు ధరించిన వేదరాశియుం బోలె ముందట నకుటిలుండును, జటిలుండును, సదండఛత్రుండునుఁ, గక్షలంబిత భిక్షాపాత్రుండునుఁ, గరకలిత జల కమండలుండును, మనోహరవదన చంద్రమండలుండును, మాయావాదన నటుండును నగు వటునిం గని దినకర కిరణ పిహితంబులైన గ్రహంబుల చందంబునఁ దిరోహితులై భృగువులుఁ గూర్చున్న యెడల లేచి క్షేమం బడిగి తియ్యని మాటల నాదరించిరి; బలియును

నమస్కరించి తగిన గద్దియ నునిచి, పాదంబులుఁ దుడిచి తన ప్రాణవల్లభ పసిండి గిండియల నుదకంబు పోయ వడుగు కొమరుని చరణంబులఁ గడిగి తడి యొత్తి తత్సమయంబున. [8-546]

ఇలా దీవించిన వామనుడు ఎలా ఉన్నాడు? మానవావయవాలు కల వేదరాశి లాగా ఉన్నాట్ట. అలా ఉన్న వటుడు, అకుటిలుండును (అమాయకుడు), జటిలుండును (జటలుకట్టిన జుట్టుకలవాడు) సదండఛత్రుండును (దండము గొడుగుగలవాడు), భిక్షాపాత్ర కలవాడు, చేతిలో కమండలము కలవాడు, మాయావాదన చేసేవాడు. ఇలా అందమైన చంద్రబింబం వంటి మొహం కల వటుణ్ణి చూసి అక్కడ కూర్చున్న బలీ, భృగువులూ (శుక్రాచార్యులు కదా యజ్ఞం చేయించేది), అందరూ లేచి మంచి మాటల్తో ఆదరించారు కుర్రవాడిని. బలి చక్రవర్తి వాళ్ళావిడ బంగారు కలశంతో నీళ్ళు పోస్తే వటుడి కాళ్ళు కడిగి, పొడి బట్టల్తో తుడిచాడు.

ఆ. వటుని పాద శౌచవారి శిరంబునఁ
బరమ భద్ర మనుచు బలి వహించె
నే జలము గిరీశుఁ డిందుజూటుఁడు దేవ
దేవుఁ దుద్వహించె ధృతి శిరమున. [8-547]

కాళ్ళు కడిగాక ఆ నీఈళ్ళు తీసుకుని నెత్తిమీద జల్లుకున్నాడు బలి, ఆ నీటి వల్ల శుభం కలగాలి అనుకుంటూ. ఆ నీరు ఎటువంటిది? శివుడి జటాజూటంలోకి దిగిన గంగ వంటిది. గంగ విష్ణుపాదాల దగ్గిర మొదలై శివుడి జటల్లోంచి భూమిమీదకి దిగిందని కదా? అందుకే ఈ ప్రయోగం.

బలి వామనుల సంభాషణ; వామనావతారం – 7

వామనుడు ఆశీర్వచనం ఇచ్చాడు కదా? తర్వాత యధావిధిగా బలి వచ్చిన శ్రీహరి కాళ్ళు కడిగి నెత్తిమీద చల్లుకున్నాడు. ఇప్పుడు అడుగుతున్నాడు వామనుణ్ణి నువ్వెవరివీ, ఇలా రావడానికేమిటి కారణం అంటూ.

వ. మఱియు నయ్యజమానుం డభ్యాగతున కిట్లనియె. [8-548]

మ. వడుగా! యెవ్వరివాఁడ? వెవ్వఁడవు? సంవాసస్థలంబెయ్య? ది
య్యెడకున్ నీ వరుదెంచుటన్ సఫలమయ్యెన్ వంశమున్ జన్మమున్;
గడు ధన్యాత్ముఁడనైతి; నీ మఖము యోగ్యంబయ్యె; నా కోరికల్
గడతేఱన్; సుహుతంబులయ్యె శిఖులుం; గల్యాణ మిక్కాలమున్. [8-549]

అబ్బాయీ, ఎవరివాడివి? అంటే ఈ చుట్టుపక్కల్లో మాకు తెల్సినవాళ్ళ కుర్రాడివా? ఎక్కడుంటావు? అలా అని ఆగాడా? నువ్వు రావడం వల్ల నా జన్మ సఫలమైంది. ఇక్కడ అగ్నులన్నీ నువ్వు రాగానే బాగా వెలగడం మొదలైంది. నా బతుకు ధన్యం అంటున్నాడు. ఇక్కడ బలి యజమాని, శ్రీహరి అభ్యాగతుడు.

ఆగండాగండి. పెద్ద యజ్ఞం జరుగుతోంది. ఎవరి అధ్వర్యంలో? బలి చక్రవర్తి అధ్వర్యంలో. బలి చేయిస్తూంటే శుక్రాచార్యులు అక్కడే ఉన్నారు. అంటే పెద్ద జన సమూహం అనేకానేక పనులూను బలికి. ప్రతీ యజ్ఞ కుండం దగ్గిరా బలి కూర్చోలేడు కదా? అసలే చక్రవర్తి. అంటే ఒక మంచి ప్రదేశంలో కూర్చుని అందరికీ ఏమి చేయాలో పురమాయిస్తూ ఉండొచ్చు. లేకపోతే తానో యజ్ఞ కుండం దగ్గిర కూర్చుని మంచి అర్హులైన దక్షులైన వాళ్ళతో మిగతావన్నీ చేయిస్తూ ఉండొచ్చు. కానీ ప్రతీ యజ్ఞ కుండంలో త్రేతాగ్నులెలా బాగా ఎగసి పడుతున్నాయో అవన్నీ ఎలా తెలుస్తాయ్? కానీ పద్యంలో ఏమంటున్నాడు? "సుహుతంబులయ్యె శిఖులుం..." అంటే త్రేతాగ్నులన్నీ బాగా మండుతున్నాయిట. ఎలా చూశాడు ఇదంతా?

చిన్న సరదా కథ చెప్పుకుందాం. ఆ మధ్యన వంటింట్లో వాడే పిండి రుబ్బుకునేది పాడైతే బాగుచేయించడానికి ఓ కొట్టుకెళ్ళాం. కొట్టు మొదట్లోనే కుడివైపుకి గల్లాపెట్టె, యజమానీ కూర్చుని వచ్చినవాళ్లని ఇలా లోపలకి, ఇటువైపు కుర్రాడి దగ్గిరకీ, లేకపోతే ఈ మూల ఇంకో అతని దగ్గిరకీ పంపిస్తున్నాడు. మేము వెళ్ళేసరికి లోపల కొట్లో ఇసుకేస్తే రాలనంత జనం. యజమానికి ఇలా పాడైన విషయం చెప్పి బాగు చేయగలరా అని అడిగితే, ఓ క్షణం దానికేసి చూసి "ఆ, ఒరే రామారావ్ ఇది తీసుకో" అని అరిచేడు. రామారావ్ అనే అతని దగ్గిరకి వెళ్తే పది నిముషాలు అటూ ఇటూ తిరగేసి పెదవి విరుస్తూ చెప్పేడు, "ఇది బాగుచేయడం కుదరదు" అని. మేము ఏం చెయ్యాలా అని ఆలోచించేంతలో, మొదట మాట్లాడిన యజమాని "ఏమిటీ, కుదరదా? తప్పుకో పక్కకి" అంటూ ఓ సుత్తీ అవీ బయటకి తీసి సరిగ్గా పదిహేను నిముషాల్లో అంతా సరిచేసి ఇచ్చేడు. రామారావు అనే అతని మొహం చూడాలి అప్పుడు. అంటే, తన కొట్లో ఏమి దొరుకుతాయి, ఏమి బాగు చేయబడతాయి, ఎలా చేయొచ్చు, వీటికెంత అవుతుంది? తనతో పనిచేసే వాడు బాగు చేయలేకపోతే ఎలా? వాడు బాగుచేయలేకపోతే మరెవరు చేయగలరు? బేరం పోకుండా పని పూర్తి చేయడం ఎలా? అసలు లోపలకి తాను పంపిన వాళ్లతో ఈ రామారావు లేకపోతే మరో అతను ఎలా మాట్లాడుతున్నారు? రామారావుకి పని వచ్చుండొచ్చు గాక, కానీ ఆ రోజు కొట్లో పని ఎక్కువగా ఉండడం వల్లా, జన సమ్మర్ధం వల్లా బేరం తిప్పి కొట్టేస్తున్నాడేమో? ఇలాంటి వన్నీ క్షుణ్ణంగా తెలుసినవాడే గల్లా పెట్టె దగ్గిర కూర్చోగలడనేది ఒప్పుకుని తీరాలి. దక్షత అంటే అదీ.

కార్యనిర్వాహకుడనేవాడికి తాను పనిచేసే ఫలానా చోట ఏమి జరుతోందో అనేది చెప్పక్కర్లేదు. ఆయన ఒళ్ళంతా కళ్ళూ, చెవులూ చేసుకుని ఏం జరుగుతోందో అంతా చూస్తూ, వింటూ ఉంటాడు. ఇక్కడ బలి ఎటువంటివాడు? ముల్లోకాలకీ చక్రవర్తి. బలి ఆ మూలన కూర్చున్నాడు ఆయంకేం తెలుస్తుందిలే అని అనుకోడానికి లేదు. ముల్లోకాలలోనూ ఏమి జరుగుతోందో తెల్సినవాడికి తన యజ్ఞవాటికలో ఏమి జరుగుతోందో, ఎందుకలా జరుగుతోందో తెలియదా? అందుకే అన్న మాట "సుహుతంబులయ్యె శిఖులుం" అనడం. బలికి ఉన్న ఈ కార్య దక్షత అనేది ముందు ముందు ఇంకా బాగా తెలుస్తుంది మనకి.

ఇలా వచ్చిన వామనుడితో ఇప్పుడు అడుగుతున్నాడు ఏమి కావాలని ఇక్కడకి వచ్చావు అంటూ.

మ. వరచేలంబులొ మాడలో ఫలములో వన్యంబులో గోవులో
హరులో రత్నములో రథంబులొ విమృష్టాన్నంబులో కన్యలో

కరులో కాంచనమో నికేతనములో గ్రామంబులో భూములో
ధరణీ ఖండమొ కాక యే మడిగెదో ధాత్రీసురేంద్రోత్తమా! [8-550]

ఇదో అద్భుతమైన పద్యం. తనకున్నవీ తాను సాధారణంగా అందరికీ ఇచ్చేవి అన్నీ కలిపి ఇందులో ఏం కావాలి నీకు అని అడిగి, ఏమో ఇవేవీ కాకపోతే మరోటి అడగొచ్చు కదా అనుకుంటూ "కాక యేమడిగెదో.." అంటున్నాడు. ఇందులో వరచేలంబులు అంటే మంచి బట్టలు, మాడలంటే డబ్బులు, నికేతనములంటే ఇళ్ళు, హరులంటే గుర్రాలు, కరులంటే ఏనుగులు. ఇవన్నీ ఇవ్వగలడు కానీ మరోటేదైనా అడిగితే? ఈ అడగడంలో బలి గర్వం కాస్త కనబడీ కనబడకుండా ప్రతిబింబిస్తూ ఉంటుంది – నేను చక్రవర్తిని సుమా, చూసుకో నా సంపద ఎంత ఉందో, అనే గర్వం.

వ. అని ధర్మయుక్తంబుగాఁ బలికిన వైరోచని వచనంబులు విని సంతోషించి యీశ్వరుం డిట్లనియె. [8-551]

సీ. ఇది నాకు నెలవని యేరీతిఁ బలుకుదు?
నొక చో టనక యెందు నుండ నేర్తు;
నెవ్వనివాఁడ నం చేమని నుడువుదు?
నా యంతవాఁడనై నడవనేర్తు;
నీ నడవడి యని యెట్లు వక్కాణింతుఁ?
బూని ముప్పోకల బోవ నేర్తు;
నదినేర్తు నిదినేర్తు నని యేలఁ జెప్పంగ?
నేరుపు లన్నియు నేన నేర్తు [8-552]

తే. నొరులుఁ గారు నాకు నొరులకు నే నొదు
నొంటివాఁడఁ జుట్ట మొకఁడు లేఁడు
సిరియుఁ దొల్లి గలదు చెప్పెద నా టెంకి
సుజనులందుఁ దఱచు చొచ్చియుందు. [8-552.1]

నేనవర్నని చెప్పమంటావు? ఇక్కడుంటాను అక్కడ ఉండనూ అని ఎలా చెప్పగలను? ఎక్కడబడితే అక్కడే ఉంటాను. ఎవరికి చెందినవాడినా అంటే నా అంత వాడిని నేనే. నా నడవడి ఎలాంటిదంటావా? మూడు పోకడలూ కలవాడినే. మూడు పోకడలంటే సత్వ, రజ, తమో అనబడే మూడు గుణాలు; శ్రవణ, అధ్యయన, ఉపన్యాసమనే మూడు విద్యలు, ముందు, వెనకకి, పక్కకి అనే మూడు గమనాలు. అది నేర్చుకుంటాను ఇది నేర్చుకుంటానని చెప్పనేరను కానీ అన్నీతెలిసినవాణ్ణే. నాకు అవతలవాళ్ళు ఏమీ అవరు కానీ నేను వాళ్ళకి అన్నీ అవుతాను. నేను ఎప్పుడూ ఒక్కడినే. చుట్టం అనేవాడే లేడు. అంటే నాకందరూ సమానమే. మొదట్లో సిరి – లక్ష్మీ దేవి – ఉండేది (అంటే ముందు డబ్బున్నవాడినే, లక్ష్మీ పతినే; కానీ అందరికీ అన్నీ ఇచ్చేస్తూ ఉండడం వల్లా, ఇప్పుడీ వామన రూపం వల్లా లేదు). నా నివాసం (టెంకి) సుజనుల్లో. ఈ పద్యంలో నిఘూఢంగా భగవంతుడనేవాడు ఎక్కడుంటాడో సర్వాతర్యామి అనేదీ చెప్పకనే చెప్తున్నాడు.

అదితి కొడుకు అని చెప్పాడనుకోండి, బలి దానం ఇవ్వకపోవచ్చు. అందుకే అది వదిలేసి నర్మగర్భంగా నేను వచ్చిన సర్వాంతర్యామి అయిన విష్ణువుని సుమా అని చెప్తున్నాడు. ఇక్కడ బలి విరోచనుడి కుమారుడు – వైరోచనుడు. మరి విష్ణువో? ఈశ్వరుడు, భగవంతుడు.

పోతన దానం ఇచ్చే యజమానికీ, దానం తీసుకునే అభ్యాగతుడికీ వాడే పదాలు జాగ్రత్తగా గమనిస్తున్నారా?

వ. అది యట్లుండ నిమ్ము. [8-553]

సీ. జననాథ! నీ మాట సత్యంబు సత్కీర్తి;
దంబు గులార్హంబు ధర్మయుతముఁ
గరుణానువర్తులు ఘనసత్త్వమూర్తులు;
కాని మీ కులమందుఁ గలుగ రొరులు
రణభీరువులు వితరణభీరువులు లేరు;
ప్రత్యర్థు లర్థులు ప్రబ్బికొనిన
దానశౌండిమమునఁ దనుపుదు రధికులై;
మీ తాత లందఱు మేటిమగలు [8-554]

ఆ. మీ కులంబునందు మెఱయుఁ బ్రహ్లాదుండు
మింటి చంద్రుమాడ్కి మేలి రుచులఁ
బ్రథిత కీర్తితోడ భవదీయవంశంబు
నీరరాశి భంగి నెగడు చుండు. [8-554.1]

ఇప్పుడు బలి చక్రవర్తిని పొగుడుతున్నాడు వామనుడు. నువ్వు మాట్లాడేవన్నీ నీ కులానికి వన్నె తెచ్చిపెట్టేవి, యధార్థాలు. మరి కులం ప్రసక్తి వచ్చింది కనక ఆ కులం, వంశం ఎటువంటిదో చెప్తున్నాడు. మంచి సత్వగుణాలు ఉన్నవాళ్ళు పుట్టేది (ఘనసత్త్వమూర్తులు). పిరికివాళ్ళు లేరు మీ వంశంలో. యుద్ధంలో వెనకడుగు వేసేది లేదు. తండ్రీ తాతలందరూ మంచి శూరులు. అడిగితే ఇవ్వననేవారు లేరు. మరి మీ తాత ప్రహ్లాదుడో? ఆకాశం లో చంద్రుడిలా ప్రకాశిస్తూ ఉంటాడు.

వ. తొల్లి మీ మూఁడవ తాత హిరణ్యాక్షుండు విశ్వజయంబు జేసి గదాయుధుండై భూతలంబునఁ బ్రతివీరులం గానక సంచరింప విష్ణుండు వరాహరూపంబున నతని సమయించె; తద్భ్రాత యగు హిరణ్యకశిపుఁ డది విని హరిపరాక్రమంబునకు నాశ్చర్యంబు నొంది తన జయంబును బలంబునుం బరిహసించి గ్రద్దన నుద్దవిడి నద్దనుజమర్దను మందిరంబునకుం జనియె; అప్పుడు. [8-555]

మీ మూడో తాత హిరణ్యాక్షుడు ముల్లోకాలూ గెలిచి ప్రత్యర్థి అనేవాడు కనిపించనప్పుడు విష్ణువు వరాహరూపంలో అతన్ని మట్టుపెట్టాడు. అతని అన్న హిరణ్యకశిపుడు అలా తమ్ముణ్ణి చంపినందుకు విష్ణువు బలానికి ఆశ్చర్యపడి యుద్ధానికి బయల్దేరాడు దనుజమర్దనుడి మందిరానికి – అంటే వైకుంఠానికి. అప్పుడేమైందంటే

క. శూలాయుధహస్తుండై
కాలాకృతి వచ్చు దనుజుఁ గని విష్ణుండుం
గాలజ్ఞత మాయాగుణ
శీలత నిట్లని తలంచెఁ జిత్తములోనన్. [8-556]

శూలం పట్టుకుని యముడిలా వచ్చే హిరణ్యకశిపుణ్ణి చూసి అనేక మాయా విశేషాలు గల విష్ణువు సమయజ్ఞంతో మనసులో ఇలా ఆలోచించాడు.

మ. ఎదురై పోర జయింప రా దితనిఁ; గా కెందేనియుం బోవ భీ
ప్రదుఁడై ప్రాణులఁ దోలు మృత్యువు క్రియం బైవచ్చు నంచుం గ్రియా
విదుఁ డబ్జాక్షుఁడు సూక్ష్మరూపమున నావేశించె నిశ్వాస రం
ధ్ర దిశన్ దైత్యు హృదంతరాళమునఁ బ్రత్యక్షక్రియాభీరుఁడై. [8-557]

ఇప్పుడు వీడికున్న వరాల బలం వల్ల ఎదురుగా పోయి వీడితో యుద్ధం చేసి గెలవడం అసంభవం. మరోచోటికి ఎక్కడకైనా పోదామంటే వీణ్ణి తప్పించుకోవడం కుదిరేపనికాదు. ఎందుకంటే వీడు ముల్లోకాలూ స్వాధీనం చేసుకున్నవాడు. వీడికి అనుక్షణం నా ఉనికి గుర్తుచేయడానికీ, నా నామం స్మరించడానికీ వీలుగా ఉండేలాగ వీడి హృదయంలో ఉంటాను అనుకొని సూక్ష్మరూపంలో వాడి హృదయంలో ప్రవేశించాడు.

వ. అంత నద్దైత్యవల్లభుండు వైష్ణవాలయంబు జొచ్చి వెదకి హరిం గానక కోపంబు మానక మిన్ను మన్ను నన్వేషించి త్రిదివంబు నరసి, దిశలం బరికించి, భూ వివరంబులు వీక్షించి, సముద్రంబులు వెదకి, పురంబులు శోధించి, వనంబులు విమర్శించి, పాతాళంబు పరీక్షించి, జగంబున నదృష్టశత్రుండై మార్గణంబు చాలించి, తనలో నిట్లనియె. [8-558]

హిరణ్యకశిపుడు వైకుంఠంలో విష్ణువు కనబడకపోవడంచూసి ఆలయాల్లో, భూమిలో, సప్త సముద్రాల్లో, పాతాళంలో చూసాడు. ఎక్కడా కనిపించకపోయేసరికి తన మనసులో ఇలా అనుకున్నాడు. నృసింహావతారంలో అన్నట్టే ఇక్కడ హిరణ్యకశిపుణ్ణి పోతన ఏమన్నాడు? దైత్య వల్లభుండు. ఎక్కడా కించపరచడం అన్నది లేదు.

క. పగవాఁడు మడియ నోపును
దెగడేనియు నెదురుపడఁడె? దేహధరులకుం
దెగిన యెడఁ బగఱ మీఁదనుఁ
బగఁ గొనఁ దగ ద నుచు నుడిగెఁ బ్రాభవశక్తిన్. [8-559]

తన శత్రువైన విష్ణువు, పగవాఁడు మరణించి ఉండొచ్చు. లేకపోతే కనిపించి ఉండేవాడు కదా? మరణించిన శత్రువుమీద ఇంకా వైరం అవలంబించడం నాలాంటి వీరుడికి మంచిపని కాదు అని దండయాత్ర ఆపేశాడు.

వ. అతండు మీ ప్రపితామహుం; డతని గుణంబు లనేకంబులు గలవు; అవి యట్లుండనిమ్ము. [8-560]

అటువంటి మీ ముత్తాత హిరణ్యకశిపుడికి అనేక మంచి గుణాలున్నాయి. తితిదే వారు ప్రచురించిన భాగవతం పుస్తకాల్లో దీన్ని "అటువంటి మీ ముత్తాత సుగుణాల రాశి" అని అనువదించారు. తాను అతి కోపంతో నృసింహావతారం ఎత్తీ, బ్రహ్మ నుంచి కోరుకున్న వరాలకి అతీతంగా భీకరంగా సంహరించిన హిరణ్యకశిపుణ్ణి, ముల్లోకాలనీ, తన భక్తుడైన ప్రహ్లాదుణ్ణీ క్రూరంగా హింసించిన రాక్షసుణ్ణి ఇక్కడ మంచి గుణాలు ఉన్నట్టు ఎందుకని అంటున్నాడంటే, దానం తీసుకునే ముందు నువ్వింతవాడివి అంతవాడివి అనడం సహజం. అదీగాక తాను అడిగినది ఇవ్వననకూడదు. పోనీ ఇస్తాను అన్నాక ఎవరైనా చాడీలు చెప్తే అన్నమాట వెనక్కి తీసుకోకూడదు. వీటన్నింటికీ ఒకటే ఆయుధం – మీ వంశం ఎంత మంచిది? నువ్వు ఎంత గొప్పవాడివి అని పొగడడం. ఎందుకంటే అడిగేది మామూలు దానం కాదు. అటువేపు ఇచ్చేవాడు ముల్లోకాలకి చక్రవర్తి.

వామనుడు ఏమి అడుగుతాడో ఆ కోరిక విని బలి ఎంత చిన్నబుచ్చుకుంటాడో ముందు చదువుదాం.

వామనుడి కోరిక; వామనావతారం – 8

బలి చక్రవర్తి కావాల్సింది కోరుకోమన్నాడు కదా? ఇప్పుడు తాతతో మొదలుపెట్టి మీ ముత్తాత హిరణ్యకశిపుడు ఇంత గొప్పవాడు, అంత గొప్పవాడు అన్నాక ఇప్పుడు తండ్రి విరోచనుడి గురించి చెప్తున్నాడు.

క. ఆతుర భూసురగతిఁ బురు
హూతాదులుఁ దన్ను వేఁడ నొగిఁ గొం డనుచున్
మీ తండ్రి యిచ్చె నాయువు
నేతన్మాత్రుఁడవె నీవు నీలోకమునన్? [8-561]

కష్టాల్లో ఉన్న బ్రాహ్మణుల్లాగా వెళ్ళి ఇంద్రుడు మీ ఆయుర్దాయం ఇవ్వండి అంటే సరే తీసుకోండని తనువు చాలించాడు మీ తండ్రి విరోచనుడు. నువ్వు మీ తండ్రికి ఏమాత్రం తీసిపోవు కదా?

క. ఏలితివి మూఁడు జగములుఁ;
దోలితి వింద్రాది సురలఁ; దొల్లిటివారిం
బోలితివి దానగుణముల;
సోలితివి పిశాచరాక్షసుల రక్షింపన్. [8-562]

మూడు లోకాలనీ ఏలుతూ ఇంద్రుణ్ణి అమరావతిలోంచి తప్పించి రాక్షసులనీ పిశాచాలనీ కూర్చోబెట్టావు పదవుల్లో. అలా అని అన్నీ చెడ్డగుణాలా అంటే, దానంలో నీ అంతటివాడు లేడని చెప్తున్నారు. అంటే నీవింతవాడివి అంతవాడివి అంటూనే తప్పులన్నీ ఎత్తి చూపిస్తున్నాడు పరోక్షంగా.

క. రాజ్యంబు గలిగె నేనిం
బూజ్యులకును యాచకులకు భూమిసురులకున్

భాజ్యముగ బ్రతుక డేనిం
ద్యాజ్యంబులు వాని జన్మ ధన గేహంబుల్. [8-564]

అవన్నీ అలా ఉంచితే, రాజ్యాలూ, లక్ష్మీ కటాక్షం కలిగాక ఏం చేయాలి? అడిగినవాళ్లకీ, అర్హులైనవారికీ పంచిపెట్టాలి. లేకపోతే అది ఎందుకూ కొరగాదు. అంటే ఒక్కడూ అనుభవించడం అనేది ఎప్పుడూ ధర్మం కాదు. ఎందుకలా చెప్తున్నాడో ఓ సారి గమనిస్తే మనకి అర్ధం అవుతుంది. మనకి లక్ష్మీ కటాక్షం వచ్చిందనుకోండి. ఆ డబ్బులు ఎక్కడివి? మిగతావాళ్ల దగ్గిర్నుంచి వచ్చినవే కదా? ఈ విషయం కాస్త నిదానంగా చూస్తే ప్రపంచంలో అతి ధనవంతులైన వారందరూ కూడా ఏదో విధంగా ఇలా దాన ధర్మాలు చేయడం మనం గమనించవచ్చు. ఇంకో విధంగా చూడాలంటే, ఎంతని ఖర్చుపెట్టుకోగలడు ఒక్క మనిషి? పైగా ఖర్చుపెట్టుకోకుండా తనకోసం, తనవారికోసం దాస్తే ఏమౌతుంది? అది ఎవరికో పోతుంది. ఇదే విషయం భర్తృహరి నీతి శతకంలో కనిపిస్తుంది. దానం భోగో నాశస్తిస్రో గతయో భవంతి విత్తస్య, యోన దదాతి న భుంక్త్యే తస్య తృతీయా గతిర్భవతి – భర్తృహరి నీతిశతకం. [43]. దీని అర్ధం ఏమిటంటే డబ్బు ఉన్నవాడు దాన్ని అనుభవించగలిగి ఉండాలి లేదా దానం చేయాలి. లేకపోతే మూడో విధంగా – అంటే రాజుల వల్ల గాని చోరులవల్లగానీ పోతుంది.

క. మున్నెన్నుదురు వదాన్యుల
నెన్నెడుచో నిన్నుఁ ద్రిభవనేశుం డనుచున్;
ఇన్ని దినంబుల నుండియు
నెన్నఁడు నినుఁ బెట్టు మనుచు నీంద్రము జేయన్. [8-565]

ఎవరికైనా ఏదైనా కావాలిస్తే అడగడానికి నిన్నేఎంచుకుంటున్నారు ముందు. ముల్లోకాలలోనూ నిన్ను దానమిచ్చే అగ్రగణ్యుడిగా చెప్తున్నారు. ఇన్నాళ్ళలో ఒక్కసారి కూడా నేను వచ్చి ఇది ఇవ్వు అది ఇవ్వు అంటూ పీడించలేదు.

ఆ. ఒంటివాఁడ నాకుఁ నొకటి రెం డడుగుల
మేర యిమ్ము సొమ్ము మేర యొల్ల;
గోర్కిఁదీర బ్రహ్మకూకటి ముట్టెద
దానకుతుకసాంద్ర! దానవేంద్ర! [8-566]

ఇంత పొగిడి, ఇన్ని కారణాలు ఎంచి ఇప్పుడు తనకి కావాల్సినది అడుగుతున్నాడు. దానం ఇద్దామను ఉవ్విళ్ళూరుతున్న బలి మహరాజా, ఒంటరి బ్రహ్మచారిని, నాకు మూడు అడుగుల భూమి ఇవ్వు అంటూ. ఆ కోరిక తీర్చావంటే బ్రహ్మ జుట్టు పట్టుకున్నంత ఆనందం నాకు. అంటే ఈ మూడు పాదాలతో నేను బ్రహ్మాండం అంతా ఆక్రమించగలను సుమా (బ్రహ్మకూకటిముట్టెద – బ్రహ్మయొక్క జుట్టును అందుకొనెదను, మహానందపడెదను) అని చెప్పకనే చెప్తున్నాడు.

వ. అనిన బరమయాచకునకుఁ బ్రదాత యిట్లనియె. [8-567]

ఆ. ఉన్నమాటలెల్ల నొప్పును విప్రుండ!
సత్య గతులు వృద్ధ సమ్మతంబు;
లడుగఁ దలఁచి కొంచె మడిగితివో చెల్ల;
దాత పెంపు సొంపుఁ దలఁపవలదె. [8-568]

ఇలా అడిగేసరికి బలి చక్రవర్తి ఒక్కసారి చిన్నబుచ్చుకుని నిరుత్సాహపడిపోయేడు. వచ్చిన కుర్రవాడి బ్రహ్మ వర్చస్సు చూసి ఇది ఇద్దాం, అది ఇద్దాం అనుకున్న బలి మూడు అడుగులా అని నీరసపడ్డాడు. అసలే కుర్రవాడు. మూడు అడుగులంటే మహా అయితే చిన్న చెక్క వస్తుంది కదా? కుర్రాడికి ఇంకా జ్ఞానం అదీ రాలేదు అందుకే ఇలా ఆడుకోవడానికో దేనికో అడుగుతున్నాడు అనుకుని చెప్తున్నాడు ఇప్పుడు – నువ్వు మాగురించి మా వంశం గురించి చెప్పినవి బాగానే ఉన్నాయి కానీ ఇంతా చెప్పి అడిగేటప్పుడు ఇచ్చేవాడి తాహతు అదీ చూసుకోవద్దూ? నూరు అశ్వమేధాలు చేసిన నన్ను, త్రిలోకాధిపతినైన నన్ను మూడు అడుగుల భూమి అడగడం ఎంత హాస్యాస్పదం?

మ. వసుధాఖండము వేఁడితో? గజములన్ వాంఛించితో? వాజులన్
వెసనూహించితొ? కోరితో యువతులన్ వీక్షించి కాంక్షించితో?
పసి బాలుండవు; నేర వీ వడుగ; నీ భాగ్యంబు లీపాటి గా
కసురేంద్రుండు పదత్రయం బడుగ నీ యల్పంబు నీ నేర్పునే? [8-570]

ఏమడుగుతున్నావు? ఏనుగులా, గుర్రాలా, అమ్మాయిలా, భూమా? ఏమి కావాలో అడగడం కూడా తెలియని చిన్న కుర్రాడివి నువ్వు. అయినా సరే నువ్వు అడిగావు కదా అని మూడు అడుగులు అనే చిన్న దానం – అదీ ముల్లోకాలకీ చక్రవర్తినీ, రాక్షసరాజునూ అయిన – నేను ఇస్తానా? ఇక్కడ బలి, ప్రదాత – ఇచ్చేవాడు. మరి వామనుడో? పరమయాచకుడు – అంటే మహా భిక్షువు.

వ. అనిన మొగంబునం జిఱునగవు మొలకలెత్త గృహమేధికి మేధావి యి ట్లనియె. [8-571]

మ. గొడుగో. జన్నిదమో, కమండలువొ నాకున్ ముంజియో, దండమో,
వడుఁ గే నెక్కడ భూము లెక్కడ? కరుల్, వామాక్షు, లశ్వంబు లె
క్కడ? నిత్యోచిత కర్మ మెక్కడ? మదాకాంక్షామితంబైన మూఁ
డడుగుల్ మేరయ త్రోవ కిచ్చుటది బ్రహ్మాండంబు నా పాలికిన్. [8-572]

బలి (గృహమేధి – దానమిచ్చే గృహస్థు) ఇలా తనని పసి బాలుడవి, అడగడం తెలియదనేసరికి వామనుడు (మేధావి – విజ్ఞాని) చెప్తున్నాడు నవ్వుతూ. గొడుగు వేసుకుని కమండలం, బిక్షాపాత్ర పట్టుకుని తిరిగే బ్రహ్మచారిని నేనెక్కడా? భూములూ, ఏనుగులూ, గుర్రాలూ, నువ్వు ఇస్తాననే ఆ సరుకులన్నీ ఎక్కడా? అంటే నాకు అవన్నీ తలకి మించినవి. నేనడిగిన మూడు అడుగుల నేల ఇస్తే అదే నాకు బ్రహ్మాండం ఇచ్చినంత సుమా.

తర్వాత పద్యం చూసే ముందో విషయం చూద్దాం. మొదటనుంచీ కూడా నాకెవరూ లేరు కానీ నేనందరికీ ఉన్నాను; లక్ష్మి ఉండేది మొదట్లో ఇప్పుడు లేదు, నువ్వు ఇచ్చేది నాకు బ్రహ్మాండంతో సమానం అంటూ అనేకానేక విధాలుగా నేను నీ దగ్గిర్నుంచి అన్నీ తీసుకోవడానికి వచ్చిన విష్ణువుని, నీ పుణ్యం అంతా ఫలం ఇచ్చే సమయం వచ్చింది,

స్వస్తి – నీకు శుభమగుగాక అని సూచనలు ఇస్తూనే ఉన్నాడు వామనుడు. బలి ఇదంతా గమనించాడా గమినించి కూడా ఇస్తాడా అనేది ఇప్పుడు తేలవల్సి ఉంది. బ్రహ్మ జ్ఞానం కలిగే దారిలో ఇదంతా ఓ క్రమం. ఇంత పుణ్యం చేసీ అన్నీ వదులుకోవడానికి సిద్ధంగా లేడనుకుందాం బలి చక్రవర్తి. అప్పుడు బ్రహ్మజ్ఞానానికి అర్హత లేదు. అంటే మనం ఎప్పుడైతే బ్రహ్మ జ్ఞానానికి పాటుపడడం మొదలుపెడతామో అప్పుడు ప్రపంచంలో అన్ని శక్తులూ మనకి సహాయం చేయడానికి సిద్ధంగా ఉంటాయి. మొదట్లో కొన్ని అవాంతరాలొచ్చినా అవన్నీ దారిలో మనకి సహాయంచేసేవే అని గుర్తుపెట్టుకోవడం కావాలి.

బుద్ధుడు కూడా ఎంతకీ ఆత్మదర్శనం కాలేదని తిండీ నీళ్ళూ మానేసి తీవ్ర వైరాగ్యంతో నీరసంగా మూర్ఛపడే స్థితిలో ఉన్నప్పుడు దూరంగా ఏవో అమ్ముకోవడానికి వెళ్ళే వాళ్ళు ఓ పాట పాడుకుంటూ వెళ్తున్నారుట. ఆ పాట బుద్ధుడు వినడం తటస్థించింది. ఏమిటాపాట అంటే, వీణ తీగెలు బాగా లాగితే తెగిపోయి అసలే పాట రాదు. బాగా వదులుగా కడితే అసలు శబ్దం బాగుండదు. అవి ఎలా ఉంచాలి అంటే మధ్యస్థంగా బాగా సాగిపోకుండా, మరీ వదులుగా లేకుండాను. ఇది వినే సరికి బుద్ధుడుకి ఒక్కసారి తెలిసివచ్చింది. తాను చేసే విపరీత కర్మ వల్ల తనకి విజ్ఞానం లభించదు. తనకి ధర్మం అవగతమవ్వాలంటే శరీరం తప్పనిసరి. అది లేకపోతే విజ్ఞానమనేది విశదమవ్వడం అసంభవం. అటు బాగా రోజూ తిండిపోతులా తినేవాడికీ, ఇటు అనేక ఉపవాసాలు చేసి శరీరాన్ని నాశనం చేసుకునేవాడికీ జ్ఞానం సిద్ధించదు. మధ్యస్థంగా ఉన్నప్పుడే ఏదైనా చేయగలం. దానితో సిద్ధార్థుడు మళ్ళీ ఆహారం తీసుకోవడం మొదలుపెట్టాడు. ఎంత? కావాల్సినంత మాత్రమే. కాస్త బలం వచ్చాక మళ్ళీ ధ్యానం మొదలుపెట్టి కొనసాగించాడు. చివర్లో బోధివృక్షం మొదట్లో కూర్చున్నప్పుడు ఇలా అనుకున్నాట్ట.

ఇహాసనే శుష్యతుమే శరీరం త్వగస్థిమాంసం ప్రళయంచ యాతు
అప్రాప్య భోధిం బహుకల్ప దుర్లభాం నైవాసనాత్కా యమతశ్చలిష్యతే

నా శరీరం శుష్కించిపోయి చర్మం, ఎముకలూ, మాంసం మట్టిలో కలిసిపోనీగాక, బహుకల్ప దుర్లభమైనటువంటి మహాబోధిని పొందకుండా ఈ ఆసనంమీదనుంచి కదిలేది లేదు. అంతటి పట్టుదల పట్టాక ఇంకెవరు ఆపేది? ఆ రోజు రాత్రే సిద్ధార్థుడు బుద్ధుడయ్యేడు. అచంచలమైన పట్టుదలా, విశ్వాసం ఉన్నప్పుడే కదా ఏదైనా సాధ్యమయ్యేది?

దీని మూలానే బుద్ధుడి బోధనల్లో మధ్యేమార్గం బాగా ప్రాచుర్యం పొందిన విషయం. ఆయన చెప్పిన ఒక విషయం అవగానకి అందినట్టే అనిపిస్తూ అందకుండా పోతూ ఉంటుంది. మరి దీనిని తెలుస్కోవడం ఎలా? ఒకటే మార్గం – సాధన. ధర్మం అనేది ఎవరి వారే తెలుసుకోవలిసినది. గురువు దారి చూపించగలుడు కానీ ధ్యానం చేయకపోతే? మనకి మల్లే ఎక్కడవేసిన గొంగళీ అక్కడే.

గమనించవల్సింది ఏమిటంటే, మొదట్నుండీ కూడా ఇలా మొత్తం బ్రహ్మాండం అంతా ఒక ప్రాణికి ఆత్మ సాక్షాత్కారం కోసం సహాయం చేయడానికి చూస్తూ ఉంటుంది. ఇక్కడ బుద్ధుడికి పాటపాడుకునేవాళ్ళు పరోక్షంగా చెప్పినట్టే వామనుడు కూడా చెప్తున్నాడు బలితో నేను ఫలానా, మరి నువ్వు సిద్ధంగా ఉన్నావా అంటూ. ఆత్మార్ధే పృధ్వీం త్యజేత్ అని కదా? బలి అన్నీ వదులుకోవడానికి సిద్ధంగా లేకపోతే ఇన్నాళ్ళు చేసిన యాగాలూ, దానాలు ఇచ్చినా ఇంకా సాధన మిగిలిపోయినట్టే.

అడిగిన దానం వామనుడికి ఇవ్వడానికి బలికి ఇటువంటి పట్టుదల ఉందా? దానం అవన్నీ అటుంచితే పరోక్షంగా – నేను ఫలానా సుమా అంటూ – వామనుడిచ్చే సూచనలు బలి గ్రహించాడా? అది ముందు తెలుస్తుంది.

బలి సమాధానం; వామనావతారం – 9

మూడు అడుగుల భూమి దానం అడిగాడు కదా వామనుడు? ఇదేం చిన్న కోరిక, నీకు అడగడం తెలియదు అనేసరికి అక్కడ ఉన్న వాళ్లంతా నవ్వుతున్నారు. అప్పుడు బలితో వామనుడిలా అన్నాడు.

క. వ్యాప్తిం బొందక వగవక
ప్రాప్తంబగు లేశమైనఁ బదివే లనుచుం
దృప్తిం జెందని మనుజుఁడు
సప్తద్వీపముల నయినఁ జక్కంబడునే? [8–574]

దొరికినదానితో ఇదే పదివేలు అనుకోని మనిషికి సప్తద్వీపాలు దొరికినా సంతోషంగా ఉండగలడా? ఈ ఆశకి అంతులేదు కదా? ఏమీ లేనివాళ్ళు కొంచెం కోసం, కొంచెం ఉన్నవాళ్ళు లక్షలకోసం, లక్షలు ఉన్నవాళ్ళు కోట్ల కోసం ఉవ్విళ్ళూరడం మనకి తెలిసినదే కదా?

శా. ఆశాపాశము దాఁ గడున్ నిడుపు; లే దంతంబు రాజేంద్ర! వా
రాశిప్రావృత మేదినీవలయ సామ్రాజ్యంబు చేకూడియుం
గాశిం బొందిరిఁ గాక వైన్య గయ భూకాంతాదులున్నర్థకా
మాశం బాయఁగ నేర్చిరే మును నిజాశాంతంబులం జూచిరే. [8–575]

ఆశ అనే పాశానికి పొడవు ఇంత, అంతము ఇంతా అనే కొలత లేదు కదా? సముద్రాలతో చుట్టబడిని ఈ భూమి (వారాశిప్రావృత మేదిని) దొరికినా ఇంకా పృథుడు (వైన్యుడు), గయుడు అనే చక్రవర్తులు సంతోషంగా ఉండగలిగారా? ఉన్నవాటిమీద కోరిక వదులుకున్నారా? పోనీ వాళ్ల ఆశకి అంతు చూసారా, లేదే? ఇక్కడ బలిని పరోక్షంగా నువ్వుకూడా భూమండలం అంతా దొరికినా ఇంద్రుణ్ణి జయించి ఆ ఆశ వల్లే ఇంద్రుడైపోయేవు సుమా అనే హెచ్చరిక కనిపొస్తోంది కదా?

సీ. సంతుష్టుఁడీ మూఁడు జగములఁ బూజ్యుండు;
సంతోషి కెప్పుడుఁ జరఁగు సుఖము
సంతోషిఁ గాకుంట సంసార హేతువు;
సంతసంబున ముక్తిసతియు దొరకుఁ
బూఁటపూఁటకు జగంబుల యదృచ్ఛాలాభ;
తుష్టిని దేజంబు తోన పెరుఁగుఁ
బరితోష హీనతఁ బ్రభ చెడిపోవును;
జలధార ననలంబు సమయునట్లు [8-576]

ఆ. నీవు రాజ వనుచు నిఖిలంబు నడుగుట
దగవు గాదు నాకుఁ; దగిన కొలఁది
యేను వేఁడికొనిన యీ పదత్రయమునుఁ
జాల దనక యిమ్ము; చాలుఁజాలు. [8-576.1]

సంతుష్టుడికి ప్రపంచం అంతా సుఖమయం.ఆ సంతోషం లేకపోతే సంసారం, దానిలో రోగాలూ రొచ్చులూ అన్నీ తగులుకుంటాయి. సంతోషం వల్ల తేజస్సు పెరుగుతుంది. దొరికినదానితో సంతృప్తి పడకపోతే నీళ్ళుపోసినప్పుడు ఆరిపోయే అగ్నిలా చెడిపోతారు. అవన్నీ అటుంచితే నువ్వు రాజువీ, చక్రవర్తివీ కదా ఏదో కోరుకోమన్నావనీ ఎంతేసి కోరికలూ కోరుకోవడం ఏం బాగు? నేను అడిగిన మూడు అడుగులే చాలు.

నారాయణీయం రచించిన భట్టాత్థిరి గారు వామనావతారంలో ఏమన్నారో, బలిని మూడడుగులు మాత్రమే ఎందుకడిగాడో ఒకసారి చూస్తే నవ్వు వస్తుంది.

తా మక్షీణాం బలిగర ముపా కర్ణ్య కారుణ్య పూర్ణో
ప్యస్యోత్సేకం శమయితుమనా దైత్యవంశం ప్రశంసన్
భూమిం పాదత్రయ పరిమితాం ప్రార్ధయమాసిథ త్వం
సర్వం దేహీతి తు నిగదితే కస్య హాస్యం న వాస్యాత్ [31-2]

(బలి ఏమి కావాలో కోరుకో అని ఉదారంగా అడుగుతూంటే అతని వంశాన్ని కొనియాడుతూ, గర్వం నశింపచేయడానికి మూడడుగుల నేల మాత్రం ఇమ్మన్నావు. అలా కాకుండా నీకున్నదంతా ఇచ్చేయి అని అడిగితే అందరూ నవ్విపోరూ?)

వ. అని యిట్లు పలుకుచున్న ఖర్వునకు నుర్వీదానంబు చేయం దలంచి కరకలిత సలిల కలశుండైన యవ్వితరణగుణముఖరునిం గని, నిజ విచారయుక్త దనుజ రాజ్య చక్రుండగు శుక్రుం డిట్లనియె. [8-577]

ఇలా అనేసరికి, వామనుడుకి దానం ఇవ్వడానికి నిశ్చయం చేసుకుని చేతిలో నీళ్ళు తీసుకోవడానికి సిద్ధమౌతూంటే ఇప్పటిదాకా అక్కడే ఉండి అన్నీ వింటున్న శుక్రాచార్యులు ఇవన్నీ చూసారు. కాస్త ఆలోచించేసరికి అన్నీ అర్ధమయ్యాయి. ఇవన్నీ బలికి తెలియవేమో, చక్రవర్తి ఊహకి అందలేదేమో అనుకుని ఇప్పుడు ఆఖరి అడ్డంకి రూపంలో హెచ్చరిస్తూ చెప్తున్నారు. ఇక్కడ వామనుడు ఖర్వుడు (పొట్టివాడు), బలి, వితరణగుణముఖరుడు (దానము చేసే లక్షణములతో ఉన్న ముఖ్యమైనవాడు).

ఆత్మ సాక్షాత్కారం కావాలంటే అనేక అడ్డంకులు అధిగమించాల్సి ఉంటుంది. అన్నీ అధిగమించినా చివర్లో మరో తిరకాసు రావొచ్చు. అంటే ప్రాణం పోయినా అన్నింటినీ ఏమరుపాటుతో అధిగమించిననాడు – బ్రహ్మ జ్ఞానానికి అర్హులం. ఇప్పుడదే జరగబోతోంది బలికి. ఈ అడ్డంకి రావడానిక్కూడా మరో కారణం భగవంతుడు సృష్టించినదే. అది ముందు మనకి తెలుస్తుంది.

సీ. దనుజేంద్ర! యీతఁడు ధరణీసురుఁడుఁ గాడు;
దేవకార్యంబు సాధించుకొఱకు
హరి విష్ణుఁ డవ్యయుం డదితి గర్భంబునఁ;
గశ్యపసూనుఁడై కలిఁగె; నకట;
యెఱుగ కీతని కోర్కి నిచ్చెద నంటివి;
దైత్య సంతతి కుపద్రవము వచ్చు
నీ లక్ష్మిఁ దేజంబు నెలవు నైశ్వర్యంబు;
వంచించి యిచ్చుఁ దా వాసవునకు; [8-578]

ఆ. మొనసి జగము లెల్ల మూఁడు పాదంబుల
నఖిలకాయుఁ డగుచు నాక్రమించు
సర్వ ధనము విష్ణు సంసర్జనము చేసి
బడుగు పగిది నెట్లు బ్రతికె దీవు? [8-578.1]

ఈ వామనుడు దేవతలకి సహాయం చేయడానికి అదితి కశ్యపులకి పుట్టిన మహావిష్ణువు. కంగారుపడి దానం ఇచ్చేయకు. ఇచ్చావా, నీకున్నదంతా మూడు పాదాలతో ఆక్రమించేసి దేవతలకి ఇచ్చేస్తాడు. అప్పుడు నీకూ రాక్షస జాతికీ నిలువ నీడలేకుండా పోతుంది. నీ ఒక్కడి సంగతి అటుంచితే ఈ దానం రాక్షస వంశానికంతటికీ ఉపద్రవం తీసుకొస్తుంది. ఎలా బతుకుతావు ఆ తర్వాత?

క. ఒక్కపదంబున భూమియు
నొక్కటఁ ద్రిదివంబు దొక్కి యున్నతమూర్తిన్
దిక్కులు గగనముఁ దానై
వెక్కసమై యున్న నెందు వెడలెదు? చెపుమా. [8-579]

ఒక పాదంతో భూమీ, రెండోదానితో స్వర్గాన్నీ ఆక్రమించబోయే ఉన్నతమూర్తి అవుతాడీ వామనుడు. అప్పుడు అసలు మనకి ఎక్కడకి వెళ్ళడానికీ లేదు కదా?

సీ. ఇచ్చెద నని పల్కి యీకున్న నరకంబు;
ద్రోవ నీవును సమర్థుఁడవుఁ గావ;
యే దానమున నాశ మేతెంచు నదియును;
దానంబుఁ గా దంద్రు తత్త్వవిదులు;
దానంబు యజ్ఞంబుఁ దపముఁ గర్మంబును;
దా విత్తవంతుఁడై తలఁపవలయుఁ;
దన యింటఁ గల సర్వధనమును నైదు భా;
గములుగా విభజించి కామమునకు [8-580]

ఆ. నర్థమునకు ధర్మయశముల కాశ్రిత
బృందములకు సమతఁ బెట్టునట్టి
పురుషుఁ డిందు నందు బూర్ణుఁడై మోదించుఁ
దన్ను మాని చేఁత దగవుఁ గాదు. [8-580.1]

ఇస్తానని మాట ఇచ్చి ఇవ్వలేకపోతే నరకానికి పోవాలంటావేమో. దానికి చక్రవర్తివైన నువ్వు సమర్థుడివే. ఏ దానం వల్ల సర్వనాశనం అవుతుందో అది దానం కాదని పెద్దలు చెప్తున్నారు. అదలా ఉంచితే మనకున్న సంపాదనని అయిదు భాగాలు చేసి దాన్ని కామార్థధర్మాలనే వాటికి ఉపయోగించాలి. అంతేకానీ యజమాని అనేవాడు చేతికి ఎముకలేకుండా ఎవరేది అడిగితే అది ఇదిగో తీసుకో అని ఇచ్చేయకూడదు.

వ. అదియునుం గాక యీ యర్థంబునందు బహుభంగి బహ్వృచ గీతార్థంబుఁ గల దొక్కటి; సావధానుండవై యాకర్ణింపుము. [8-581]

అదీగాక నేను చెప్పినదానికో ఋగ్వేద ప్రమాణం (బహ్వృచ గీతార్థంబు) ఉంది. సావధానంగా విను.

సీ. అంగీకరించిన నఖిలంబుఁ బోవుచో;
నన్నృతంబుఁగాదు లే దనిన నధిప!
యాత్మ వృక్షము మూల మనృతంబు నిశ్చయ;
మనృత మూలముఁ గల్గ నాత్మ చెడదు;
పుష్పఫలము లాత్మ భూజంబునకు సత్య;
మాత్రాను బ్రతుకమి నదియుఁ జెడును;
ఫలపుష్పములు లేక పస చెడి వృక్షంబు;
మూలంబుతో వృద్ధిఁ బొందుఁ గాదె? [8-582]

తే. చేటుఁ గొఱతయు లఘిమయుఁ జెందకుండ
నిచ్చు పురుషుండు చెడకుండు నిద్ధచరిత!
కాక యంచిత సత్య సంగతి నటంచు
నిజధనం బర్థి కిచ్చిన నీకు లేదు. [8-582.1]

ఏదైనా ఒప్పుకుని ఇస్తానన్నప్పుడు మొత్తం పోతూంటే అటువంటప్పుడు అబద్ధం ఆడడం తప్పుకాదు. అదీగాక ఈ దేహమనే దానికి అబద్ధమే మూలం. ఆ వేళ్ళు నరికేస్తే దేహం నిలిచేదెలా? ఈ సత్యాసత్యాలు అటుంచితే అన్నీ ఇతనికిచ్చేస్తే నీకేం మిగులుతుంది?

ఈ అనృతం దేహానికి మూలమనే మాట చూద్దాం. స్వామి వివేకానంద చెప్పినదే. ఒక జన్మలో చేసిన పనులవల్ల ఈ కర్మ అనే చక్రాన్ని తోస్తున్నాం. అది తిరగడం మొదలవ్వగానే మరో పనీ, ఇంకో పనీ చేసి దాన్ని మరింతగా తోయడం జరుగుతోంది. అంటే ఈ జన్మలో చేసిన పనుల వల్ల మనకి పై జన్మా, ఆ పై జన్మలో చేసిన పనుల వల్ల మరో జన్మా ఇలా ఒకదాని తర్వాతొకటి జరుగుతున్నాయి. ఎన్నాళ్ళిలా? చక్రం ఆగే వరకూ? అది ఆగాలంటే కర్మ చేయకపోవడమేనా దారి? వివేకానందులు చెప్పడం ప్రకారం అది కాదు దారి. నిష్కామ కర్మ అసలైన దారి. అంటే మనం చేసే కర్మ ఏ కోరికతోనూ

చేయకూడదు. చేయాలి కనక చేయడమే. దీన్నే రామకృష్ణులు అనడం ప్రకారం, ఒకచేత్తో భగవంతుణ్ణి ఆశ్రయించి రెండో చేత్తో పనులు చేస్తూ ఉండాలి. పని అయిపోయి ఆ రెండో చేయి ఖాళీ అవగానే ఆ రెండు చేతులూ భగవంతుడికి ఆనించడమే.  ఇదే అత్యంత సులభమైన నిష్కామ కర్మ యోగం. అంటే సంసారంలో ఉంటూ దానికి అంటకుండా ఉండడమే. అదే రామకృష్ణులనేది – నీళ్ళలో పడవ ఉండొచ్చు కానీ పడవలో నీళ్ళు ఉండకూడదు.

మరి ఈ కర్మ చేయడం వల్ల జన్మ కలిగితే దేహం కలుగుతోంది కదా? అంటే శుక్రాచార్యులు చెప్పినదానికి సరిగ్గా సరిపోతోంది. అనృతాలతో, కర్మలతో అనేకానేక లాభాపేక్షలతో పనులు చేయడం, అధర్మం లాంటి ఋణావేశ శక్తులవల్లే మనం కర్మ చేయడానికీ, దానివల్ల చక్రం తిరుగుతూ మరో దేహం లభించడానికీ కారణమౌతోందనేది సుస్పష్టం. ఈ కామ్య కర్మల వల్ల చక్రం వేగంగా తిరగడం, నిష్కామ కర్మల వల్ల నిదానించడం జరుగుతోంది. ఎప్పుడైతే ఈ చక్రాన్ని ఆపగలిగామో అప్పుడే ఈ దేహం అనేది నశించి ఆత్మ జ్ఞానం కలుగుతోంది. అంటే జనన మరణాల చట్రంలోంచి తప్పించుకోగలుగుతున్నాం. అదే జన్మ రాహిత్యం. ఇక్కడ బలి ఇవ్వబోయే దానం జన్మ రాహిత్యానికి దారితీయబోతూంటే శుక్రాచార్యులు అడ్డుకుంటున్నారు. ఇది చివరి అడ్డంకి అని తెలుసుకుని, దీన్ని బలి ఎలా అధిగమిస్తాడనేదే ఇప్పుడు ఉత్కంఠ.

ఆ. సర్వమయినచోట సర్వధనంబులు
నడుగ లే దటంచు నన్నృతమాడు
చెనటి పందనేమి చెప్పఁ బ్రాణము తోడి
శవము వాఁడు; వాని జన్మ మేల? [8-583]

అటువైపు నుంచి చేస్తే మూడడుగులూ సర్వమయం అని తెలిసీ అదంతా అడగట్లేదు సుమా, మూడడుగులే అడుగుతున్నానని అబద్ధం ఆడేవాడిని మోసగాడు అనడంలో తప్పేం ఉంది? వాడి జన్మ ఎందుకు? వాడు శవం కిందే లెక్క. అంటే మోసగాడైన వాణ్ణి మోసంతో జయించడంలో తప్పులేదు.

వ. మఱియు నిందొక్క విశేషంబు గలదు; వివరించెద. [8-584]

పోనీ ఇవన్నీ కుదరదంటావేమో, వీటన్నింటినీ పక్కన పెడితో మరో విశేషం ఉంది.

ఆ. వారిజాక్షులందు వైవాహికము లందుఁ
బ్రాణవిత్తమానభంగమందుఁ
జకిత గోకులాగ్ర జన్మరక్షణ మందు
బొంకవచ్చు నఘము పొందఁ దధిప! [8-585]

ఆడవారి విషయం లోనూ, వివాహ సమయం లోనూ ప్రాణ, ధన మానాలు పోయే సందర్భాలలోనూ, భీతిల్లిన గోవుల సమూహాలని, బ్రాహ్మణులను కాపాడటంలోనూ; అబద్దమాడవచ్చు, అటువంటప్పుడు పాపం అంటుకోదు.

మ. కులమున్ రాజ్యముఁ దేజమున్ నిలుపు మీ కుబ్జుండు విశ్వంభరుం
డలతిం బోఁడు; త్రివిక్రమస్ఫురణ వాఁడై నిండు బ్రహ్మాండమున్;
గలఁడే మాన్ప నొకండు? నా పలుకు లాకర్ణింపు కర్ణంబులన్;
వలదీ దానము గీనముం బనుపుమా వర్ణిన్ వదాన్యోత్తమా! [8-586]

ఇవన్నీ మనకి వద్దు. కులం, రాజ్యం, మనకున్న తేజస్సు అవన్నీ నించోపెట్టు. దానం ఇచ్చావా, ఇప్పుడొచ్చిన విశ్వంభరుడు అంత తేలిగ్గా వదిలేయడు నిన్ను. ఒక్కసారి ఎదిగిపోయి బ్రహ్మాండం అంతా ఆక్రమించే ఇటువంటివాడు మరొకడు ఎవడున్నాడు? నా మాట విని ఈ దానం, గీనం అక్కడే ఆపి ఈ బ్రహ్మచారిని బయటకి పంపించు.

బలి చక్రవర్తి సంగతి చూద్దాం. వామనావతారం మొదలు పెడుతూ ఏం చెప్పుకున్నాం? దానాలు ఇస్తూ అదో వ్యాపకంగా మొదలైన బలి మార్పుతో ఆత్మ జ్ఞానానికి దగ్గిరౌతున్నాడు. మొదట్లోనే వచ్చినవాడు మహావిష్ణువు అని వచ్చిన వామనుడు తెలిసీ తెలియకుండానూ, ఇప్పుడు తనకన్నీ చేసిపెట్టిన గురువు శుక్రాచార్యులు విశదీకరించి మరీ స్పష్టంగానూ చెప్తున్నారు. దానం ఇస్తే ఏమౌతుందో తెలియదు. ఇవ్వకపోతే పోయేది తెలుస్తూనే ఉంది – తను దేనికోసం ఇంతకాలం పాటుపడ్డాడో అవన్నీ పోతాయి. ఇటువేపు శుక్రాచార్యుల మాట వినడమా, అటువేపు దానం ఇవ్వడమా? ఆత్మ సాక్షాత్కారమా? కులమూ, రాజ్యమూనా? ఇంతా చేసి దానం ఇస్తే ఆ వచ్చినవాడు విష్ణువు కాక మామూలు కుర్రాడు అయితే?

ఇదంతా చూస్తున్న వామనుడు ఎలా ఉన్నాడో ఊహించుకోవడం అంత కష్టం కాదు కదా? ఆత్మ జ్ఞానానికి ఒక్క అడుగు దూరంలో ఉన్నవాడు వెనక్కి వెళ్తే భగవంతుడి కన్నా ఎక్కువ బాధపడేది మరొకరు ఉండబోరు. అంటే ఇప్పుడు బలి శుక్రాచార్యుల మాటలు వినకుండా ఈ పరీక్షలో ఉత్తీర్ణుడౌతాడా? అలా అయితే జ్ఞానానికి బలి కంటే అర్హుడైన మరొకడు ఉండబోడు.

వామనుడు యాగశాలలోకి రాగానే ఒళ్ళంతా కళ్ళూ చెవులూ చేసుకుని "సుహుతంబులయ్యే శిఖులుం..." అన్న బలి తన గురువైన శుక్రాచార్యులు చెప్పినదంతా విని ఇవ్వనంటాడా? లేకపోతే ఏమంటాడో.

బలి శుక్రాచార్యుల సంవాదము; వామనావతారం – 10

బలిని వామనుడు మూడు అడుగులు దానం అడిగాడు కదా? ఇవ్వడానికి సిద్ధమౌతూంటే తనచేత నూరు అశ్వమేధాలు చేయించిన గురువులు ఇవ్వొద్దనీ, ఇస్తే వచ్చే అనర్ధాలూ వివరించి చెప్పారు. వచ్చిన కుర్రాణ్ణి బయటకి పంపించడం అనేది ఓ పెద్ద పనికాదు. వచ్చినవాడు ఎవరో చూచాయగా తెలుస్తూనే ఉంది. ఏం చేయాలిప్పుడు? కార్య దక్షత ఉన్నవాడు చెప్పుడు మాటలు వినాలా? శ్రేయోభిలాషుల మాటలు వినాలా? రెండూ మంచివి కాకపోతే? అంటే ఇప్పుడు అందరి మాటలు విన్నాక ఏం చేయాలనేది పూర్తిగా నిర్ణయించుకోవలసినది ఎవరు? బలి ఒక్కడే కదా?

వ. అని యిట్లు హితంబు పలుకుచున్న కులాచార్యునకు క్షణమాత్ర నిమీలిత లోచనుండయి యశస్వి యిట్లనియె.
[8-587]

ఇదంతా విన్న బలి చక్రవర్తి ఓ క్షణం కళ్ళు మూసుకుని ఆలోచించి ఇలా అన్నాడు శుక్రాచార్యులతో.

కాస్త ఆలోచిస్తే వామనావతారం కథ మొత్తంలో, ఈ ఒక్క వాక్యానికీ ఉన్నంత ప్రాముఖ్యత మరి దేనికీ లేదంటే అతిశయోక్తి కాబోదు. ఈ వచన వాక్యం ఒక్కదాని మీదా బ్రహ్మాండమైన పరిశోధన చేయొచ్చు. తర్వాతి పద్యం చూసేముందు, కళ్ళు మూసుకున్న ఆ క్షణంలో బలి ఆలోచనలూ, ఏమి నిర్ణయించుకున్నాడో చూద్దాం.

మొదటి విషయం – నూరు అశ్వమేధాలు చేస్తూ వచ్చినవాళ్ళకి లేదనకుండా ఏదడిగితే అది దానం ఇస్తూ వచ్చిన బలి ఇప్పుడు ఇవ్వనూ అనడం అసంభవం. ఎందుకంటే అసలు నూరు అశ్వమేధాలు చేసినది ఇంద్రుడవడానికి. ఇంద్రుడైతే యాగాలలో హవిర్భాగం దక్కుతుంది. అప్పుడు యజ్ఞాలు చేసేవాళ్ళకీ, ప్రజలందరికీ అడిగినవి ఇస్తూ ఉండాలి. అంటే "ఇవ్వనూ" అనే మాట నోట్లోంచి వచ్చేసరికి ఇంద్రపదవికి అర్హత చేజేతులా పోగొట్టుకున్నట్టే. రెండోది – ఇంతకాలం చేతికి ఎముక లేకుండా దానాలు చేస్తూ తన రాక్షసత్వం, అసుర గుణాలు తనకి తెలియకుండానో, తెలుస్తూనో పోగొట్టుకుంటూన్న బలి ఇప్పుడు ఇవ్వనూ అంటే మళ్ళీ అసుర గుణాలు పోగేసుకోవాలి. బుర్ర ఉన్న అధముల్లో అధముడు కూడా ఒప్పుకుంటాడా ఇటువంటి పనికి? మూడోది – వచ్చినవాడు శ్రీహరి కాదు ఎవరో చిన్న కుర్రవాడనుకుందాం.

వచ్చినవాడెలా ఉన్నాడు? "శంభుండో హరియో పయోజభవుఁడో చండాంశుఁడో వహ్నియో..." అంత బ్రహ్మ వర్చస్సు ఉంది ఈ కుర్రాడికి. త్రిలోకాలూ పాలించే బలి చక్రవర్తి వేదం చదువుకున్న పాలబుగ్గల కుర్రాడికి మూడడుగుల భూమి ఇవ్వనూ అన్నాడంటే ఎంత అప్రదిష్ట? పోనీ వచ్చినవాడు శ్రీహరి అనుకుంటే, సాక్షాత్తూ భగవంతుడు తనని అడుగుతున్నాడు చేయిసాచి; ఇవ్వననడం ఎంత దరిద్రానికి నోచుకుంటుందో? ఇవ్వననడం కన్నా పాపం మరోటి ఉండబోదు కదా? నాలుగోది – వచ్చినవాడు మహా విష్ణువే అయితే, వస్తూనే ఏమన్నాడు? "స్వస్తి జగత్త్రయీ భువన శాసన కర్తకు..." అంటూ ఆశీర్వచనం ఇచ్చాడు కదా? స్వస్తి అనేదాన్ని తనకి అన్వయించుకుంటే ఇవ్వడానికి వెనుకాడ్డంలో అర్థమే లేదు. బలి ఇది గ్రహిస్తే ఇంకా భయపడవల్సినదేముంది?

అయిదు – పోనీ ఇవన్నీ పక్కనపెట్టి వామనుణ్ణి బయటకి పంపేసాడనుకుందాం, అప్పుడు తనకూడా ఉన్న కులం, రాజ్యం, గురువులూ, చుట్టాలు అందరూ కూడా వచ్చేవాళ్ళేనా? పోనీ వచ్చినా ఎంతకాలం కూడా వస్తారు? యముడి పిలుపు వినేదాకానే కదా? ఆ తర్వాత ఈ త్రిలోకాలూ, తన డబ్బులూ రాజ్యం కులం తనకూడా వస్తాయా? ఆరు – కుల గురువు చెప్పినవి అన్నీ విన్నాక, శుక్రాచార్యులని కాదని దానమిస్తే ఆయనకి కోపం వస్తే? ఇటువైపు చూస్తే భగవంతుడు; అటువేపు చూస్తే కులం, రాజ్యం, గురువులు. కులగురువు కోపం ఏపాటిది భగవంతుడితో పోలిస్తే? ఏడు – తనకులం ఎంత గొప్పది? తన తాత ముత్తాతలూ ఎంతటి వాళ్ళో వామనుడే చెప్పాడు కదా? ఇవ్వనూ అంటే తన తాత ప్రహ్లాదుడేమంటాడో ఊహించుకోవడం అంత కష్టం కాదు. తాను ఇవ్వనంటే తన తరమే కాదు తన తాత ముత్తాతల దగ్గిర్నుంచి తన దాకా, తన తరువాతా, తరతరాలు మర్చిపోకుండా ఇలా బలి ఇస్తాను అని చెప్పి తర్వాత ఇవ్వనన్నాడు సుమా అని చెప్పుకోరూ? అంటే తనపేరే కాదు తన కులాన్ని, తరతరాల ప్రతిష్టనీ చేతులారా నాశనం చేసుకున్నట్టే కదా? ఎనిమిది – ఇస్తానని మాట ఇచ్చి దానమివ్వడానికి చేతిలోకి నీళ్ళు తీసుకున్నాక ఇవ్వననడమా? ఇది ఎంత నీచమైన పద్ధతి. తొమ్మిది – బలి త్రిలోకాలకీ చక్రవర్తి; అత్యద్భుతమైన కార్య దక్షత కలవాడని తెలుస్తూనే ఉంది. ఇవన్నీ తన సొంతంగా ఆలోచించుకోగలడు. అద్భుతమైన కార్యదక్షత తలిగిన తాను, ముల్లోకాలకీ చక్రవర్తి అయిన తాను, గురువులైతే మాత్రం పక్కవాళ్లమాటలు విని, నిజానిజాలు అలోచించుకోకుండా నిర్ణయం తీసుకోవడమా? అప్పుడు తన కార్య దక్షత గంగలో కలిసిపోయినట్టే. పది – ఇటువేపు శుక్రాచార్యులు చెప్పినట్టూ వచ్చినవాడు శ్రీహరి అయితే తనకోసం, తనని దానం అడగడం కోసం ఒక మానవజన్మ ఎత్తి మరీ తనదగ్గిరకొచ్చాడు భగవంతుడు – ఎంత పుణ్యం చేసుకుంటే ఈ అవకాశం వస్తుంది? ఈ అవకాశం చేయిజార్చుకోవడమా? ఇలా చెప్పుకుంటే పోతే ఉద్గ్రంథం అవుతుంది.

అటువేపు మహావిష్ణువు చూస్తున్నాడు బలి కేసి – తనని చేరబోయే భక్తుడు ఎంతటి దశకి చేరాడో, బలి మనసులోకి సూటిగా చూస్తూ. మనమే కనక వామనుడి పక్కన నిల్చుని ఉన్నట్టైతే మనకేమనిపిస్తుంది? ఇవ్వొద్దు అని బలితో అనగలమా? ఈ క్షణ మాత్రంలో బలి ఇవన్నీ ఆలోచించుకుని, నిర్ణయం తీసుకుని చెప్తున్నాడు గురువులతో. ఇక్కడ బలిని పోతన ఏమన్నాడో గమనించారా? – యశస్వి, అంటే కీర్తిగలవాడు. అటువంటి బలి ఇప్పుడున్న కీర్తి పోగొట్టుకోవడమా?

సీ. నిజ మాన తిచ్చితి వీవు మహాత్మక! ;
మహిని గృహస్థధర్మంబు నిదియ
యర్థంబుఁ గామంబు యశమును వృత్తియు;
నెయ్యది ప్రాపింప నిత్తు ననియు
నర్థ లోభంబున నర్థిఁ బొమ్మను టెట్లు? ;
పలికి లే దనుకంటెఁ బాప మెద్ది?
యెట్టి దుష్కర్ముని నే భరించెదఁ గాని;
సత్యహీనుని మోవఁ జాల ననచుఁ [8-588]

తే. పలుకదే తొల్లి భూదేవి బ్రహ్మతోడ
సమరముననుండి తిరుగక చచ్చుకంటె
బలికి బొంకక నిజమునఁ బరఁగుకంటె
మానధనులకు భద్రంబు మఱియుఁ గలదె. [8-588.1]

మీరు చెప్పినది అక్షరాలా నిజమే. కానీ నా వేపు నుంచి ఆలోచించండి మరి. ఏది అడిగినా ఇస్తాను అని చెప్పి ఇప్పుడు అడిగిన తర్వాత లోభంతో లేదు, ఇవ్వనూ అని చెప్పమంటారా? దాని కన్నా పాపం ఇంకోటి ఏవుంది? ఎలాంటివాడినైనా భరించగలను కానీ మాట ఇచ్చి తప్పేవాడిని భరించలేను అని మొదట్లోనే భూదేవి బ్రహ్మదేవుడితో అంది కదా? మాట నిలబెట్టుకోవడం, సమరంలో వెన్ను చూపించకుండా పోరాడటం కంటే మరో మంచి పద్ధతి ఏవుంది?

సంస్కృత సుభాషితంగా చెప్పబడే ఈ శ్లోకం ఏమంటోందో గమనించండి.

కృపణేన సమో దాతా న భూతో న భవిష్యతి,
అస్పృశన్నేవ విత్తాని యః పరేభ్యః ప్రయచ్ఛతి.

లోభి అంత గొప్పగా దానంచేసేవాడు ఎవరూ లేరుట. ఎందుకంటే ఎవరికీ ఇవ్వకుండా, తాను వాడుకోకుండా లోభి కూడబెడుతూ ఉంటాడు. అయితే వాడు పోయిన తర్వాత ఆ సంపద ఏమౌతుంది? పరులకి పోతుంది కదా? అంటే కూడబెట్టిన డబ్బుల్ని తన చేత్తోకూడా ముట్టుకోకుండా ఎవరికో దానమిచ్చేస్తున్నాడని చమత్కారం. అయితే ఇక్కడ గమనించ వల్సింది, లోభగుణం వల్ల లోభికి కీర్తీ రాదు, పుణ్యమూ రాదు. అవన్నీ తెల్సినవాడు కనక బలి చక్రవర్తి “లోభంతో ఇవ్వనూ అని చెప్పమంటావా” అంటున్నాడు గురువుతో.

క. ధాత్రిని హలికునకును సు
క్షేత్రము బీజములు నొకటఁ జేకుఱు భంగిం
జిత్రముగ దాత కీవియుఁ
బాత్రము సమకూరునట్టి భాగ్యము గలదే? [8-589]

పంట పండించే రైతుకి మంచి భూమీ, విత్తనాలూ అన్నీ సమకూరినట్టు చిత్రంగా దానం చేసేవాడికి పాత్రుడైన వాడు, గ్రహీత దొరికాడు. ఇటువంటి మహద్భాగ్యం మళ్ళీ వస్తుందా జీవితంలో?

శా. కారే రాజులు? రాజ్యముల్ గలుగవే? గర్వోన్నతిం బొందరే?
వారేరీ సిరిమూటఁగట్టుకొని పోవం జాలిరే? భూమిపైఁ
బేరైనం గలదే? శిబిప్రముఖులుం బ్రీతిన్ యశః కాములై
యీరే కోర్కులు? వారలన్ మఱచిరే యిక్కాలమున్? భార్గవా! [8-590]

అవన్నీ పక్కనపెట్టి చూస్తే, చాలామందికి రాజ్యం చేతుల్లోకి వచ్చింది. అది చూసుకుని గర్వంతో రాజ్యాలు చేసారు, సంపదలూ కూడబెట్టుకున్నారు. కానీ పోయాక అవన్నీ మూటకట్టుకుని తీసుకెళ్ళగలిగేరా? ఇప్పుడు వాళ్ల పేరు భూమి మీద ఎవరికైనా తెలుసా, గుర్తుందా? మరి దానాలతో యశస్సు సంపాదించిన శిబి వంటి ప్రముఖులో? ఇప్పటికీ వాళ్ళపేరు తలుస్తున్నాం కదా?

క. ఉడుగని క్రతువులఁ వ్రతములఁ
బొడగనఁ జన నట్టి పొడవు పొడవునఁ గుఱచై
యడిగెడినఁట; ననుబోఁటికి
నిడరాదె మహానుభావ! యిష్టార్థంబుల్. [8-591]

ఇంతాచేస్తే దానం అడగడానికి వచ్చినవాడెవడు? మీరే చెప్తున్నారు కదా వచ్చినవాడు శ్రీహరి అని? ఎడతెగని క్రతువులతో, తపస్సుతో కానీ ఏమి చేసినా కానీ సులువుగా ఎవరికీ కనపడని మహావిష్ణువు, అన్ని సంపదలకీ మూలమైన లక్ష్మీ దేవిని వక్షస్థలంలో ఉంచుకున్న ఆ శ్రీహరి, ఇప్పుడు నా ముందు పొట్టివాడుగా అయ్యి నన్ను చేయిసాచి దేహీ అభ్యర్దిస్తున్నాడు.

శా. ఆదిన్ శ్రీసతి కొప్పుపైఁ, దనవుపై, నంసోత్తరీయంబుపై,
బాదాబ్జంబులపైఁ, గపోలతటిపై, బాలిండ్లపై నూత్నమ
ర్యాదం జెందు కరంబు గ్రిం దగుట మీఁదై నా కరంబుంట మేల్
గాదే? రాజ్యము గీజ్యమున్ సతతమే? కాయంబు నాపాయమే? [8-592]

మరి ఆ అడిగే చేయి ఎటువంటిది? లక్ష్మీ దేవి యొక్క కొప్పు ముడి మీద, శరీరం మీద, పైట చెంగు మీద, పాదపద్మాల మీద, చెక్కిళ్ళ మీద, పాలిండ్ల మీద సరికొత్త మర్యాదలు పొందే అద్భుతమైన హస్తం; అటువంటిది కిందది కావటం నాచెయ్యి పైది కావటం ఎంతటి అదృష్టం! దీని ముందు నా రాజ్యం, నా జీవితం, నా శరీరం ఏపాటివి? ఇవేమైనా శాశ్వతంగా ఉండేవా! నా శరీరం ఏమైనా పడిపోకుండా ఉండిపోతుందా ఎల్లకాలమూ?

భాగవతం చదువుతూంటే ఇంతటి భక్తిలో కూడా పోతన ఇటువంటి పద్యం రాసాడేమిటా అనిపించే వారికీ, గీతగోవిందంలోనూ, అష్టపదుల్లోనూ, మహాభాగవతంలోనూ పద్యాలు బయటకి తీసి "స్త్రీ, పురుష శరీరాంగాలని అసభ్యంగా వర్ణించారు; అవి భగవంతుడి గురించా?" అని వెక్కిరించే పండితులకీ శిరస్సు వంచి నమస్కారం. ఏదైనా మనకి సరిగ్గా అర్థం కావాలంటే అది వివరించి చెప్పే వాళ్ళు అవసరం. మనకి అర్థమయ్యేవి మన మనఃస్థితి మీద ఉంటాయనేది జగమెరిగిన సత్యం కదా? ఈ పద్యాన్ని తెలుగు పద్యం బ్లాగు నిర్వహించే శ్రీ భైరవభట్ల కామేశ్వర రావు గారు ఎలా వివరించారో చూడండి (http://telugupadyam.blogspot.com/2010/09/blog-post_23.html)

*"... విష్ణుమూర్తి స్వయంగా తన దగ్గరకి వచ్చి దానం అడుగుతూంటే, అంత కన్నా అదృష్టం మరేముంది అనుకున్నాడు. ఎందుకు? ఎవరా విష్ణుమూర్తి? సాక్షాత్తూ శ్రీమహాలక్ష్మి పెనిమిటి. అంటే ప్రపంచంలోనున్న సర్వ సంపదలతో నిత్యభోగాన్ని అనుభవించే వాడు. మరొకళ్ళకి ఇవ్వడమే తప్ప పుచ్చుకోవడం తెలియనివాడు. ఆ వైభోగాన్ని ఈ పద్యంలో వర్ణిస్తున్నాడు. భార్య అయిన లక్ష్మీ దేవి కొప్పుపైన శరీరంపైన పైటకొంగుపైన పాదాలపైన బుగ్గలపైన పాలిండ్లపైన ఉండే చెయ్యి ఆయనది. అలా ఉండడం వల్ల ఆ చేయికి ఎప్పుడూ నూతన మర్యాద కలుగుతుందట! విష్ణువుని ఒక మామూలు పురుషుడిగా లక్ష్మీ దేవిని మామూలు స్త్రీగా ఊహించుకొని, ఇక్కడ వర్ణించినది ఆ భార్యాభర్తల శృంగారాన్ని అనుకుంటే, ఈ "నూత్న మర్యాదన్ జెందు" అనే మాట పొసగదే! ఇది వట్టి సాంసారిక శృంగారమైతే, ఆ చేతికి కొత్త మర్యాద ఎక్కడనుండి వస్తుంది? రాదు. ఇక్కడ వర్ణించిన లక్ష్మీ దేవి అంగాలన్నీ వివిధ రకాలైన సంపదలని మనం భావించాలి. అలాంటి సంపదలని లోకానికి ఎప్పుడూ దానం చేస్తూ ఉండడం వల్ల ఎప్పటికప్పుడు ఆ చేతికొక కొత్త గౌరవం వస్తుందన్నమాట. అలా ఎప్పుడూ పైనే ఉండే చెయ్యి ఇప్పుడు కిందయ్యింది! తన చేయి ఆ చేతిపైన ఉంది. అంటే లోకానికి సమస్త సంపదలనీ అందించే విష్ణువుకి కూడా తాను ఇవ్వగలిగింది ఏదో ఉందన్న మాట. అంతకన్నా గొప్ప విషయం మరొకటి ఏముంటుంది! ఇక రాజ్యం, గీజ్యం ఉంటేనేం పోతేనేం. శరీరం ఎప్పటికైనా నశించేదే కదా. ఈ జ్ఞానం బలిచక్రవర్తిలో పరిపూర్ణంగా ఏర్పడింది."*

అర్థమైంది కదా? అందుకే మన ఇష్టం ప్రకారం అర్థం చేసుకోవడం వేరూ, శ్రీ భైరవభట్ల, చాగంటి వారి లాంటి పండితులు చెప్తే అర్థం అవడం వేరూను. ఈ వ్యాఖ్యానం చదివాక మరోసారి అష్టపదులో, గీతగోవిందమో చదివితే మరో మంచి అర్థం కనిపిస్తోందా? అందుకే ఏ మతంలోనైనా సరే విజ్ఞుల దగ్గిర సత్సంగం అనేది చేస్తూండటం అవశ్యమని నొక్కి

వక్కాణిస్తూంటారు. సాధకుడు ఓ దశ దాటిన తర్వాత భగవంతుడి గురించి తప్ప మరే ప్రాపంచిక విషయాలు విన్నా అసహ్యించుకుంటాడు అని శ్రీ రామకృష్ణులంటారు. మరి మహోన్నత అధ్యాత్మిక స్థితి పొందిన శంకర భగవత్పాదులూ, జయదేవులూ స్త్రీ పురుషాంగాలని అసభ్యంగా వర్ణిస్తారా? మన మనసులోలేని కల్మషం బయట ఎలా కనిపిస్తుంది మనకి? తప్పు మనదే కదా? అందుకే శంకరులు చెప్పినట్టూ మనస్సనేది ముఖ్యం, “ --- భవతు భవదర్థం మమ మనః.”

ఓ క్షణంలో ఇవన్నీ ఆలోచించుకుని తన మనసులో చేసుకున్న నిర్ణయం చెప్పాల్సిన సమయం వచ్చింది. బలి గురువు తో ఏమి చెప్తాడో, దానికి శుక్రాచార్యులిచ్చే సమాధానం ముందు చూద్దాం.

బలి దాన నిర్ణయము; వామనావతారం – 11

ముందు వ్యాసం లో చెప్పినట్టూ, బలి దానం ఇవ్వడానికే నిర్ణయించుకున్నాడు. తానెవరో, ఎందుకు వచ్చాడో శ్రీహరి చూచాయగా చెప్పినప్పుడూ, వచ్చినవాడు మహావిష్ణువేనని కులగురువు విడమర్చి చెప్పినప్పుడూ అన్నీ విన్నాడు. ఇవ్వడానికి నిర్ణయం అయిపోయింది. అన్నీ నిర్ణయించుకున్న బలి దానం ఇస్తాడా అనేది చూసేముందు పార్థసారథి దానం గురించి ఏమి చెప్పాడో ఓ సారి చూద్దాం.

దాతవ్య మితి య ద్దానం దీయతేనుపకారిణే
దేశే కాలే చ పాత్రే చ త ద్దానం సాత్త్వికం స్మృతం

య త్తు ప్రత్యుపకారార్థం ఫల ముద్దిశ్య వా పునః
దీయతే చ పరిక్లిష్టం త ద్దానం రాజసం స్మృతం

అదేశకాలే య ద్దాన మపాత్రేభ్య శ్చ దీయతే
అసస్కృత మవజ్ఞాతం త త్తామస ముదాహృతం (భగవద్గీత, శ్రద్ధాత్రయ విభాగయోగం 20-22)

"దానం ఇవ్వడమనేది నా కర్తవ్యం" అనే భావంతో ప్రత్యుపకారం ఆశించకుండా పుణ్యప్రదేశాల్లో, పుణ్యకాలాల్లో పాత్రులైనవాళ్ళకి చేసేది సాత్వికమైన దానం. ప్రత్యుపకారం ఆశించో ఆముష్మికఫలం అభిలాషించో, అనిచ్ఛాపూర్వకంగా చేసేది రాజసిక దానం. అపవిత్ర స్థానంలో, అయోగ్యులకి ప్రియవచనాది సత్కారాలు లేకుండా తిరస్కార భావంతో చేసేది తామసిక దానం."

దానం అడగడానికి వచ్చిన వటుడు ఎలాంటి వాడు? అత్యంత పాత్రుడైన, భగవంతుడూ అతి యోగ్యుడూ అయిన శ్రీహరి. వచ్చినవాడు ఎలా వచ్చాడు? చిన్న కుర్రాడిలా. అంటే మొహం చూసి "ఇవ్వను" అనడం అసంభవం ఎవరికైనా సరే. అడిగిన వేళా విశేషం ఎటువంటిది? యజ్ఞం చేసే సమయం. ఇచ్చేవాడు ముల్లోకాలకీ చక్రవర్తి. మరి ఇటువంటివాడు

అడిగినప్పుడు, ఇంతకంటే మరో అదృష్టం ఎక్కడుంది? అందుకే తనకున్న దక్షత, బుద్ధీ, మేధస్సూ అన్నీ ఉపయోగించి వచ్చినవాడెవడో గ్రహించాడు బలి. ఇంక ఇవ్వడానికి ఏమీ వెనక్కి చూసుకోవాల్సిన పనిలేదు. మరోసారి శుక్రాచార్యులు ఏదైనా చెప్పేలోపున తన నిర్ణయాన్ని ఇప్పుడు చెప్తున్నాడు.

మ. నిరయంబైన, నిబంధమైన, ధరణీ నిర్మూలనంబైన, దు
ర్మరణంబైనఁ గులాంతమైన నిజమున్ రానిమ్ము; కానిమ్ము పో;
హరుఁడైనన్, హరియైన, నీరజభవుం డభ్యాగతుండైన నౌఁ;
దిరుగన్ నేరదు నాదు జిహ్వ; వినుమా; ధీవర్య! వే యేటికిన్? [8-593]

నరకం దాపురించినా సరే (నిరయంబైన), నన్ను కట్టివేసినా సరే (నిబంధమైన), రాజ్యం సర్వ నాశనం అయిపోయినా సరే, దుర్మరణం వచ్చినా సరే, కులాంతమైనా సరే, వచ్చినవాడు, హరి హరాదులైనా, బ్రహ్మ అయినా సరే, అభ్యాగతుడు కనక (హరుఁడైనన్, హరియైన, నీరజభవుం డభ్యాగతుండైన) ఈ దానం ఇవ్వను అనడానికి నాకు నోరు రావట్లేదు. వేయి మాటలు దేనికి?

ఏం పద్యమండీ ఇది? మొత్తం వామనావతారంలో ఏ పద్యం నీకు బాగా నచ్చింది అంటే ఇదే. ఈ ప్రతిజ్ఞ చేస్తూన్నప్పుడు మనమో సారి వటుడి పక్కన ఉన్నట్టు ఊహించుకుందాం. ఇది వినేసరికి వళ్ళు గగుర్పాటు రాదూ? నువ్వు చేసిన నూరు అశ్వమేధాల ఫలం పో(బో)తోంది, నీ రాజ్యం, నీకున్న సర్వస్వం తగలబడిపోతుంది, దానం ఇవ్వకు అని కులగురువు చెప్తూంటే బలి చక్రవరి ఏమంటున్నాడు? "...రానిమ్ము కానిమ్ము పో." అదీ సాత్విక దానం అంటే. మాట తప్పడం లేదు. కుల గురువు కోపం ఏపాటిది? దుర్మరణం వచ్చినా సరే ఇస్తాను ఈ దానం అంటున్నాడు. ఎప్పుడైనా మనం జీవితంలో "ఒ-క్క-సా-రి" ఇలా ఉండగలమా? ఆత్మార్థే పృధ్వీం త్యజేత్ అంటే అర్ధమౌతోంది కదా?

తరువాత పద్యం చూసేముందు చిన్న పిట్ట కథ చెప్పుకుందాం. కర్ణుడి సంగతి తెలుసు కదా? ఎప్పుడు ఏ సమయంలో ఎవరు ఏది అడగడానికి వచ్చినా సరే నేరుగా మహారాజు దగ్గిరకి వెళ్ళడానికి వీలు కలిపించాడుట కర్ణుడు. అంటే అర్ధరాత్రి పడుకున్నప్పుడైనా సరే లేపి ఇలా ఫలానాది నాకు కావాలి అని అడిగితే లేదనకుండా ఇచ్చేసేవాడుట. ఓ సారి స్నానం చేయడానికి తయారౌతున్నాడు కర్ణుడు. ముందో బంగారం గిన్నెలో నూనె వంటికి రాసుకుంటున్నాడు. గిన్నె

ఎడమ చేతిలో ఉంది. నూనె కుడిచేత్తో తీసుకుని వంటిమీద రాసుకుంటున్నప్పుడు ఓ బ్రాహ్మడు వచ్చి దానం అడిగాడుట. వెంటనే ముందూ వెనకా చూసుకోకుండా ఎడమచేత్తో నూనె ఉన్న ఆ బంగారం గిన్నె తీసుకో అని ఇచ్చేసాడు కర్ణుడు. బ్రాహ్మడు అది తీసుకోకుండా 'అయ్యా అలా ఎడమచేత్తో ఇవ్వకూడదండీ' అన్నాడుట. అప్పుడు చెప్పాడుట కర్ణుడు. “దానం ఇవ్వాలి అని నాకు అనిపించినప్పుడు వెంటనే ఇచ్చేయాలి. అంతే గానీ కుడిచేతితో ఇస్తున్నామా ఎడమ చేతితో ఇస్తున్నామా అని చూసుకోకూడదు. ఎందుకంటే ఈ బంగారం గిన్నె ఎడమచేతిలోంచి కుడిచేతిలోకి వచ్చేసరికి నా మనసు మారిపోయి నీకు మరోటి ఇవ్వాలనిపించవచ్చు కదా?” ఆ బ్రాహ్మడు కర్ణుడు చెప్పినదాన్ని ఒప్పుకుని ఆ గిన్నె తీసుకెళ్ళిపోయాడుట. ఈ కథలో ఎంత నిజముందో ఓ సారి ఆలోచిద్దాం.

మీరు అలా వీధిలో నడుస్తూంటే ఓ బిచ్చగాడు ఎదురయ్యాడు. వాణ్ణి చూసి మీకు జాలో మరోటో వేసి ఏదో ఇవ్వాలి అనుకున్నారు. జేబులో చేయి పెట్టేముందు పాపం ఎంత కష్టంలో ఉన్నాడో, లేకపోతే చేయిసాచి దేహీ అనలేడు కదా అని మీకు అనిపించింది. అందుకు మీరు ఓ యాభై రూపాయలిద్దామనుకున్నారు. జేబులో చేయిపెట్టి డబ్బులు బయటకి తీస్తే ఓ ఇరవై కాయితం, ఓ వంద కాయితం, ఇవ్వాలనుకున్న యాభై కాయితం బయటకొచ్చాయి. జేబులోంచి బయటకొచ్చిన ఇరవై కాయితం చూడగానే, “యాభై ఎక్కువే, రోజూ చాలా మంది దగ్గిర అడుక్కుంటూ బాగానే సంపాదిస్తూ ఉండొచ్చు, వీడికి ఇరవై చాలదేమిటి” అనిపించిందా? లేకపోతే మీ పక్కనున్న భార్యో, హితుడో, స్నేహితుడో అలా చెప్పారా? మీ మనసు మారడానికి ఎంతసేపు పట్టింది? సరిగ్గా అదే కర్ణుడు చెప్పినది. ఎడమచేతిలో గిన్నె కుడిచేతిలోకి మారడానికి ఒక్క క్షణం పట్టొచ్చు కానీ మనసు మారడానికి అందులో వెయ్యోవంతు చాలు కదా? ఈ కథ ఎక్కడైనా, ఏ దేశకాలాలో అయినా, ఎప్పుడైనా – బలి చక్రవర్తి కాలంలో అయినా, మహాభారత కాలం అయినా, ఈరోజుల్లో అయినా – అన్వయించుకోవచ్చు. అందుకే స్వామి వివేకానంద అంటారు, "ఇచ్చేటప్పుడు పుచ్చుకునేవాడికి కృతజ్ఞుడవై ఉండు. నువ్వు ఎప్పుడో ఓ సారి అతనికి ఇవ్వవలిసి ఉండడం వల్లే ఇప్పుడు నీ దగ్గిరకొచ్చి అడిగాడు. ఇచ్చినందుకు గర్వ పడకూడదు ఎందుకంటే వీధిలో కనబడే బిచ్చగాళ్లందరికీ ఇవ్వాలని మనకి అనిపించదే? మనం ఋణపడి ఉన్నవాడే మన దగ్గిరకొచ్చి అడుగుతున్నాడు. ఋణం తీరినందుకు కృతజ్ఞత ఉండడమే ముఖ్యం.”

ఆ. నొడివినంత పట్టు నుసలక యిచ్చుచో
నేల కట్టు విష్ణుఁ డేటి మాట?
గట్టెనేనిఁ దాన కరుణించి విడుచును
విడువకుండ నిమ్ము విమలచరిత! [8-594]

సరే ఇప్పుడు బలి ఇచ్చి తీరుతానన్నాడు కనక దానికున్న కారణాలు చెప్తున్నాడు. మొదటిది వటుడు గురువు చెప్పినట్టూ శ్రీహరి అయితే ఏమౌతుందనేది. మాటకి తలవొగ్గి ఇస్తానని చెప్పి ఇచ్చినప్పుడు శ్రీహరి అయితే మహావిష్ణువంతటివాడు నన్ను కట్టి పారేస్తాడా? పోనీ కట్టేసాడనుకుందాం ఇంతటి దానం ఇచ్చినందుకు నన్ను కరుణతో విడిచిపుచ్చడూ? ఇలా ఎందుకన్నాడో గమనించారా? ఎందుకంటే వస్తూనే ఏమన్నాడు శ్రీహరి? (స్వస్తి జగత్రయీభువన...) అది మనసులో గుర్తుంది బలికి. పోనీ విడవడనుకుందాం, దానివల్ల నాకు పోయినదేమీ లేదు. ఎందుకంటే తానిచ్చేది సాత్విక దానం; అంటే ప్రత్యుపకారం ఆశించి చేసేది కాదు. అంటే చిన్న కుర్రాడికి అడిగినది ఇవ్వాలని ఉవ్విళ్ళూరుతున్నాడు తప్ప వెనక్కి ఏదో ఆశించి కాదు. భాగవతంలో కొంచెం వెనక్కి తిరిగి చూస్తే అంబరీషుడి కథలో కూడా ఇటువంటి సందర్భం చూడొచ్చు (పాలేరై ప్రవహింపన్... వెండి గొరిజల్ హేమోరు శృంగంబులన్ అనే పద్యంలో). బలి చక్రవర్తి కార్యదక్షత సరిగ్గా గమనిస్తున్నారా?

క. మేరువు దల క్రిం దైనను
బారావారంబు లింకఁ బాటిన లోలో
ధారుణి రజమై పోయినఁ
దారాధ్వము బద్ధమైనఁ దప్పక యిత్తున్. [8-595]

చివరిగా మరోసారి తన నిర్ణయం చెప్తున్నాడు ఈ సారి మరీ స్పష్టంగా. మేరుపర్వతం తలకిందులైపోయినా సరే, సముద్ర జలాలు ఇంకిపోయినా సరే, భూమండలం పొడిపొడి అయిపోఇనా సరే, గ్రహాలూ పాలపుంతలతోఉన్న తారాధ్వం బద్ధలైపోయినా సరే ఈ దానం ఇచ్చి తీరుతాను. వామనావతారం చదువుతూంటే కళ్ళలో నీరు తిరగడానికి ఈ పై మూడు పద్యాలు చాలవూ? జీవితంలో నేర్చుకోవల్సిన సారమంతా ఇందులోనే ఉంది కదా?

మత్త. ఎన్నడుం బరువేఁడఁ బోఁడట; యేకలుం డఁట; కన్న వా
రన్నదమ్ములు నైన లేరఁట; యన్నివిద్యల మూల గో
ష్ఠిన్నెఱింగిన ప్రోఢ గుజ్జఁట; చేతు లొగ్గి వసింప నీ
చిన్ని పాపనిఁ ద్రోసిపుచ్చఁగ జిత్త మొల్లదు సత్తమా! [8-596]

మరి అటు వచ్చినవాడు శ్రీహరి అనుకుని బలి చక్రవర్తి ఇలా అటున్నాడేమో అనుకోవచ్చు కదా గురువు? అందుకు మరో కారణం చెప్తున్నాడు. వచ్చినవాడు శ్రీహరి కాకపోతే? వటుడు వస్తూనే చెప్పాడు కదా "ఒంటివాడను చుట్టమొకడులేడు" అంటూ? ఒంటివాడుట, ఎప్పుడూ ఎవరిదగ్గిరకీ వెళ్ళి అడగలేదుట, అన్ని విద్యలూ తెలిసిన విప్రుడు. ఈ విషయం తాను స్వయంగా చూసాడు. ఎందుకంటే ఈ వటుడు వస్తూనే యజ్ఞగుండాల్లో అగ్నీ బాగా వెలగడం కనిపించింది. అదీగాక ఈ కుర్రాడి చిన్న చేతులు నన్ను అడుగుతూంటే ఇవ్వనూ అని చెప్పడానికి మనసు రావట్లేదు. ఇక్కడ గమనిచవల్సింది ఏమిటంటే ఎవరో ప్రేరేపిస్తేనో, ఏదో ఆశిస్తోనో, ఎవరినో సంతోషపెట్టడానికో క్షణికావేశంలో బలి ఇస్తానని గొంతెత్తి అరిచి గీపెట్టి చెప్పట్లేదు. అతి వినయంగా మనసులోమాట ఎందుకు ఇస్తాడో, ఇచ్చితీరుతాడో చెప్తున్నాడు.

వ. అని యిట్లు సత్య పదవీ ప్రమాణ తత్పరుండును, వితరణ కుతూహల సత్త్వరుండును, విమల యశస్కుండును, దృఢ మనస్కుండును, నియతసత్యసంధుండును, నర్థిజన కమలబంధుండును నైన బలిం జూచి శుక్రుండు గోపించి "మదీయ శాసనం బతిక్రమించితివి గావున శీఘ్రకాలంబునఁ బదభ్రష్టుండవుఁ గ" మ్మని శాపం బిచ్చె బలియును గురుశాపతప్తుండయ్యు ననృతమార్గంబు నకభిముఖుండుఁ గాకుండె; అప్పుడు. [8-597]

ఇలా చెప్పి దానం ఇవ్వడానికి ముందుకొచ్చేసరికి కుల గురువు కి కోపం వచ్చింది. నా మాట వినవు కాబట్టి నీ పదవి పోతుంది అని శపించాడు అక్కడికక్కడే. ఓ సారి పురాణాల్లో కథలు చూస్తే సాత్వికులైన వశిష్టుడు లాంటి వాళ్ళు తిరుగు శాపం ఇవ్వకపోవడం, విశ్వామిత్రులవంటి వారు ముందూ వెనకా చూసుకోకుండా తిరుగు శాపం ఇవ్వడం గమనించవచ్చు. అంటే అహంకారం ఇంకా పోలేదన్నమాటే కదా? మరి ఇక్కడ బలి ఎలా తీసుకున్నాడు ఆ శాపాన్ని? "...ననృతమార్గంబు నకభిముఖుండుఁ గాకుండె" అంటే అబద్ధం ఆడలేదు; మాట వెనక్కి తీసుకోలేదు. ఎందువల్లో

గమనించారా? బలి "...సత్య పదవీ ప్రమాణ తత్పరుండును, వితరణ కుతూహల సత్త్వరుండును, విమల యశస్కుండును, దృఢ మనస్కుండును, నియతసత్యసంధుండును, నర్థిజన కమలబంధుండు" కాబట్టి. తిరుగు శాపం ఇవ్వలేదు. అంటే భగవద్దర్శనానికి అతి చేరువలో ఉన్నాడు. ఈ పరిస్థితుల్లో వామనుడికి ఎంత సంతోషం కలుగుతుంది బలిని చూసి?

ఇంత క్రితం శుక్రాచార్యులు ఈ దానం ఇవ్వొద్దని చెప్పడానిక్కారణం కూడా మహావిష్ణువు కల్పించినదే అని చెప్పుకున్నాం. అదేమిటి, తానే ఇవ్వమని అడుగుతూ ఇవ్వొద్దని గురువుని ప్రేరేపించడం ఏమిటనేదో పెద్ద ధర్మ సందేహం. దానిసంగతి, రెండు కారణాల్లో చూద్దాం.

మొదటిది. కుల గురువు ఇవ్వొద్దని ప్రేరేపిస్తే బలి మాట వెనక్కి తీసుకున్నాడనుకుందాం. అంటే ఇంద్రపదవికి అర్హతే లేదు. ఇన్నాళ్ళూ చేసిన క్రతువులకి అర్ధమేలేదు. అంటే ఇంద్రపదవి అందుకోవడానికి చిట్టచివరి అడ్డంకిగా పెట్టిన పరీక్షలో బలి విఫలుడైనట్టే కదా? రెండోది. కర్మ అనేది ఎవరికీ తప్పించలేనిది – మహావిష్ణువుతో సహా. భర్తృహరి ఏమంటున్నాడో చూడండి.

బ్రహ్మాయేన కులాలవన్నియమితో బ్రహ్మాండ భాండోదరే
విష్ణుర్యేన దశవతారగహనే క్షిప్తో మహాసంకటే
రుద్రోయేన కపాలపాణిపుటకే బిక్షాటనం కారితః
సూర్యోభ్రామ్యతి నిత్యమేవ గగనే తస్మై నమః కర్మణే (నీతి శతకం 1.94)

ఏ కర్మ వలనైతే ఈ బ్రహ్మాండం అంతా మోస్తున్నట్టు కట్టుబడి బ్రహ్మా, విష్ణువు పది అవతారాలు ఎత్తవల్సిన అగత్యం, పరమశివుడు కపాలంతో బిక్ష ఎత్తడం, సూర్యుడు గగనంలో అటునించటు క్రమం తప్పకుండా తిరగడం ఇష్టం ఉన్నా లేకపోయినా చేస్తున్నారో అటువంటి కర్మ అనేదానికి నమస్కారం.

ఇప్పుడు దానం తీసుకుని బలి పదవి, ఆస్తులూ, సర్వ సంపదలూ పోవడానికి తాను కారణమైతే ఆ కర్మ పోగొట్టుకోవడానికి మరో జన్మ ఎత్తాలి శ్రీహరి. ఆ ఎత్తిన జన్మలో మళ్ళీ ఎటువంటి కర్మ అంటుకుంటుందో? అటువంటి కర్మతో అసలు సత్వ రజస్తమో గుణాలకి అతీతుడైన భవంతుడు మరో జన్మ ఎందుకెత్తాలి? అది ఇక్కడే వదుల్చుకుంటే

మంచిది కదా. ఏ జన్మ మూలానైతే అష్టకష్టాలు అనుభవించి దేహబాధ అనుభవించాలో, జరామరణాల చట్రంలోంచి తప్పుకోవడానికి ముముక్షువులూ, యోగులైనవారు అవిశ్రాంతంగా శ్రమిస్తారో, ఆ జన్మ మళ్ళీ ఎందుకెత్తాలి? అందుకే బలి పదవి పోవడానికి కులగురువు శాపం ఇచ్చేలా, తనకి ఏమీ అంటుకోకుండా ఈ పాచిక. దీనివల్ల బలి పరీక్షలో నెగ్గినట్టే, తనకి కర్మ అంటుకోదు కూడా. అంటే దానం తీసుకున్నాక బలి పదవి పోవడానికి తాను కారకుడు కాదు. కులగురువు శాపం వల్ల బలి పదవి పోతుంది అంతే.

ఆ. బ్రతుక వచ్చుఁగాఁక బహుబంధనములైన
వచ్చుఁగాక లేమి వచ్చుఁగాక
జీవధనములైనఁ జెడుఁగాక పడుఁగాక
మాటఁ దిరుఁగ లేరు మానధనులు. [8-598]

ఇప్పుడు బలి గురించి మరో సారి చెప్తున్నాడు. అనేకానేక కష్టాలతో బతకడానికైనా సరే, ధనం వచ్చినా పోయినా సరే, ప్రాణహాని వచ్చినా ప్రాణం పోయినాసరే అభిమానం ఉన్నవాళ్ళు మాట తప్పలేరు బలి లాగ.

అదీ బలి చక్రవర్తి ప్రతాపం. వామనావతారం ఇంతవరకూ చదివాక ఇప్పుడు చూస్తే, ఎవరిది గొప్పతనం? ఒక అవతారం ఎత్తి దేహీ అన్న భగవంతుడిదా, లేకపోతే "నిరయంబైన నిబంధమైన" అంటూ "సత్య పదవీ ప్రమాణ తత్పరుండును, వితరణ కుతూహల సత్త్వరుండును, విమల యశస్కుండును, దృఢ మనస్కుండును, నియతసత్యసంధుండును, నర్థిజన కమలబంధుండును" అయిన బలి చక్రవర్తిదా?

తెలుగు సాహిత్యంలో కవితాకళ ప్రయోగించడంలో అక్షయ తూణీరుడైన పోతన ఒళ్ళు గగుర్పొడిచే కవితా ప్రభంజనం ఎలా ఉంటుందో ముందు మరోసారి రుచి చూద్దాం.

వామనుడికి దానమివ్వడం; వామనావతారం – 12

కులగురువు శాపం ఇచ్చినా సరే, బలి చక్రవర్తి వామనుడికి అడిగిన మూడడుగులు దానం ఇవ్వడానికి సిద్ధమాయ్యాడు కదా? ఇప్పుడు కాళ్ళు కడిగి దానం ఇవ్వాలి. ఇదిగో ఇవ్వడానికి సిద్ధమౌతున్నాడు.

ఆ. దనుజలోకనాథు దయిత వింధ్యావళి
రాజవదన మదమరాళ గమన
వటుని కాళ్ళుఁ గడుగ వరహేమ ఘటమున
జలముఁ దెచ్చె భర్త సన్న యెఱిఁగి. [8-600]

ఇంతవరకూ అసలు బలి చక్రవర్తి కుటుంబం గురించి గానీ వాళ్ళావిడని అడిగాడా దానం ఇచ్చేముందు అని కానీ ఏవీ తెలియవు మనకి. కాని ఇక్కడికొచ్చేసరికి అప్పటివరకూ చూస్తున్న వింధ్యావళి బలి మనసు తెల్సు కాబట్టి బంగారు కలశంతో నీళ్ళు పట్టుకొచ్చింది. అంటే “నన్ను అడక్కుండా ఎందుకిచ్చావ్? గురువు కన్నా, నాకన్నా, మన కుటుంబం కన్నా, మన కులం కన్నా ఈ కుర్రాడెక్కువా?” అంటూ గొడవపెట్టట్లేదు సరికదా, మాట్లాడకుండా మనసులోది బయటకి చెప్పకుండా దానానికి తానూ సిద్ధమే అని చెప్పకనే చెప్తూ కూడా నీళ్ళు పట్టుకొచ్చి సిద్ధమైంది. అంటే భర్తకి తగిన భార్యే. బలి ఇంద్రుడైతే పక్కన కూర్చోడానికి తగిన వ్యక్తే అని స్పష్టంగా తెలుస్తోంది కదా? వామనుడికి ఇంతకంటే కావాల్సినదేముంది?

వ. అయ్యవసరంబునఁ <u>గపటవటునకు</u> న <u>ద్దానవేంద్రుం</u> డిట్లనియె. [8-601]

క. రమ్మా మాణవకోత్తమ!
లెమ్మా నీ వాంఛితంబు లే దన కిత్తుం
దెమ్మా యడుగుల నిటు రా
నిమ్మా కడుగంగవలయు నేటికిఁ దడయన్? [8-602]

“రావయ్యా ఉత్తముడైన బ్రహ్మచారీ, నువ్వు అడిగినది లేదనకుండా ఇస్తాం. కళ్ళు కడగాలి కదా ఇలా రా, ఇంకా ఆలశ్యం దేనికీ” అంటూ బలి ఆహ్వానించాడు. ఇక్కడ్నుంచీ ప్రతీ పద్యంలోనూ మనం పోతన కవితా సమ్మోహనాస్త్రాలు చూడగలం. ఇక్కడకొచ్చేసరికి మళ్ళీ బలి దానం ఇచ్చే దానవేంద్రుడు, విష్ణువు కపట బ్రహ్మచారి. పద్యం నాలుగు పంక్తులలో మొదటి రెండక్షరాలలో ప్రాస గమనించారా?

 మ. బలి దైత్యేంద్ర కరద్వయీ కృత జలప్రక్షాళనవ్యాప్తికిన్
జలజాతాక్షుఁడు చాఁచె యోగి సుమనస్సంప్రార్థితశ్రీదముం
గలితానమ్ర రమా లలాటపదవీ కస్తూరికా శాదమున్
నలినామోదము రత్ననూపురిత నానావేదముం బాదమున్. [8-604]

బలి ఇలా అనేసరికి వటుడు ముందుకొచ్చి కాళ్ళు చాచాడు కడిగించుకోవడానికి. కాళ్ళు ఎలా కడగడానికి తయరయ్యేడు బలి? "కరద్వయీ కృత జలప్రక్షాళనవ్యాప్తికిన్.." రెండుచేతులతోటీను. నా సంపదంతా కొల్లగొట్టుకుబోతున్నాడు బాబోయ్ అంటూ ఏడుస్తూ ఏదో చిరాగ్గా, ఓ చేత్తో కడగట్లేదు. ఎందుకంటే ఇచ్చేది సాత్విత దానం. ఏవిధంగా ఇస్తున్నాడు? ”సత్య పదవీ ప్రమాణ తత్పరుండును, వితరణ కుతూహల సత్త్వరుండును, విమల యశస్కుండును, దృఢ మనస్కుండును, నియతసత్యసంధుండును, నర్థిజన కమలబంధుండును” అయ్యి ఇస్తున్నాడు. కడిగిన ఆ పాదాలు ఎటువంటివి? యోగుల మంచి మనస్సుతో నిరంతరం ప్రార్థించబడేవి, రత్నాలతో పొదగబడిన అందెలు కలవి, మహాలక్ష్మీ కస్తూరి తిలకం కలిగినటువంటివి, అనేక వేదాలకి మూలమైంటువంటివి. గమనించారా పద్యం మొదట్లో? దానం ఇంకా పూర్తవ్వలేదు; అందువల్ల ఇంకా బలి దైత్యేంద్రుడే.

క. సురలోక సముద్ధరణము
నిరతశ్రీకరణ మఖిల నిగమాంతాలం
కరణము భవసంహరణము
హరిచరణము నీఁటఁ గడిగె నసురోత్తముడున్. [8-605]

ఇలా ముందుకి చాచిన శ్రీహరి చరణాలని కడిగాడు బలి. ఆ పాదాలు సురలోకాన్ని బాగా కాపాడేవి (సురలోక సముద్ధరణము); కలకాలం మేలు కలిగించేవి (నిరతశ్రీకరణము), సకలవేద వేదాంతాలకీ అలంకారమైనవి (అఖిల నిగమాంతాలంకరణము), పునర్జన్మ అనేది లేకుండా చేసేవి (భవసంహరణము). "ణ" అక్షరాన్ని పోతన ఎంత చులాగ్గా సులభంగా వాడాడో గమనించారా? కాళ్ళు కడుగుతున్నాడు – అందువల్ల బలి ఇంకా అసురోత్తముడే. ఓ సారి ఆ కాళ్ళు కడగడం అయ్యాక బలిని పోతన ఏమంటాడో చూద్దాం.

వ. ఇట్లు ధరణీసుర దక్షిణ చరణ ప్రక్షాళనంబు చేసి వామపాదంబు గడిగి తత్పావన జలంబు శిరంబునం జల్లుకొని వార్చి దేశ కాలాది పరిగణ నంబు చేసి. [8-606]

ఇలా కాళ్ళు (దక్షిణ చరణం – కుడి పాదము, వామపాదంబు – ఎడమ పాదము రెండూ అన్నమాట) కడిగి ఆ పవిత్రమైన నీళ్ళు (తత్పావన జలంబు) నెత్తిమీద చల్లుకున్నాడు. అంటే ఇప్పటికి దానవేంద్రుడు పవిత్రుడైయ్యేడు. దేశకాలాలు లెక్కించుకుని, ఆచమనం చేశాడు. పూజలో చెప్తాం కదా మనం ఆచమనం చేసేటప్పుడు "...మమ ఉపాత్త దురితక్షయ ద్వార శ్రీ పరమేశ్వర ప్రీత్యర్థం, శుభే శోభన ముహుర్తే, అద్య బ్రహ్మణ ద్వితీయ పరార్ధే శ్వేత వరాహ కల్పే వైవశ్వత మన్వంతరే ... అస్మిన్ వర్తమానే వ్యావహారీక చంద్రమానేన..." అంటూ, అలాగన్న మాట. అంటే పంచ మహాభూతాల సాక్షిగా, సర్వ సురాసురలూ చూస్తూండగా దానమిచ్చాడు. ఏమంటూ?

శా. విప్రాయప్రకటవ్రతాయ భవతే విష్ణుస్వరూపాయ వే
దప్రామాణ్యవిదే త్రిపాద ధరణిం దాస్యామి! యంచుం గ్రియా
క్షిప్తుండై దనుజేశ్వరుండు వడుగుం జే సాఁచి పూజించి బ్ర
హ్మప్రీతమ్మని ధారపోసె భువనం బాశ్చర్యముం బొందగన్. [8-607]

ఇప్పుడు దానం ఇస్తున్నాడు. "బాహ్మణుడవీ, నిష్టతో ప్రసిద్ధమైనవాడివీ, విష్ణు స్వరూపమైనటు వంటివాడివీ అయిన నీకు మూడడుగులు ధరిణి దానం ఇస్తున్నాను అడిగినట్టుగా" అంటూ ధారపోసాడు. అది చూసి చతుర్దశ భువనాలూ ఆశ్చర్యపోయాయి. ఎందుకంటే ఇంత కష్టపడి శతాశ్వమేధాలు చేసి సంపాదించిన పుణ్యం అంతా ఒక్క క్షణంలో వెనక్కి చూసుకోకుండా ఇచ్చేసాడు. పోనీ మామూలుగా ఇచ్చాడా అంటే అదీ లేదు, "నిరయంబైన నిబంధమైన .." అనుకుంటూ,

క్రియాక్షిప్తుండై (పనిలోవేగం ఉండేలా చూసుకునేవాడు) ఇచ్చాడు. ఎందుకు వేగం? ఏమో మరో క్షణం ఆగితే మనసు మారిపోయి ఈ దానం ఇవ్వాలనిపించకపోవచ్చు కదా కర్ణుడి కథలో చెప్పినట్టూ? అందుకే.

ఆ. నీరధారఁ బడఁగ నీక యడ్డంబుగాఁ
గలశరంధ్ర మాఁపగాను దెలిసి
హరియుఁ గావ్య నేత్ర మటఁ గుశాగ్రంబున
నడువ నేకనేత్రుఁ డయ్యె నతఁడు. [8-609]

శుక్రాచార్యులుకిదంతా ఇంకా మింగుడు పడలేదు. దానం ఇచ్చేటప్పుడు బలి వాళ్ళావిడ పోసే కలశంలోంచి నీరు చక్రవర్తి చేతిలో పడకుండా ఆఖరి ప్రయత్నంగా అడ్డం పడ్డాడు. వామనుడు తక్కువవాడా? ఆ నీళ్ళు సరిగ్గా పడట్లేదని ఓ దర్భ పుల్లతో కలశం లోపలకి గుచ్చాడు. దానితో శుక్రాచార్యులకి (కావ్యుడు) ఓ కన్ను పోయింది. గమనించారా మనవాళ్ళు 'ఒరే అవతలవాళ్ళని చూసి ఏడుస్తే కళ్ళు పోతాయిరా' అని ఎందుకంటారో? మరి ఒక కన్నే ఎందుకుపోయింది, రెండూ పోవచ్చుగా? దానికి సమాధానం ముందు ముందు దొరుకుతుంది.

ఓ సారి బలి చక్రవర్తి కార్య దక్షత గురించి చెప్పుకుందాం. దీని గురించి కాకలు తీరిన పెద్ద పెద్ద ఆచార్యులు విశ్వవిద్యాలయాల్లో పాఠాలు చెప్తూ ఉంటారు. నిజమైన కార్య నిర్వాహకుడికి ఎటువంటి లక్షణాలు ఉండాలి అనేవి. ఓ సారి బలికి అన్వయించుకుని చూడొచ్చు వీటిని అన్నింటినీ.

మొదటగా చెప్పుకోవాల్సినది చేసే పనిలో నమ్మకం; ధృఢ నిర్ణయం తీసుకోగలగడం; చేసే పని మంచా చెడా అనేది బాగా తెలిసి ఉండడం. రెండోది, అవతలి వాళ్ళు ఎవరైనా చెప్పినది సరిగ్గా విని గ్రహించడం; ఆ తర్వాత నిర్ణయం మాత్రం తనే స్వంతంగా తీసుకోవడం; అంటే చెప్పుడు మాటలు విని మనసు మార్చుకోకూడదన్నమాట. మూడు, అబద్ధాలు కానీ పనికిరాని విషయాలు కానీ మాట్లాడకపోవడం, ఇచ్చిన మాటకి కట్టుబడి ఉండడం. నాలుగు, కుల గురువంతటి వాడైనా – అంటే తన మీది ఎంతటి పెద్ద అధికారి అయినా సరే – చెప్పినది మంచిది కాకపోతే దాన్ని విసర్జించి వదులుకోవడానికి సిద్ధంగా ఉండటం. అయిదు, ఎవరివేపు అయినా సరే పక్షపాతం చూపించకపోవడం; కులం అనీ, జాతి అనీ, కాకా పట్టేవాడు అని చూడకుండా అందర్నీ సమానంగా చూడడం. ముఖ్యంగా ఎవరేం చెప్పినా స్వంత

నిర్ణయం తీసుకోగలిగే ధృడత్వం, ఆ తీసుకునే నిర్ణయం పరమోత్తమంగా ఉండడం. ఆరు, ఓ సారి నిర్ణయం తీసుకున్నాక మిన్ను విరిగి మీద పడబోతోందని తెలిసినా, నాకున్నవన్నీ పోతాయేమో, నేను నాశనం అయిపోతానేమో అనే ఏడుపు లేకుండా, ప్రశాంతంగా, నిబ్బరంగా ఉండగలగడం. తనకి ఇటువంటి గుణాలున్నాయని బలికి తెలుసు. ఇంకో విచిత్రమైన విషయం ఏమిటంటే అటు శ్రీహరికి కూడా తెలుసు ఎందుకంటే వస్తూనే ఆశీర్వచనంలో "స్వస్తి జగత్త్రయీ భువన శాసన కర్తకు.." అనే పద్యంలో "హాసమాత్ర విధ్వస్త నిలింపభర్తకు, నుదారపదవ్యవహర్తకున్ .." అని జోడించాడు కదా? మరో సారి బలి చక్రవర్తి గురించి ఇవన్నీ ఆలోచించుకుని చూస్తే ఇప్పుడేమనిపిస్తోంది? మంచి కార్య దక్షత ఉన్నవాడేనా? అందుకే ఆయన పేరు భూమిమీద ప్రాణం అనేది ఉన్నవరకూ మారుమోగుతూ ఉంటుందనేది తథ్యం. ఇంతవరకూ జరిగిన కథ మరోసారి వెనక్కి చూసుకుంటే, శ్రీహరి మోసం చేసి త్రిభువనాలు దానం పుచ్చుకున్నాడా, లేకపోతే బలి అన్నీ తెలిసి కూడా సంతోషంగా దానమిచ్చాడా అని అడిగితే ఏం సమాధానం వస్తుంది?

మహాభారతంలో చిన్న కథ చెప్పుకుందాం ఇక్కడ. ధర్మరాజు యుద్ధం ముందు రాజసూయం, అది అయిపోయాక అశ్వమేధం చేసి అనేక దానాలు చేసాట్ట. దానితో నా అంత దానాలు చేసినవాడు ఈ ప్రపంచంలో, ముల్లోకాల్లో ఎవరూ ఉండరు అనే అహం మనసులో మొలకెత్తడం కృష్ణుడికి తెలిసింది. ధర్మరాజుని వెంటబెట్టుకుని సుతలంలో ఉండే బలి చక్రవర్తి దగ్గిరకి తీసుకెళ్ళి పరిచయం చేసాడుట, ఇదిగో ఈయన ఇలా ధర్మరాజు గారు, బాగా దానాలు చేసాడు అని. బలి చక్రవరి చెవులు మూసుకుంటూ, "ఛీ ఎంత పాడు మాట విన్నాను ఈ రోజు, దానాలు చేయడం కూడా ఒక గొప్పేనా? మా రాజ్యంలో దానం ఇస్తానంటే పుచ్చుకోవడానికెవరూ లేరు, ఇచ్చేవాళ్ళని ఛీత్కారంతో చూస్తారు" అన్నాడుట. అంటే దానం చేసేవాడు గొప్పవాడు కాదు. ఆయన పుచ్చుకునేవాడికి ఎప్పుడో ఋణపడి ఉన్నాడు. దానం ఇవ్వడం వల్ల గర్వం వస్తే అది ఇచ్చేవాడికే అనర్ధం. అదీ ఇచ్చేవాడికి ఉండాల్సిన మనఃస్థితి. ఇది స్వామి వివేకానంద చెప్పినదానితో సరిపోతోంది కదా?

దానం అనే పదం వదిలేసి బలి చక్రవర్తి చిన్న కుర్రాడు అడిగినది, "ఏదో చిన్న కుర్రాడు అడుగుతున్నాడు, ఇవ్వాలి" అనుకుని మనఃస్ఫూర్తిగా, సంతోషంగా ఇచ్చాడు అనుకుందాం. అది తీసుకున్నవాడికి మంచిదా? ఇచ్చినవాడికి మంచిదా? దీనికి కంచి పరమాచార్య చంద్రశేఖర సరస్వతి స్వామి గారి వివరణ చూడండి. "ధార్మిక క్రతువులు, పరమేశ్వరునికి పూజ, తోటి మానవులకు చేసే సేవ అనేవి వేరే ఎవరికో చేసినట్టు అనిపిస్తాయి. నిజానికి అవి మనకోసం. ఇతరులకు సాయపడి, ఈశ్వరుణ్ణి పూజించి ప్రతిఫలంగా పూర్ణత్వాన్ని పొందుతున్నాం. మనం చేసే సహాయం వల్ల ఇతరులు లబ్ది పొందవచ్చు పొందకపోవచ్చు కానీ మనం లోపల మనసులో శాంతి, ఆనందం పొందుతున్నాం. అందువల్ల పరోపకారమని ఏది చెప్పబడుతోందో అది తనకు తాను చేసుకునే ఉపకారమే."

ఇదంతా చూస్తే ఏమనిపిస్తోంది? బలి ఆత్మ సాక్షాత్కారానికి అర్హుడైనవాడేనా? శ్రీహరి ఇటువంటివాడి దగ్గిర దానం పుచ్చుకోకపోతే ఇంకెవరి దగ్గిర పుచ్చుకుంటాడు? దానం తీసుకున్నది భగవంతుడే ఐతే బలి చక్రవర్తి బతుకు ఏమైపోతుంది? శుక్రాచార్యులు చెప్పినట్టూ పదవి పోయి అధోగతి పాలు అవుతాడా? ఇటువంటి దానం మనఃస్ఫూర్తిగా ఇచ్చిన బలిని మహావిష్ణువు అలా కర్మకి వదిలేస్తాడా? అది త్వరలోనే తెలుస్తుంది మనకి.

## త్రివిక్రమ విజృంభణ; వామనావతారం – 13

వామనుడు అడిగినది ఇచ్చేసాడు కదా బలి చక్రవర్తి, ఇచ్చేది కూడా ఎలా ఇచ్చాడు? "*సత్య పదవీ ప్రమాణ తత్పరుండును, వితరణ కుతూహల సత్త్వరుండును, విమల యశస్కుండును, దృఢ మనస్కుండును, నియతసత్యసంధుండును, నర్థిజన కమలబంధుండును*" అయ్యి ఇచ్చాడు. ఇప్పుడు బలి చేతిలో నీళ్ళు శ్రీహరి చేతులో పడాలి అప్పటి వరకూ దానం పూర్తైనట్టుకాదు.

మ. అమరారాతి కరాక్షతోజ్ఝిత పవిత్రాంభః కణశ్రేణికిం
గమలాధీశ్వరుఁ డొడ్డె ఖండిత దివౌకస్స్వామిజిన్మస్తముం
గమలాకర్షణ సుప్రశస్తము రమాకాంతాకుచోపాస్తమున్
విమలశ్రీ కుచశాత చూచుక తటీవిన్యస్తమున్ హస్తమున్. [8-611]

దేవతల శతృవైన బలి (అమరారాతి) చేతిలోని పవిత్రమైన అక్షతలూ నీళ్లూ శ్రీహరి కిందచేయి పెట్టి స్వీకరించాడు. ఆ స్వీకరించే చేయి ఎటువంటిది? రాక్షసుల శిరస్సులు ఖండించేది, లక్ష్మీ దేవిని ఆకర్షించేది. ఇక్కడ పోతన బలి చేతిలోంచి వచ్చే నీటిని "*పవిత్రాంభః కణశ్రేణికిన్*" అన్నాడు చూసారా? ఎందుకంటే, మొదట్లో శ్రీహరి కాళ్ళు కడిగి నెత్తిమిద జల్లుకున్నాడు, మనసులోకి కల్మషం రాకుండా దానం ఇస్తానని చెప్పాడమే కాదు ఇచ్చాడు కూడా. మరి ఇంత చేసాక మనసూ, శరీరం పవిత్రం అయ్యాయి కదా? అందుకే ఆ ప్రయోగం.

క. మునిజన నియమాధారను
జనితాసుర యువతి నేత్రజలకణ ధారన్
దనుజేంద్ర నిరాధారను
వనజాక్షుఁడు గొనియె బలివివర్జితధారన్. [8-612]

ఇప్పుడు దానం చేయడానికి బలి విడిచిపెట్టిన ఆ నీటి ధార ఎటువంటిది? ఆ ధార మునిజనులని శాసించేది. రాక్షస యువతుల కన్నీటి ధార, బలి చక్రవర్తి నిరాధారుణ్ణి చేసేది. ధార అనే పదాన్ని పోతన ఎంత చమత్కారంగా చెప్పాడో గమనించారా? ఈ దానంతో రాక్షసుల ఆస్తులూ, ప్రాణాలూ అన్నీ దానం ఇచ్చేసాడు కాబట్టి రాక్షస యువతులు ఏడుస్తారు కదా? అందుకే "*జనితాసుర యువతి నేత్ర జలకణ ధారన్*" అనడం. రాజ్యం పోయాక మరి బలి చక్రవర్తికి ఏమీ ఉండదు కదా? అందుకే ఆయన నిరాధారుడు.

ఆ. కమలనాభు నెఱిఁగి కాలంబు దేశంబు
నెఱిఁగి శుక్రు మాట లెఱిగి నాశ
మెఱిఁగి పాత్ర మనుచు నిచ్చె దానము బలి
మహి వదాన్యుఁ డొరుఁడు మఱియుఁ గలఁడె. [8-613]

మరి ఇటువంటి దానం చేసిన బలి ఎలాంటివాడో? వచ్చినవాడు విష్ణువే అని తెలుసుకున్నాడు, ఆచమనం చేసినప్పుడూ, యజ్ఞం చేస్తున్నప్పుడూ దేశ కాలాలు చూసుకున్నాడు, ఇచ్చేది పరమ సాత్విక దానం అని కూడా తెలిసింది. కుల గురువు శుక్రాచార్యులు చెప్పినదీ గ్రహించాడు. తనకి రాజ్యం పోతుందనీ, సర్వనాశనం అవుతుందనీ తెలిసింది కూడా. అయినా సరే మాట తప్పకుండా దానం ఇచ్చాడు. ఇటువంటివాడు మరొకరు ఎవరున్నారు?

క. బలి చేసిన దానమునకు
నళినాక్షుఁడు నిఖిలభూత నాయకుఁ డగుటం
గలకల మని దశదిక్కులు
బళిబళి యని పొగడె భూతపంచక మనఘా! [8-614]

విష్ణువు సర్వానికీ అధిపతి కదా, అందువల్ల ఈ దానం తీసుకోగానే దిక్కులన్నీ భళి భళి అని పొగిడాయి. ఈ పొగడ్త ఎవరికి? బలి చక్రవర్తికి. ఎందుకంటే అటువంటి దానం చేసే మరొకడు నభూతో నభవిష్యతి అని తెలుస్తోంది కదా?

క.	క్ష్మితి దానమిచ్చు నతఁడును
నతికాంక్షఁ బరిగ్రహించు నతఁడును దురిత
చ్యుతులై శతవత్సరములు
శతమఖ లోకమునఁ గ్రీడ సలుపుదు రెలమిన్.	[8-615]

వ. అట్లుగావున నే దానంబును భూదానంబునకు సదృశంబు గానేరదు; గావున వసుంధరా దానం బిచ్చితి; వుభయలోకంబులం గీర్తి సుకృతంబులు పడయు మని పలికి యమ్మాయావటుం డిట్లనియె.	[8-616]

ఇప్పుడు వామనుడు బలి చక్రవర్తితో చెప్తున్నాడు మరోసారి – భూదానం ఇచ్చినవాడూ, అది ప్రీతితో తీసుకున్నవాడూ కూడా పాపాలు నశించి స్వర్గానికి చేరుతారు. అందువల్ల ఏ దానమూ కూడా భూదానం తో సమానం కాదు. ఇలా ఇచ్చినందుకు నీకు ఇహ పరలోకాలు రెండిటిలోనూ కీర్తి కలుగుతుంది.

క.	ఇది యేమి వేఁడితని నీ
మది వగవక ధారపోయుమా; సత్యము పెం
పొదవఁగ గోరిన యర్థం
బిది యిచ్చుట ముజ్జగంబు లిచ్చుట మాకున్.	[8-617]

చివరిగా మరోసారి గుర్తు చేస్తున్నాడు వామనుడు బలికి – ఇదేమిటి మూడడుగులు అడిగేడు విచిత్రంగా అనుకోకుండా ధార విడిచిపెట్టు. సత్యం పెంపొందడానికి అలా అడగవలసి వచ్చింది. ఇలా ఇచ్చిన మూడడుగులూ నాకు ముల్లోకాలతో సమానం సుమా. అంటే దానవోద్రేక స్థంభన కోసం అన్నమాట.

వ. అని పలికిన వటుని పలుకులకు హర్ష నిర్భర చేతస్కుండై వైరోచ నుండు.	[8-618]

ఆ. పుట్టి నేర్చుకొనెనొ పుట్టక నేర్చెనో
చిట్టి బుద్ధు లిట్టి పొట్టివడుగు
పొట్ట నున్న వెల్ల బూమెలు నని నవ్వి
యెలమి ధరణి దాన మిచ్చె నపుడు. [8-619]

ఇలా వటుడు అనేసరికి బలికి మనసు సంతోషంతో నిండిపోయింది (*హర్ష నిర్భర చేతస్కుండై*). ఈ కుర్రవాడికి అయిదేళ్ళు లేవు గానీ ఎంత మాటలు మాటాడుతున్నాడు? ఇవన్నీ పుట్టాక నేర్చున్నాడా లేకపోతే పుట్టక ముందే వచ్చాయా అనుకుంటూ సంతోషంగా దానం ఇవ్వడం పూర్తిచేసాడు.

ఆ. గ్రహ మునీంద్ర సిద్ధ గంధర్వ కిన్నర
యక్ష పక్షిదేవతాహి పతులు
పొగడి రతని పెంపుఁ; బుష్పవర్షంబులు
గురిసె దేవతూర్యకోటి మొరసె. [8-620]

ఇటువంటి ఔదార్యం ఉన్న బలి చక్రవర్తిని అతని గొప్పదనాన్ని గ్రహాలూ, మునీశ్వరులూ. సిద్ధులూ, గంధర్వులూ, కిన్నరులూ, యక్షులూ, గరుడులూ, దేవతలూ, సర్పరాజులూ, పొగిడారు. పుష్పవర్షం కురిసి దేవదుంధుభులు మోగాయి. ఇదంతా ఎందుకంటే, ఇస్తానని ఎవరికోసమో చెప్పకుండా, మనఃస్ఫూర్తిగా ఇవ్వడం వల్లా, మాట తప్పకపోవడం వల్లా, వచ్చినవాడు ఇంతటివాడని తెలిసినా ఇవ్వడం తన ధర్మం అనుకుంటూ ఇచ్చాడు కనకాను. మన్సులో ఎప్పుడైతే కల్మషం పూర్తిగా పోయిందో ఏమౌతుంది? సంతోషంతో నిండిపోదూ?

వ. ఇట్లు ధారా పరిగ్రహంబు చేసి. [8-621]

శా. ఇంతింతై, వటుఁడింతయై మఱియుఁ దా నింతై నభోవీథిపై
నంతై తోయదమండలాగ్రమున కల్లంతై ప్రభారాశిపై
నంతై చంద్రుని కంతయై ధ్రువునిపై నంతై మహర్వాటిపై
నంతై సత్యపదోన్నతుం డగుచు బ్రహ్మాండాంత సంవర్ధియై. [8-622]

ఇప్పుడు మూడు అడుగులు కొలిచే ఆక్రమించే సమయం వచ్చింది. ఇంతటి వామనుడు అంతవాడూ, అంతవాడు మరింతవాడూ అవుతూ ఎదగడం మొదలుపెట్టాడు. అలా ఎదుగుతూ ఆకాశం, గ్రహాలు, నక్షత్రమండలాలు, ధ్రువుణ్ణీ, మహర్లోకం దాటి సత్యలోకం దాకా ఆక్రమించుకుంటూ పెరుగుతున్నాడు. అలా ఎదగడం బ్రహ్మాండం అంతా పట్టడానికా అన్నట్టు ఎదిగాడు. దేనికీ? పైలోకాలన్నీ ఒక్క పాదంతో ఆక్రమించడానికి. ఈ పద్యం కూడా "*ఎవ్వనిచే జనించు జగమెవ్వని లోపలనుండు లీనమై*" అనే గజేంద్రమోక్షం పద్యం లాంటిదే. ఇది తెలియని తెలుగువాడు ఉన్నాడంటే నమ్మడం కష్టం.

ఈ వామన విజృంభణని మరో విధంగా చెప్పుకోవాలంటే, నీకు సర్వనాశనం జరగబోతోంది అన్నాసరే దానం ఇచ్చి తీరుతాను అనడమే కాకుండా ఇచ్చి మాట నిలబెట్టుకున్న బలి చక్రవర్తి తన వ్యక్తిత్వంతో అసాధారణంగా ఎవరికీ అందలేనంత ఎత్తుకి ఎదిగిపోయాడు కదా? మరి అలా ఎదిగిపోయిన బలి చక్రవర్తి దగ్గిర్నుంచి దానం తీసుకోవడానికి వామనుడు కూడా అనంతంగా పెరిగాడన్న మాట.

మ. రవిబింబం బుపమింపఁ బాత్రమగు ఛత్రంబై శిరోరత్నమై
శ్రవణాలంకృతియై గళాభరణమై సౌవర్ణకేయూరమై
ఛవిమత్కంకణమై కటిస్థలి నుదంచద్ఘంటయై నూపుర
ప్రవరంబై పదపీఠమై వటుఁడు దా బ్రహ్మాండమున్ నిండుచోన్. [8-623]

ఆయన అలా ఎదుగుతూంటే భూమ్మీద ఉన్న బలి చక్రవర్తీ, అనుచరులూ చూస్తున్నారు. అలా పెరిగే వామనుడు బలి చక్రవర్తికి ఎలా కనిపించాడు? తన ముందు దృశ్యంలో ఉన్న వామనుడు అలా ఎదుగుతుంటే తలెత్తి పైపైకి చూడాలి కదా, అప్పుడు వెనక దృశ్యంలో ఉన్న వారు కురచగా తగ్గినట్టు కనిపించడాన్ని చెప్తున్నాడు ఈ పద్యంలో. వామనుడలా ఎదుగుతూంటే వెనకనున్న ఆకాశంలో సూర్యుడు మొదట్లో వామనుడికి గొడుగులాగా కనిపించాడు, తర్వాత తలమీద మణిలాగా, కంఠాభరణంలా, బంగారు భుజకీర్తులులా, కంకణంలా, మొలలోని గంటలా, కాలి అందెలా, చివరికి పాదపీఠంలాగా అయ్యేడు. ఇదో అద్భుతమైన ఉపమానం వామనుడి విజృంభణ ఎలా ఉందో పోల్చడానికి. ఓ సారి కళ్ళు

మూసుకుని విజృంభిస్తూన్న శ్రీహరినీ అయనకి గొడుగులా ఉన్న సూర్యుడు పాదపీఠంలా మారడాన్నీ ఊహించడానికి ప్రయత్నం చేస్తే మనకి అర్థం అవుతుంది.

పై రెండు పద్యాలూ పోతన కవితా పటిమని చెప్తే దీని తర్వాత వచ్చే వచనం పోతన కవితా ప్రభంజనంలో అక్షయతూణీరమంటే ఏమిటో, పలికించెడు వాడు రామభద్రుడట అంటే ఏమిటో చెప్తుంది. ఇది దాదాపు భగవద్గీతలోని విశ్వరూప సందర్శన విభాగం లాంటిదే. ఏదో మొహమాటానికి పుస్తకం చదువుతున్నట్టు కాక ఒక్కో పదానికీ అర్థం వెతుకుతూ చదవడానికి ప్రయత్నం చేయండి.

వ. ఇట్లు విష్ణుండు గుణత్రయాత్మకంబగు విశ్వరూపంబు ధరియించి భువియును, నభంబును, దివంబును, దిశలును, దిశాఛిద్రంబులును, సముద్రంబులునుఁ, జలదచల భూతనివహంబులుం దానయై యేకీభవించి, క్రమక్రమంబున భూలోకంబునకుం బొడవై భువర్లో కంబు నతిక్రమించి, సువర్లోకంబును దలకడచి, మహర్లోకంబు దాఁటి, జనలోకంబునకు మీఁదై, తపంబునకు నుచ్ఛ్రితుండై, సత్యలోకంబు కంటె నౌన్నత్యంబు వహించి, యెడ లిఱుములు సందులు రంధ్ర ములు లేకుండ నిండి, మహాదేహ మహితుండై చరణతలంబున రసాతలంబునుఁ, బాదంబుల మహియును, జంఘల మహీధ్రంబులును, జానువులఁ బతత్త్రిసముదయంబులును, నూరువుల నింద్రసేన మరుద్గణంబులును, వాసస్థ్సలంబున సంధ్యయు, గుహ్యంబునఁ బ్రజాపతులును, జఘనంబున దనుజులును, నాభిని నభంబును, నుదరంబున నుదధిసప్తకంబును, నురంబున దారకానికరంబును, హృదయంబున ధర్మంబును, నురోజంబుల ఋతసత్యంబులును, మనంబునఁ జంద్రుండును, వక్షంబున గమలహస్త యగు లక్ష్మియుఁ, గంఠంబున సామాది సమస్త వేదంబులును, భుజంబులఁ బురంద రాది దేవతలునుఁ, గర్ణంబుల దిశలును, శిరంబున నాకంబును, శిరోజంబుల మేఘంబులును, నాసాపుటంబున వాయువును, నయనంబుల సూర్యుండును, వదనంబున వహ్నియు, వాణినఖిలచ్ఛంద స్సముదయంబును, రసనంబున జలేశుండును, భ్రూయుగళంబున విధినిషేధంబులును, ఱెప్పల నహోరాత్రంబులును, లలాటంబునఁ గోపంబును, నధరంబున లోభంబును, స్పర్శంబునఁ గామం బును, రేతంబున జలంబును, బృష్ఠంబున నధర్మంబును, గ్రమణంబుల యజ్ఞంబులును, ఛాయల మృత్యువును, నగవులవలన ననేక మాయావిశేషంబులును, రోమంబుల నోషధులును, నాడీప్రదేశంబుల నదులును, నఖంబుల శిలలును, బుద్ధి నజుండును, బ్రాణంబుల దేవర్షిగణంబులును, గాత్రంబున జంగమ స్థావర జంతు సంఘంబులును గలవాఁడయి, జలధరనినద శంఖ శార్ఙ్ఞ సుదర్శన గదాదండ ఖడ్గాక్షయ బాణతూణీర విభ్రాజితుండును, మకరకుండల కిరీట కేయూర హార కటక కంకణ

కౌస్తుభ మణి మేఖలాంబర వనమాలికా విరాజితుండును, సునంద నంద జయ విజయ ప్రముఖ పరిచర వాహినీ సందోహ పరివృతుండును, నమేయ తేజోవిరాజితుండును, నై బ్రహ్మాండంబు దన మేనికప్పు తెఱంగున నుండ విజృంభించి.

[8-624]

భగవంతుడంటే ఎవరు? సత్వ రజస్తమోగుణాలకి అతీతుడు కదా? మరి అటువంటివాడు ఈ త్రిగుణాలతో ఉన్న ప్రపంచాన్ని ఆక్రమించడం ఎలా? ఆయన త్రిగుణాతీతుడైనా కావాల్సి వచ్చినప్పుడు ఈ గుణాలతో విశ్వరూపం ధరించగలడు. అంటే ఈ కంటికి కనబడే విశ్వం, ఆ భగవంతుడూ ఎప్పుడూ వేరుగా లేరు. దీన్నే మంత్రపుష్పం *'యచ్ఛకించిత్ జగత్సర్వం దృశ్యతే శ్రూయతే పివా, అంతర్బహిశ్చ తత్సర్వం వ్యాప్య నారాయణ స్థితః'* అంటోంది. ఇప్పుడు ఆ మూడు గుణాలూ ఆపాదించుకుని (*గుణత్రయాత్మకంబగు విశ్వరూపంబు ధరియించి*), అలా ఒక్కొక్క లోకాన్నీ దాటుకుంటూ పెరగడం మొదలుపెట్టాడు. భూమి, ఆకాశమూ, స్వర్గమూ, దిక్కులూ, దిక్కుల మధ్య ప్రదేశాలూ (*దిశాఛ్ఛిద్రంబులు*), సముద్రాలూ, చరాచర సమస్త ప్రాణులూ తానే అవుతూ భువర్లోకమూ, సువర్లోకమూ, మహర్లోకమూ, జనోలోకమూ, తపోలోకమూ, దాటి సత్యలోకం కంటే ఎత్తుగా ఎదిగిపోయాడు.

మామూలుగా ఎదగడం కాదు – *యెడ లిఱుములు సందులు రంధ్ర ములు లేకుండ నిండి* – అంటే మొదట్లో చెప్పుకున్న పద్యం ప్రకారం "*హరిమయము విశ్వమంతయు, హరి విశ్వమయుండు .... హరి మయము కాని పరమాణువులేదు*" అన్నట్టూ. ఓ సారి వెనక్కి చూసుకుంటే మొదట్లో బలి రాక్షసుడు. దానాలు ఇస్తూ రాక్షసత్వం పోగొట్టూకుంటే ఈ దశకి చేరాడు. ఇప్పుడు తన ఎదుట కనిపించినది ఆత్మ సాక్షాత్కారం. తనలో ఎప్పుడైతే ఆత్మని చూసాడో అప్పుడు బయటనున్న పర–ఆత్మ – పరమాత్మని – చూడ్డానికి అర్హుడయ్యేడు. ఇప్పుడు తన ఎదురుగా యెడ లిఱుములు సందులు రంధ్రములు లేకుండా ఉన్నదేమిటి అంటే తాను దర్శించిన పరబ్రహ్మ స్వరూపమే.

ఇలా విజృంభించిన శ్రీహరి విశ్వరూపంలో బలికి ఇంకా ఏమి కనిపించింది? పాదాల అడుగు భాగంలో రసాతలం, పాదాలలో భూమి, పిక్కలలో పర్వతాలు, మోకాళ్ళలో పక్షులు, తొడలలో దేవతలు, వస్త్రంలో సంధ్యాకాలం, రహస్యాంగంలో ప్రజాపతులు, పిరుదులలో రాక్షసులు, నాభిలో ఆకాశం, కడుపులో సప్తసముద్రాలు, వక్షంలో నక్షత్రసమూహం, హృదయంలో ధర్మం, స్తనద్వయంలో ఋత సత్యాలు, మనస్సులో చంద్రుడు (మనసులో కల్మషం లేకపోతే స్వచ్ఛంగా ఉంటుంది కదా?), ఎదలో లక్ష్మి దేవి, కంఠంలో వేదాలు, భుజాలలో ఇంద్రాదులైన దేవతలు,

చెవులలో దిక్కులు (అన్ని దిశలనుంచీ వచ్చే శబ్దాలు వినడానికి), తలలో స్వర్గలోకం, తలవెంట్రుకలలో మేఘాలు, ముక్కుపుటాలలో వాయువు, కన్నులలో సూర్యుడు, ముఖంలో అగ్ని, వాక్కులో సమస్త చందస్సు, నాలుకలో వరుణుడు, కనుబొమ్మలలో కార్యాకార్యాలు, రెప్పలలో రేయింబవళ్ళు, ఫాలభాగంలో కోపం, క్రింది పెదవిలో లోభం, స్పర్శలో కామం, రేతస్సులో జలం, వీపులో అధర్మం, అడుగులలో యజ్ఞం, నీడలో మరణం, నవ్వులో మాయావిశేషాలు, రోమాలలో సస్యాలు, నరాలలో నదులు, గోళ్ళలో రాళ్ళు (అటువంటి గోళ్ళతోనే కదా హిరణ్యకశిపుణ్ణి చంపినది), బుద్ధిలో బ్రహ్మ, ప్రాణాలలో దేవర్షిగణాలు, శరీరంలో చరాచర సకలప్రాణులూ కలిపి ఒక్క చోట విశ్వరూపంతో కనిపించాడు.

గమనించవల్సింది ఏమిటంటే – "సర్వం పరబ్రహ్మ స్వరూపం" అనే మాటలో చావు, అధర్మం, రాక్షసులూ, కామం (కోరికలు), అనేటువంటి చెడువీ, వేదాలు, దేవతలు, స్వర్గలోకం అనే మంచివీ కూడా భగవంతుడే. ఇంకో విధంగా కూడా అర్ధంచేసుకోవచ్చు ఈ వచనాన్ని. చెవులతో దేన్ని వింటాం? అన్ని దిశలనుంచీ వచ్చే శబ్దాలని కదా? అందుకే "*కర్ణంబుల దిశలను*"; అలాగే వెన్ను మీద పొడిచారంటే అర్ధం అధర్మంగా ఏదో చేశారని కదా? అందుకే "*పృష్టంబు నధర్మంబు.*" కోపం వస్తే కనబడేది నుదిటిమీదే కనక "*లలాటంబున కోపంబును.*" ఇదే విధంగా "*ఛాయల మృత్యువు, నధరంబున లోభంబును, స్పర్శంబునఁ గామంబును, రేతంబున జలంబును, బృష్ఠంబున నధర్మంబును, గ్రమణంబుల యజ్ఞంబులును, ఛాయల మృత్యువును, నగవులవలన ననేక మాయావిశేషంబులును, రోమంబుల నోషధులును, నాడీప్రదేశంబుల నదులును, నఖంబుల శిలలును, బుద్ధి నజుండును, బ్రాణంబుల దేవర్షిగణంబులును, గాత్రంబున జంగమ స్థావర జంతు సంఘంబులును.*" ఓ సారి నృసింహావతారంలో శ్రీహరి స్థంభంలోంచి బయటకొచ్చిన వచనం చూస్తే దాదాపు ఇటువంటి వర్ణనే పాదాలనుంచి తలదాకా స్తోత్రం చేస్తున్నట్టూ గమనించవచ్చు. కొంచెం భాష తేడా తప్ప మిగతా వన్నీ దాదాపుగా ఒకటే.

అలా పెరిగిన విష్ణువు – *జలధరనినద శంఖ (జలానికి ఆధారమైంది మేఘం. అదే చేసే నినాదం అంటే ఉరుము వంటి శబ్దం చేసే పాంచజన్యమనే శంఖం), శార్ఙ, సుదర్శన గదాదండ ఖడ్గాక్షయ బాణతూణీర విభ్రాజితుండు* అయ్యి విజృంభించాడు. మొదట నుంచీ చెప్పుకుంటున్నట్టూ పోతన ఎప్పుడూ కూడా మొత్తం భాగవతంలో విష్ణువుని వర్ణించడానికి వాడే భాష ఇదే – *మకరకుండల కిరీట కేయూర హార కటక కంకణ కౌస్తుభమణి మేఖలాంబర వనమాలికా విరాజితుండును.* కూడా వచ్చిన భట సమూహంలో ఎవరున్నారు? – "*సునంద నంద జయ విజయ ప్రముఖ పరిచర వాహినీ సందోహ పరివృతుండును.*" ఇలా ఎదిగిన మునపటి పొట్టి వామనుడిప్పుడు "*అమేయ తేజోవిరాజితుండును, నై*

*బ్రహ్మాండంబు దన మేనికప్పు తెఱంగున నుండ"* విజృంభించాడు." అంటే పరమాద్భుతమైన తేజస్సుతో ఉన్న వామనుడికి మొత్తం బ్రహ్మాడం అంతా మేలి ముసుగుగా ఒప్పుతోంది.

మ. ఒక పాదంబున భూమి గప్పి దివి వే ఱొంటన్ నిరోధించి యొం
డొకటన్ మీఁది జగంబు లెల్లఁ దొడి, నొండొంటిన్ విలంఘించి. ప
ట్టక బ్రహ్మాండకటాహముం బెటిలి వేంద్రంబై పరుల్ గానరా
కొకఁడై వాగ్దృగలభ్యుఁడై హరి విభుం డొప్పారె విశ్వాకృతిన్. [8-625]

విశ్వరూపాన్ని ధరించిన త్రివిక్రముడు ఒక అడుగులో భూలోకాన్ని, ఇంకొక అడుగుతో స్వర్గలోకాన్ని, మరియొక అడుగుతో పైలోకాలనూ కప్పివేసాడు. ఆ విశ్వ రూపం పట్టకపోవడం వలన బ్రహ్మాండభాండం పెటపెటలాడి బ్రద్దలైపోతూ (అంటే నామరూపాలనేవి పోయి సర్వం విష్ణుమయం జగత్ అనేది బలి మహారాజుకి అర్థమౌతూంది) ఆయన తప్ప ఇంకెవరూ కనిపించకుండా ఆ విశ్వరూపుడు మాటలకీ, చూపులకీ అందకుండా పోయాడు.

నాకు కవిత్వం వచ్చు నేనూ రాయగలను అనుకుంటూ రాయడం వేరూ, రాసేది రాముడికోసం అనుకుంటూ పూర్ణ శరణాతితో రాయడం వేరూ. పై మూడు పద్యాలు, వచనం చాలు పోతన ఎటువంటి శరణాగతితో రాశాడో చెప్పడానికి. ఇటువంటి భాష రాసేటప్పుడు పోతన మనఃస్థితి ఓ సారి ఊహించుకుంటే కళ్ళముందు విశ్వరూపం చూస్తూ రాసాడనిపించడం సహజం.

రామకృష్ణ పరమహంస ఆత్మ సందర్శనం గురించి చెప్పేటప్పుడు అంటారు – "ఆత్మ అనేది వాక్కుకీ మనసుకీ అందేది కాదు. ఓ సారి ఆత్మదర్శనం అయ్యేక మనసు అనేది ఉండదు, అది ఆత్మలో లీనమవడమే జరుగుతుంది." ఈ ఆత్మ ఎప్పుడూ ఉన్నదే కానీ మనకున్న మనఃస్థితిలో మనం దాన్ని చూడలేకపోతున్నాం. ఎప్పుడైతే బలి అంతటి స్థితికి – అది, దాన, యజ్ఞ, తపస్సులతోపాటు, ఏ విధంగానైనా సరే – చేరగలమో అప్పుడు అసలు అన్నింటికీ మూలంగా ఉన్నది మనకి విశదం అవుతుంది. సరిగ్గా మొదట్లోనే శుకమహర్షి పరీక్షిత్తుకి చెప్పినది. అదే శివానందులు చెప్పినదీ, మంత్రపుష్పంలో చెప్పబడినదీను.

*నారాయణ మహాజ్ఞేయం విశ్వాత్మానం పరాయణం*
*నారాయణ పరో జ్యోతిరాత్మా నారాయణ పరః*
*నారాయణం పరం బ్రహ్మ తత్వం నారాయణ పరః*
*నారాయణ పరో ధ్యాతా ధ్యానం నారాయణః పరః*

చివరి పాదం గమనించారా? ధ్యానం చేసేవాడూ, ధ్యాతా – అంటే దేని గురించి ధ్యానం చేస్తున్నామో – ఆ ఇద్దరూ కూడా పరబ్రహ్మ స్వరూపులే. అందుకే

క. హరిమయము విశ్వమంతయు
హరి విశ్వమయుండు సంశయము పనిలేదా
హరిమయముగాని ద్రవ్యము
పరమాణువు లేదు వంశపావన వింటే [2-17]

## త్రివిక్రమ విజృంభణ; వామనావతారం – 14

ఒక పాదంతో పై లోకాలన్నీ ఆక్రమించాడు వామనుడు. మరో పాదంతో కింది లోకాలనీ ఆక్రమించాడు. త్రివిక్రమ స్ఫురణం ఎలా ఉంది అప్పుడు? విజృంభణలో భూమీ ఆకాశం, పైలోకాలు ఎలా కనిపిస్తున్నాయి

ఆ. ఒక పదంబు క్రింద నుర్వి పద్మము నంటి
కొన్న పంకలవము కొమరుఁ దాల్చె;
నొకటి మీఁదఁ దమ్మి కొదిఁగిన తేఁటినా
వెలసె మిన్ను నృప! త్రివిక్రమమున. [8-626]

ఒక పాదం కింద ఉన్న భూమండలం పద్మానికి అంటుకున్న బురదలా (క్రింద నుర్వి పద్మము నంటి) ఉంది. రెండో పైలోకాలకి సాగిన పాదం ఆకాశమనే పద్మం మీద వాలిన తుమ్మెదలా ఉంది (నొకటి మీఁదఁ దమ్మి కొదిఁగిన తేఁటినా వెలసె మిన్ను). అంటే పైలోకాలూ, భూమండలం కూడా ఆ పాదాల రేణువులగా ఒప్పుతున్నాయి.

ఆ. జగము లెల్ల దాఁటి చనిన త్రివిక్రము
చరణనఖర చంద్ర చంద్రికలను
బొనుఁగు పడియె సత్యమున బ్రహ్మతేజంబు
దివసకరుని రుచుల దివియ బోలె. [8-628]

అలా పైనా కిందా అన్నిలోకాలనూ దాటిపోయిన త్రివిక్రముని కాలిగోళ్ళకాంతికి సత్యలోకం లోని బ్రహ్మ తేజస్సు సూర్యుని ముందు దివిటీ వలె వెలవెల పోయింది.

సీ. భవబంధములఁ బాసి బ్రహ్మలోకంబునఁ;
గాపురంబులు చేయు ఘనులు రాజు
లా మరీచ్యాదులు, నా సనందాదులు;
నా దివ్యయోగీంద్రు లచట నెపుడు
మూర్తిమంతంబులై మ్రోయు పురాణ త;
ర్కామ్నాయ నియమేతిహాస ధర్మ
సంహితాదులు గురుజ్ఞానాగ్నినిర్దగ్ధ;
కర్ములై మఱియును గలుగునట్టి [8-629]

తే. వార లెల్లఁ జొచ్చి వచ్చి సర్వాధిపు
నంఘ్రిఁ జూచి మ్రొక్కి రధిక భక్తిఁ
దమ మనంబు లందుఁ దలచు నిధానంబుఁ
గంటి మనుచు నేఁడు మంటి మనుచు. [8-629.1]

ఇలా పైకి పెరిగిన పాదాన్ని అక్కడ లోకాల్లో ఉండే వారు దర్శించారు. భవబంధాలని వదిలించుకుని బ్రహ్మ లోకాన్ని చేరిన ఋషులూ, దేవర్షులూ, ఆకారం ధరించి మారుమోగుతూ ఉండే వేద వేదాంగాలూ, తర్క శాస్త్రం ఇటువంటివన్నీ ఆ పాదాన్ని దర్శించి ఇప్పటికి మేము కావాలనుకున్న పెన్నిధి చూడగలిగాము అని నమస్కారం పెట్టుకున్నారు.

బ్రహ్మలోకం చేరినవారు కూడా – బ్రహ్మతో సహా, మరో జన్మ ఎత్తడానికి ఆస్కారం ఉంది. అంటే భగవంతుడికి తప్ప ఎవరికైనా సరే ఆయుర్దాయం అనేది ఉంది. అది కొన్ని ఏళ్ళు కావొచ్చు, యుగాలు కావొచ్చు, మహా యుగాలు కావొచ్చు. అందుకే అక్కడున్న మహర్షులూ దేవర్షులూ కూడా నిత్యం విష్ణువుని దర్శించడానికి ఉవ్విళ్ళూరుతూ ఉంటారు. ఎందుకంటే భగవద్గీతలో చెప్పినట్టూ అది ఉఛ్ఛిష్టమైన ఎన్నటికీ తిరిగిరాని లోకం.

అబ్రహ్మ భువనా ల్లోకాః పునరావర్తినోర్జున,

మా ముపేత్య తు కౌంతేయ పునర్జన్మ నవిద్యతే (అక్షర బ్రహ్మయోగం, భగవద్గీత 8.16)

ఈ విషయం వామనావతారం మొదట్లోనే చెప్పుకున్నాం. యోగ్యులైన వారికి ప్రజాపతి స్థానాలనీ మిగతా అధికారాలనీ ఇచ్చి విష్ణువు ప్రపంచం అలా జరగడానికి కారకుడు అని. దీన్నే "*యోగీశరూపుఁడై యోగంబుఁ జూపుచు... విష్ణుఁ డవ్యయుండు విమలచరిత!*" అని శుకమహర్షి పరీక్షిత్తుతో అన్నాడు కదా? ఆయా పనులు అయిపోగానే ఈ జనం అందరూకూడా మరో మెట్టు పైకి వెళ్ళడానికి్కానీ, మరో జన్మ ఎత్తడానికి్కానీ అవకాశం ఉంది.

మ. తన పుట్టిల్లిదె పొమ్మటంచు నజుఁడుం దన్నాభిపంకేరుహం
బు నిరీక్షించి నటించి యున్నత పదంబుం జూచి తత్పాదసే
చనముం జేసెఁ గమండలూదకములం జల్లించి; తత్తోయముల్
వినువీథిం బ్రవహించె దేవనదినా విశ్వాత్ముకీర్తిప్రభన్. [8-630]

బ్రహ్మ కూర్చునేది విష్ణువు నాభి కమలం అని కదా మనకి తెలిసినది. ఆ నాభి కమలం చూసి నా పుట్టిల్లు ఇదే అనీ, ఈ బ్రహ్మలోకం వరకూ సాగిన పాదాన్ని బ్రహ్మ చూసి దాన్ని తన కండలంలో నీటితో కడిగాడు. ఆ నీటి ధార ఆకాశంలో దేవనదిగా ప్రవహించింది, ఎలా ప్రవహించింది? విశ్వాత్ము కీర్తి ప్రభలతో.

సీ. యోగమార్గంబున నూహించి బహువిధ;
పుష్పదామంబులఁ బూజ చేసి
దివ్యగంధంబులుఁ దెచ్చి సమర్పించి;
ధూపదీపములఁ దోడ్తోడ నిచ్చి
భూరి లాజాక్షతంబులు జల్లి ఫలములుఁ;
గానిక లిచ్చి రాగములఁ బొగడి
శంఖాదిరవములు జయఘోషములుఁ జేసి;
కరుణాంబునిధి! త్రివిక్రమ! యటంచు [8-632]

ఆ.	బ్రహ్మ మొదలు లోకపాలురుఁ గొనియాడి;
రెల్ల దిశల వనచరేశ్వరుండు
జాంబవంతుఁ డరిగి చాటె భేరిధ్వని
వెలయఁ జేసి విష్ణు విజయ మనుచు.	[8-632.1]

లోకాలని పాలించే బ్రహ్మ, మిగతా దేవతలూ విష్ణువు త్రివిక్రం రూపం అంతా నిండిపోవడంతో ఆయనకి పూలతో పూజచేసి స్తోత్రాలు చేసారు. జాంబవంతుడు ఇలా పెరిగిన వామనుడి చుట్టూ ప్రదక్షిణ చేస్తూ ముల్లోకాలలో ఇదంతా చాటి చెప్తున్నాడు భగవన్మహిమ గురించి. ముల్లోకాలలో నిండిపోయినాయనికి ప్రదక్షిణ చేయడం అంటే అన్ని లోకాలూ చుట్టేసినట్టే కదా?

“శత యోజన విస్తీర్ణమైన సాగరం లంఘించి లంకలోకి మొదట ఎవరు వెళ్ళగలరు ముందుకి రండి” అని అంగదుడు అడిగితే ఒక్కొక్కరూ నేను పది యోజనాలు, నేను ఇరవై ... నేను ఎనభై అంటూ అన్నప్పుడు జాంబవంతుడు చెప్తాడు దీని గురించే రామాయణంలో సుందరకాండకు కొంచెం ముందుగా ఈ ప్రదక్షిణం గుర్తు చేసుకుంటూ “ఒకప్పుడు నేను తివిక్రముడికి ప్రదక్షిణం చేసినవాడిని కానీ ఇప్పుడు ముసలితనం వల్ల తొంభై యోజనాల వరకూ దూకగలను” అని.

క.	అన్నిజగంబులఁ దానై
యున్న జగన్నాథుఁ జూడ నొగి భావింపం
గన్నందక మన మందక
సన్నుతులం జేసి రపుడు సభ్యులు బలియున్.	[8-633]

ఇలా సమస్తాన్నీ ఆక్రమించిన విష్ణువుని చూడ్డానికి బలికీ, అక్కడున్న సభ్యులకీ మనసులో ఊహించడానికానీ కంటికి కనిపించడానిక్కానీ సాధ్యం కాలేదు. మనమోసారి ఆలోచిస్తే సర్వ వ్యాపకత్వం అంటే ఇదేనని అర్థమౌతుంది. చూసేదీ, చూడబడేదీ అన్నీ సర్వం విష్ణుమయం జగత్. అలా చూసి తెలుసుకోవల్సిందే తప్ప ఇది ఊహించడానిక్కూడా సాధ్యం కానిది.

దీనినే "పూర్ణమద, పూర్ణమిదం..." అనే ఉపనిషత్ శ్లోకం వివరిస్తోంది. ఈ పూర్ణం అనేది ఎప్పటికీ ఆరనిదీ, స్వచ్ఛమైనదీ అయినటువంటి ఒక మహాగ్ని. ఇప్పుడో చిన్న కర్ర తీసుకెళ్ళి ఆ మహాగ్నిలోంచి చిన్న నిప్పు తీసుకొచ్చామనుకుందాం. ఈ నిప్పు మెల్లిగా రాజుకుని చిన్న మంటలాగా తయారౌతుంది. ఈ చిన్న నిప్పు కూడా ఆ మహాగ్నిలాగే దేనినైనా కాల్చగలదు. మంచి నేయి, అవీ వేస్తే ఈ చిన్న నిప్పు కూడా పెద్దదయ్యి మరో చిన్న చిన్న నిప్పులని తయారు చేయగలదు. పూర్ణమదః (పరబ్రహ్మం, భగవంతుడైన ఆ మహాగ్ని పూర్ణం) పూర్ణమిదం (ఈ చిన్న అగ్ని అయిన ఈ సృష్టిలో సర్వమూ కూడా పూర్ణమే, ఎందుకంటే ఇది మహాగ్నిలోంచి వచ్చినదే), పూర్ణాత్ పూర్ణముదచ్యతే (ఆ బ్రహ్మంలోంచి వచ్చిన 'ఇది' కూడా పూర్ణమే) పూర్ణాస్య (ఆ మహాగ్ని లోంచి తీసేది కూడా పూర్ణం), పూర్ణామాదాయ (ఈ చిన్న అగ్ని పెద్ద మహాగ్నిలో కలిపినా అది పూర్ణమే). ఇప్పుడీ మహాగ్ని భగవంతుడైతే ఈ చిన్న అగ్ని సర్వ చరాచర వస్తువుల్లో ఉండే భగవంతుడి ప్రతిరూపమైన ఆత్మ. అహంకారం, మిగతా దుర్గుణాలూ పోగొట్టుకుంటూ బలిలాగా తయరైనప్పుడు మనం ఆత్మశక్తిని అధికంగా పెంచుకుంటూ ఈ చిన్న అగ్నిని పెద్దదిగా చేస్తున్నాం. దీనినే సాధన (నేయి వేల్చడం) అనడం. ఎప్పుడైతే ఈ చిన్న అగ్ని బాగా మండడం మొదలైందో అప్పుడు మనమే ఆత్మని దర్శించిన వాళ్లమై భగవత్స్వరూపులం అవ్వొచ్చు. అందుకే ఆత్మ సాక్షాత్కారం పొందిన ఋషులని "భగవాన్ రామకృష్ణులకీ, భగవాన్ శివానందులనీ, భగవాన్ రమణులనీ" చెప్పడం.

కొంచెం లోతుగా ఆలోచిస్తే విష్ణువు సమస్తాన్నీ ఎప్పుడాక్రమించాడు? ప్రతీ పరమాణువులోనూ సర్వవేళలా, సర్వకాలాల్లో ఉండే ఆయన ఇప్పుడు కొత్తగా సర్వం ఆక్రమించడమేమిటి? శివానందులు చెప్పినట్టూ... Where can the Brahman move when He is all pervading and infinite? జరిగినదేమిటంటే, బలి చక్రవర్తికి ఆత్మ సాత్కాత్కారమైంది. ఇప్పటివరకూ ఎప్పుడు చూడనిది కనిపించింది. ఆ కనిపించినది ముందూ, తర్వాతా ఎప్పుడు మార్పు లేనటువంటి ఈ భగవత్స్వరూపమే. ఇప్పుడు కొత్తగా వచ్చినదేమీ లేదు – బలి చక్రవర్తి దృష్టిలో మార్పు తప్ప. అంటే ఎప్పుడైతే రాక్షసత్వం పోయిందో అప్పుడు తనలోనూ తనబయటా ఉన్నదీ, సర్వమూ అదే అయినదాన్ని దర్శించాడు. దీన్నే రామకృష్ణులు చెప్పడం ప్రకారం ఉప్పు బొమ్మ సముద్రం లోతు ఎంతో తెలుసుకోవడానికి వెళ్ళడం వంటిది. ఆ ఉప్పు బొమ్మ సముద్రంలోకి వెళ్ళగానే ఏమౌతుంది? అందులో కలిసిపోయి తన అస్థిత్వాన్ని పోగొట్టుకుంటుంది. అందుకే ఆత్మని దర్శించినవాడు ఆత్మ స్వరూపుడే అవుతాడు అని చెప్తారు.

వ. అంత నొయ్యన పూర్వప్రకారంబున వామనాకారంబు వహించి యున్న వామనునిం గని "పదత్రయ వ్యాజంబున నితండు సకల మహీ మండలంబు నాక్రమించె కపటవటురూప తిరోహితుండగు విష్ణుండని యెఱుంగక మన దానవేంద్రుఁడు సత్యసంధుండు గావున మాటఁ దిరుగక యిచ్చె నతని వలన నేరంబు లేదు ఈ కుబ్జుం డప్రతిహత తేజః ప్రభావంబున సజ్జకట్టుగా ని జ్జగంబులం బరిగ్రహించి, పర్జన్యా దులకు విసర్జనంబు చేయందలంచి యున్నవాఁ, డీ పాఱునిం దూఱి పాఱనీక నిర్జించుటఁ గర్జం" బని తర్జనంబులును గర్జనంబులునుఁ జేయుచు, వజ్రాయుధాధి మరుజ్జేతలగు హేతి ప్రహేతి విప్రచిత్తిముఖ్యులయిన రక్కసులు పెక్కం డ్రుక్కుమిగిలి యుద్ధంబునకు సన్నధులై పరశు పట్టిస భల్లాది సాధనంబులు ధరియించి కసిమెసంగి ముసిరికొని దశదిశలఁ బ్రసరించినఁ జూచి హరిపరిచరులు సునంద నంద జయ జయంత విజయ ప్రబలోద్బల కుముద కుముదాక్ష తార్క్ష్య పుష్పదంత విష్వక్సేన శ్రుతదేవ సాత్వత ప్రముఖులగు దండనాథు లయుత వేదండ సముద్దండ బలులుఁ దమతమ యూథంబుల నాయుధంబులతోడం గూర్చుకొని దానవానీకంబులం బరలోకంబున కనుచువారలై వారల నెదుర్కొని కదనంబునకున్ బరవసంబు చేయుచున్నం గనుంగొని శుక్రుశాపంబుఁ దలంచి దనుజ వల్లభుం డిట్లనియె. [8-634]

ఇలా రెండుపాదాలతో అన్నీ ఆక్రమించి తిరిగి వామన రూపంతో కనిపించిన విష్ణువుని చూసి ఇక్కడున్న మిగతా రాక్షసులకి కోపం వచ్చింది. మన చక్రవర్తి మాట తప్పడు కనక కుర్రాడు ఏది అడిగితే అది ఇచ్చాడు. ఇతని వల్ల తప్పులేదు. కానీ ఇలా మాయల్తో మోసాలు చేస్తాడా విష్ణువు? ఇతన్ని ఇక్కడే సంహరించాలి అని ఆయుధాలు ఎత్తి బయల్దేరారు. అక్కడ ఉన్న సునంద నంద జయ విజయులు యుద్ధానికి సిద్ధమయ్యేరు ఇది చూసి.

రెండు విషయాలు గమనించాల్సినవి. పోతన వచనం రాస్తూ విష్ణువు ఎలా విజృంభించాడో చెప్పేటప్పుడు ఏమన్నాడు? "*జలధరనినద శంఖ శార్ఙ్గ సుదర్శన గదాదండ ఖడ్గాక్షయ బాణతూణీర విభ్రాజితుండును, మకరకుండల కిరీట కేయూర హార కటక కంకణ కౌస్తుభ మణి మేఖలాంబర వనమాలికా విరాజితుండును, సునంద నంద జయ విజయ ప్రముఖ పరిచర వాహినీ సందోహ పరివృతుండును,*" ఇప్పుడు అర్థం అవుతోంది కదా ఎందుకు అలా అందర్నీ కూడా తీసుకొచ్చాడో? రాక్షసులకి కోపం వచ్చి తిరగబడితే ఆపడానికన్నమాట.

రెండోది, రాక్షసులకి బలి చక్రవర్తి అంటే ఉన్న అభిప్రాయం. బలి కార్య దక్షత గురించి ముందు వ్యాసాల్లో చెప్పుకున్నాం. ఇది ఇక్కడ మరో సారి ఋజువౌతోంది. వాళ్ళు బలి గురించి ఏమనుకుంటున్నారు? "*మన దానవేంద్రుఁడు*

*సత్యసంధుండు గావున మాటఁ దిరుగక యిచ్చె నతని వలన నేరంబు లేదు.*" కార్య దక్షత ఉన్నవాడికి అతని మంత్రులూ సహవర్యులూ ఎలా సహకరిస్తారో, ఎంత విశ్వాసంతో అంటిపెట్టుకుని ఉంటారో ఈ వ్యాక్యం చెప్పకనే చెప్తోంది కదా? బలి ఇదంతా ముందే చూసుకుని ఆలోచించుకుని, దానం ఇచ్చాడు. మరిప్పుడు యుద్ధానికి బయల్దేరే వాళ్లతో ఏం చెప్పాలి? "దానం ఇవ్వడం అయిపోయింది, యుద్ధం చేసి మళ్ళీ ఇచ్చేసినదంతా గెలుచుకుందాం, మీరు అన్నదే సరైనదీ, విష్ణువు నిజంగానే మనందర్నీ మోసం చేసాడూ" అనాలా?

సీ. రాక్షసోత్తములార! రండు పోరాడక;
కాలంబు గాదిది కలహమునకు;
సర్వభూతములకు సంపదాపదలకు;
బ్రభువైన దైవంబుఁ బరిభవింప
మన మోపుదుమె? తొల్లి మనకు రాజ్యంబును;
సురలకు నాశంబు సొరిది నిచ్చి
విపరీతముగఁ జేయు వేల్పు నే మందము;
మనపాలి భాగ్యంబు మహిమ గాక; [8-635]

తే. వెఱచి పలుమాఱుఁ బాఱెడి విష్ణుభటులు
మిమ్ము నెగచుట దైవంబు మేర గాదె?
మనకు నెప్పుడు దైవంబు మంచిదగును
నాఁడు గెలుతుము పగవారి నేఁడు వలదు. [8-635.1]

ఇలా దాడికి దిగుదామనే రాక్షసులని చూసి బలి చెప్తున్నాడు, శుక్రాచార్యులిచ్చిన శాపం తలుచుకుని. ఇది మనకి సమయం కాదు. ఇంతకాలం మనని రాజ్యం చేయనిచ్చి, దేవతలని నానాకష్టాలు పెట్టాడు కదా? సంపదలకీ ఆపదలకీ కూడా ప్రభువైన దైవమే మొదట్లో సంపద ఇచ్చి ఇప్పుడు ఇలా వెనక్కి తీసుకుంటున్నాడంటే దానికేదో అర్థం ఉండి తీరుతుంది. ఇంతకాలం మన దగ్గిర అణిగిమణిగి ఉన్న వీళ్ళు ఇప్పుడు మనమీద తిరబడుతున్నారనేది విచిత్రంగా లేదా? ఓ నాడు మనకి మంచి రోజులొస్తాయి. అప్పుడు మళ్ళీ నెగ్గుతాం. ఇప్పుడు వద్దు.

అసలు మొదట్లో కసిగా ఇంద్రుణ్ణీ దేవతలనీ జయించి, తానే శాశ్వతంగా ఇంద్రుడైపోదామనుకున్న బలి ఇప్పుడిలా ఎందుకు మారిపోయాడు? అదే దాన, యజ్ఞ, తపో మహిమ. మొదట్లో ఇవ్వడం అనేది ఒక వ్యాపారంగా మొదలుపెట్టి అలా ఇస్తూ తనకి తెలిసో తెలియకో బలి రాక్షసత్వాన్ని పోగొట్టుకున్నాడు పూర్తిగా.

క. పలు దుర్గంబులు సచివులు
బలములు మంత్రౌషధములు బహు శేముషియుం
గలిగియు సామోపాయం
బులఁ గాల మెఱింగి నృపుడు పోరుట యొప్పున్. [8-637]

అదీగాక యుద్ధం చేయాలంటే మాటలా? బలాబలాలు చూసుకోవాలి, దుర్గానికి కాపలాలు పెట్టాలి. అన్ని ఉపాయాలు చూసుకుని అప్పుడు యుద్ధం చేద్దాం.

వ. అట్లు గావున రణంబున శత్రుల కిప్పు డెదురు మోహరించుట కార్యంబుఁ గాదు; మనకుం దగు కాలంబున జయింతము; నలంగక తొలంగుం డనిన దలంగి భాగవత భట భీతులై చిక్కి రక్కసులు రసా తలంబునకుం జని; రంత హరి హృదయం బెఱింగి తార్క్ష్యనందనుండు యాగసుత్యాహంబున వారుణ పాశంబుల నసురవల్లభుని బంధించెను; అంత. [8-638]

ఇలా అనేసరికి అక్కడున్న రాక్షసులు వీటికి ఒప్పుకుని, విష్ణుభటులకి భయపడి రసాతలానికి వెళ్ళిపోయారు. వెంఠనే గరుడుడు (తార్క్ష్య నందనుడు) బలి పాశాలతో బంధించాడు. ఓ ధర్మ సందేహం. బలికి ఇప్పుడు పూచికపుల్లంత ఆస్థి లేదు, కట్టుబట్టలు తప్ప. ఉన్నవన్నీ ఇచ్చేసిన వాణ్ణి బంధించడం దేనికి? ఎక్కడకి పారిపోతాడు? అది ముందు వ్యాసంలో తెలుస్తుంది.

## త్రివిక్రమ విజృంభణ; వామనావతారం – 15

రెండు పాదాలతో బలికి ఉన్న భూమండలం, పైలోకాలూ అన్నీ తీసుకున్నాడు వామనుడు. మూడు పాదాలు ఇస్తానని బలి సత్యసంధుడిగా ప్రమాణం చేశాడు కనక మూడో అడుగు ఇంకా కొలవాలి. ఇంతవరకూ "*హర్ష నిర్భర చేతస్కుడై*" దానం ఇచ్చిన బలిని అలా వదిలేస్తాడా విష్ణువు? రాక్షులందరూ రసాతలానికి వెళ్తే అన్నీ తనకి సమర్పించిన తన భక్తుడు ఎక్కడికీ వెళ్ళకుండా తన దగ్గిరే ఉంచుకునే బాధ్యత భగవంతుడిదే కదా? అందువల్ల గరుడుడు బలి బంధించాడు. మరో చిన్న పరీక్ష పెట్టి చూడాలి. ఇంతవరకూ వచ్చాక కూడా మూడో పాదం ఇస్తాడా? ఇస్తే అది ఎక్కడ పెట్టమంటాడో?

క. బాహులుఁ బదములుఁ గట్టిన
శ్రీహరి కృపగాక యేమి జేయుదు నని సం
దేహింపక బలి నిలిచెను
హాహారవ మెసఁగె దశ దిగంతములందున్. [8-639]

ఇలా కాళ్ళూ చేతులూ కట్టేసిన బలి – ఇదేమిటి నన్నెందుకు కట్టేసారు? నా తప్పేమిటి అని ఎదురు తిరగకుండా – ఇదంతా శ్రీహరి కృప తప్ప మరొకటి కాదు అని అలా నిశ్చలంగా చూస్తూ ఉన్నాడు. దశ దిక్కులలో ఉన్న వాళ్లందరూ ఇది చూసి హాహారావాలు చేసారు. బలి ఎందుకలా మాట్లాడకుండా ఉన్నాడు అనేది ఓ సారి ఆలోచిస్తే అదే సరైన పూర్ణ శరణాగతి అని మనకి అర్థమౌతుంది. ఏ స్థితిలోనైనా సరే భగవంతుణ్ణీ నమ్ముకుని "అంతా నీదే, అంతా నీ ఇష్టం" అనే స్థితికి చేరాడు ఇప్పుడు బలి చక్రవర్తి.

క. సంపద చెడియును దైన్యము
గంపంబును లేక తొంటికంటెను బెంపుం
దెంపును నెఱుకయు ధైర్యము
వంపని సురవైరిఁ జూచి వటుఁ డిట్లనియెన్. [8-640]

సర్వ సంపదలూ పోయాయి. అయినా సరే ఒళ్ళు కంపించడం లేదు మొహంలో దైన్యం లేదు. ఎందుకంటే తాను చేసినది ఎటువంటిదైన సరే అది ధర్మ మార్గంలో చేశాడు. తప్పు అనేది మనసులో అణుమాత్రం లేదు. ఇంక భయపడే ప్రశ్నే లేదు. అలా నిర్భయంగా ఉన్న బలి చూసి ఇప్పుడు విష్ణువు అడుగుతున్నాడు – చివరి పరీక్షగా.

సీ. దానవ! త్రిపదభూతల మిత్తు నంటివి;
ధరణిఁ జంద్రార్కు లెందాఁక నుందు
రంత భూమియు నొక్క యడుగయ్యె నాకును;
స్వర్లోకమును నొక్క చరణమయ్యెఁ;
నీ సొమ్ము సకలంబు నేఁడు రెండడుగులు;
గడమ పాదమునకుఁ గలదె భూమి?
యిచ్చెద నన్నర్థ మీని దురాత్ముండు;
నిరయంబు బొందుట నిజముగాదె? [8-641]

తే. కాన దుర్గతికినిఁ గొంత కాల మరుగు
కాక యిచ్చెదవేని వేగంబ నాకు
నిపుడ మూఁడవ పదమున కిమ్ముఁ జూపు
బ్రాహ్మణాధీనములు ద్రోవ బ్రహ్మవశమె? [8-641.1]

నువ్వు నాకు మూడడుగులు ఇస్తానన్నావు కదా? నీకున్నదంతా భూమి దగ్గిర్నుంచి పైన ఉన్న లోకాలదాకా ఉన్నదొకడుగూ కింద ఉన్నదంతా మరో అడుగూ అయింది. నీకున్న సొమ్ములన్నీ నాకు రెండడుగులయ్యేయి. ఇస్తానని చెప్పి ఇవ్వకపోతే మహాపాపం అంటుకుంటుంది. మూడో అడుగు కొలవడానికి వెంఠనే చోటు చూపించు మరి. దానం తీసుకున్న బ్రాహ్మణులకి స్వాధీనం కావాల్సినది బ్రహ్మ కూడా తీసుకోలేడనేది నిజం కదా?

వ. అని యిట్లు వామనుండు పలుక సత్యభంగ సందేహ విషదిగ్ధ శల్య నికృత్త హృదయుం డయ్యును విషణ్ణుండుఁ గాక వైరోచని ప్రసన్న వదనంబుతోడఁ జిన్ని ప్రోడ వడుగున కి ట్లనియె. [8-642]

ఇలా అన్న వామనుడి మాటలు విన్న బలిచక్రవర్తికి సత్యభంగం అవుతుందేమో అనే సందేహం మనసును గాయపరచింది. గమనించ వల్సింది ఏమిటంటే బలి మనసు గాయపడింది ఆస్తులు పోయి తాను నాశనం అవుతున్నందుకు కాదు. తానిచ్చిన మాట తప్పు అయి సత్యభంగం అవుతుందేమో అని. అటువంటివాడే – ఏ పర్తిస్థితుల్లో అయినా సత్యాన్ని అతిక్రమించనివాడే – కదా అర్హుడు సాక్షాత్కారానికి? దీనినే "*సత్యమేవ జయతే నానృతాత్*" అని చెప్పడం. దిగులుచెందకుండా ప్రసన్నమైన ముఖంతో వామనుడితో అన్నాడు.

ఆ. సూనృతంబుఁ గాని నుడియదు నా జిహ్వ
బొంకఁజాల; నాకు బొంకు లేదు;
నీ తృతీయపదము నిజము నా శిరమున
నెలవు జేసి పెట్టు నిర్మలాత్మ! [8-643]

ఇలా అన్న విష్ణువుని చూసి ఇప్పుడు బలి చెప్తున్నాడు – అబద్ధం అనేది నేను ఆడలేను. అసత్యం అనేది నా మనసులో లేనే లేదు. నీ మూడో అడుగు నా తల మీద ఉంచు. అంటే బలి "*సత్యం పరం ధీమహి*" అనేదాన్ని పూర్తిగా గ్రహించాడు.

ఆ. నిరయమునకుఁ బ్రాప్త నిగ్రహంబునకును
బదవిహీనతకును బంధనమున
కర్థ భంగమునకు నఖిల దుఃఖమునకు
వెఱవ దేవ! బొంక వెఱచినట్లు. [8-644]

నరకానికి పోవడం, శిక్షింపపడటం, ఉన్నదంతా పోవడం, బంధింపబడటం, కష్టాలు; వీటన్నింటికన్నా కూడా అబద్ధం చెప్పడానికే ఎక్కువ భయపడతాను. నేను అసత్యం అడడం అనేది కలలో కూడా జరిగేది కాదు.

సీ. తల్లిదండ్రులు నన్నదమ్ములు జెలికాండ్రు;
గురువులు శిక్షింపఁ గొఱఁతపడునె?
పిదప మేలగుఁ గాక; పృథుమదాంధులకును;
దానవులకు మాకుఁ దఱియెఱింగి
విభ్రంశచక్షువు వెలయ నిచ్చుటఁ జేసి;
గురువులలోనాదిగురువ వీవ;
నీవు బంధించిన నిగ్రహమో లజ్జ;
యో నష్టియో బాధయో తలంప [8-645]

తే. నిన్ననెదిరించి పోరాడి నిర్జరాదు
లాదియోగీంద్రు లందెదు నట్టి టెంకి
నందరే తొల్లి పెక్కండ్రు? హర్షమూర్తి!
యీశ! నీ యెడ దుర్లభ మేమి కలదు? [8-646.1]

ఇంకా ఏమంటున్నాడంటే, – తల్లితండ్రులూ, అన్నదమ్ములూ, మిత్రులూ, గురువులూ, శిక్షించడం వల్ల మేలే కలుగుతుంది. మదంతో కన్నులు కనిపించని మావంటి రాక్షసులకు నువ్వు సకాలంలో చెదరిపోకుండా వెలిగే చూపు ఇవ్వడం వల్ల (విభ్రంశ చక్షువు వెలయ నిచ్చుటఁ జేసి) నీవు గురువులలో ఆదిగురువు అయ్యావు. నన్ను బంధించడం శిక్షగా గాని సిగ్గుగా కానీ లోటుగా గానీ నేను భావించాల్సినది లేదు. ఇదివరలో చాలామంది రాక్షసులు నిన్నుఎదిరించి పోరాడి యోగీశ్వరులు పొందే స్థానాన్ని పొందారు కదా? నీకు అసాధ్యం అన్నది ఏముంది? ఈ మాటలు చూస్తూంటే బలి చక్రవరి పరిణితి తెలుస్తోంది కదా?

మ. చెలియే మృత్యువు? చుట్టమే యముఁడు? సంసేవార్థులే కింకరుల్?
శిలలం జేసెనె బ్రహ్మదన్ను? దృఢమే జీవంబు? నో చెల్లరే;
చలితం బౌట యెఱుంగ కీ కపట సంసారంబు నిక్కంబుగాఁ
దలఁచున్ మూఢుఁడు సత్యదాన కరుణాధర్మాదినిర్ముక్తుఁడై. [8-647]

అదలా ఉంచితే ఎవరికైనా మృత్యువు మిత్రుడా? యముడు దగ్గర చుట్టమా? పోనీ సేవకులు మాత్రం బుద్ధిమంతులా, ఏమైనా శాశ్వతమా? ఈ శరీరాన్ని బ్రహ్మ రాళ్ళతో మలచలేదు కదా? మరీ ప్రపంచం ఇలా ఉండగా, మూర్ఖుడు సత్యమూ, దానమూ, దయా, ధర్మమూ మొదలైనవాటిని వదిలేసి ఈ సంసారాన్ని సత్యమని భావిస్తున్నాడు.

సీ. చుట్టాలు దొంగలు సుతులు ఋణస్థులు;
కాంతలు సంసార కారణములు;
ధనము లస్థిరములు; దను వతి చంచల;
గార్యార్థు లన్యులు; గడచుఁగాల
మాయువు; సత్వర మైశ్వర్య మతి శీఘ్రు;
మని కాదె తమ తండ్రి నతకరించి
మా తాత సాధుసమ్మతుఁడు ప్రహ్లాదుండు;
నీ పాదకమలంబు నియతిఁ జేరె [8-648]

తే. భద్రుఁ డతనికి మృతి లేని బ్రతుకుఁ గలిగె
వైరులై కాని తొల్లి మా వారుఁ గాన
రర్థివై వచ్చి నీవు న న్నడుగు టెల్ల
బద్మలోచన! నా పుణ్య ఫలము గాదె? [8-648.1]

మరి ప్రపంచం ఇలా ఉంటే మా తాత ప్రహ్లాదుడు ఏమనుకున్నాడు? చుట్టాలు, దొంగలు, కొడుకులు అప్పులవాళ్ళు, భార్యలు హరి భక్తిని మరిపించి ముక్తిని దూరంచేసేవారు. సంపదలు నిలకడ లేనివి. శరీరం స్థిరం కాదు. ఇతరులు తమ

ప్రయోజనాన్నే కోరుతారు ఎప్పటికైనా. కాలం వేగంగా గడిచిపోయి ఆయుస్సు తీరిపోతుంది. ఐశ్వర్యం నిలకడగా ఉందేదెక్కడ? అలా ఆలోచించి త్రిలోకాలనీ జయించిన తన తండ్రిని విడనాడి నీపాదాలను సేవించాడు. అదృష్టవంతుడైన అతనికి మరణంలేని మనుగడ దొరికింది. ఎప్పుడూ కూడా మావారు శతృవులుగా మారితే తప్ప నిన్ను దర్శించలేకపోయారు. ఈ సమయంలో, నీవు దేహీ అంటూ వచ్చి నన్ను అడగడం మా పూర్వ పుణ్య ఫలం కాకపోతే మరేమిటి?

ఇక్కడ ఓ సారి ఆగి అసలు మూడు అడుగులంటే ఏమిటి, వామనుడిగా వచ్చిన మహావిష్ణువు ఎందుకలా అడిగాడనేది చూద్దాం. పద్యాలలో ఒక్కో చోట "*ఒంటివాఁడ నాకుఁ నొకటి రెండడుగుల మేర యిమ్ము*" అనడమూ, మరోచోట "*మదాకాంక్షామితంబైన మూఁడడుగుల్ మేరయ త్రోవ కిచ్చుటది బ్రహ్మాండంబు నా పాలికిన్,*" అనడమూ చూసాం కదా? దీనిమీదో చిన్న కథ చెప్పుకుందాం.

రమణ మహర్షి ఆశ్రమంలో సాధారణంగా ఆయన చేసేదేమిటి అంటే, అలా కూర్చుని మౌనంగా ఉండడమే. ఎవరైనా వస్తే ఓ సారి వాళ్ళకేసి చూసి మళ్ళీ మౌనంగా అలా ఎక్కడో చూస్తూ ఉన్నట్టు కూర్చునేవారుట. ఎవరైనా ప్రశ్న వేస్తే సమాధానం చెప్తే చెప్తారు లేకపోతే లేదు. మరి ఎవరికైనా సందేహం వస్తే దానికి సమాధానం చెప్పకపోతే ఎలా? దానికి రమణులే వివరణ ఇచ్చారు చాలాసార్లు. “మౌనంగా మంత్రం జపించేటప్పుడు అది ఎక్కణ్ణుంచి వస్తోందో చూడు. అది ఎవరు జపిస్తున్నారో చూడు. అదే తపస్సు, అక్కడే అన్ని సమాధానాలూ దొరుకుతాయి” అని. దీనినే "నేనెవరిని" అని శోధించమనడం.

ఓ రోజు రమణుల దగ్గిరకో శిష్యుడు వచ్చి అడిగాడుట, "అసలు సంపూర్ణ శరణాగతి ఎలా సాధ్యమౌతుంది?" అని. జాగ్రత్తగా ప్రశ్న విన్నాక రమణుల సమాధానం మళ్ళీ మౌనమే. చాలా సేపు అలా కూర్చున్నాక రమణులు ఓ సారి అడిగారుట, "నువ్వు చేసుకున్న పుణ్యం అంతా నేను అడిగితే ఇస్తావా?" అని. తన ప్రశ్నకి ఎలాగా సమాధానం చెప్పరేమో అనుకున్న శిష్యుడు చెప్పాడు వెంటనే – "తప్పకుండా, అంతకన్నా నాకు సంతోషం కలిగించేదేమి ఉంటుంది?" మళ్ళీ మరో సారి మౌనం. చాలాసేపు అలాగే కూర్చున్నాక మళ్ళీ రమణ మహర్షి అడిగారుట, "మరి నాకు నువ్వు చేసిన పాపాలు కూడా కావాలి, ఇస్తావా?" ఈ ప్రశ్న విని శిష్యుడు తెల్లబోయి అన్నాడుట, "నేను చేసిన పాపాలు వేల సంఖ్యల్లో ఉండొచ్చు. చేసిన పుణ్యం కన్నా పాపమే ఎక్కువ. అలా ఇవ్వలేను, ఇవ్వకూడదేమో కూడా." మళ్ళీ మౌనం. రమణ మహర్షి ఇంక ఈ

రోజుకి మాట్లాడరేమో అని శిష్యుడు బయల్దేరబోతూంటే రమణులు అన్నారుట "మరి నువ్వు నన్ను గురువుగా భావించినట్టైతే 'నేను' అన్నది పూర్తిగా పోయి సర్వం నాకు సమర్పణ చేయాలి కదా. నువ్వు చేసేవి చేసే పనుల్లో పాపమూ ఉంది పుణ్యమూ ఉంది. అవి నాకు సమర్పణ చేయకపోతే పూర్తి శరణాగతి ఎలా సాధ్యమౌతుంది?" శిష్యుడికి సమాధానం దొరికింది.

అలా మనం ఆత్మ సమర్పణ చేసిననాడు మనకి మిగిలిన అహంకారం గురువు తగ్గించగలడు. మరి నేను పాపమూ ఇవ్వనూ పుణ్యమూ ఇవ్వను అంటే శరణాగతి లేదనే కదా అర్థం? అంటే మన శరీరం భగవంతుడి కోసమే ఏర్పాటైంది; ఈ శరీరంతో ఆయన ఈ ప్రపంచంలో ఏం కావాలో అవి చేయించుకుంటాడు. మనకి ఇష్టం ఉండి ఆయా పనులు, ఆయన ఆడించినట్టూ చేస్తే, సంతోషంగా ఉండగలం. అబ్బే "నేను" చేయను, "నాకు" ఇష్టంలేదు అని కూర్చుంటే ఏడుపు మిగులుతుంది. అటువంటప్పుడు మన అహంకారం ఎలా పోతుంది? అలా పుణ్యం, పాపం రెండూ మనఃస్ఫూర్తిగా ఇచ్చిననాడు, గురువుకి/భగవంతుడికి సంపూర్ణ శరణాగతి చేసినట్టు. అలా చేయగానే మరోసారి భవిష్యత్తులో తెలిసో, తెలియకో పాపం ఏదైనా చేయబోతున్నప్పుడు వెంఠనే ఈ సమర్పణ గుర్తొచ్చి పాపం చేయడానికి ఆస్కారం తగ్గుతుంది కదా?

సరిగ్గా ఇదే బలి చక్రవర్తిని వామనుడు అడిగిన మూడు అడుగులు – పాపం, పుణ్యం, అహంకారమూను. అందుకే మూడో అడుగు ఎక్కడ పెట్టాడు? బలి తలమీద – అహంకారం పోవడానికి. లేకపోతే – భూమిమీద నుంచుని దానం చేసే బలి చక్రవర్తి – రెండో పాదంతో కొలిచిన భూమిమీదే ఉన్నాడు కదా, మరో సారి తలమీద పెడితే అది మూడో పాదం ఎలా అవుతుంది?

ఇంకా వివరంగా చెప్పాలంటే, వామనుడు దానం అడిగేటప్పుడు ఏమడిగాడు మొదట్లో? "*నొకటి రెం డడుగుల మేర*" ఒకటి – పుణ్యం (వేటితోనైతే పైలోకాలకెళ్ళగలమో అది, వాటిని ఒక పాదంతో ఆక్రమించాడు) రెండోది – పాపం (భూమిమీద మళ్ళీ పుట్టడానికీ, అహంకారానికీ దారి చేసేది; దీన్ని రెండో పాదంతో ఆక్రమించాడు). అప్పుడు శరణాగతి రాగానే మూడో అడుగు అహంకారం మీద. అప్పటికి మూడడుగులు ఇస్తే ఏమైంది? పూర్ణ శరణాగతి ఇచ్చినట్టు. అదే మనం భగవంతుడికివ్వగలిగే బ్రహ్మాండం. దానినే వామనుడు ఏమన్నాడు? "*మూఁడడుగుల్ మేరయ త్రోవ కిచ్చుటది బ్రహ్మాండంబు నా పాలికిన్.*" ఎప్పుడైతే బలి ఈ రెండూ – పుణ్యమూ, పాపమూ – "*హర్ష నిర్భర చేతస్కుడై*" ఇచ్చాడో

అప్పుడు మూడో అడుగు తలమీద పెట్టి అహంకారం అణిచాడు – ఇదే "*భక్తపాలన కళాసంరంభకున్, దానవోద్రేక స్థంభకున్*" అని పోతన భాగవతం మొదలుపెడుతూ మొట్టమొదటి పద్యంలో చెప్పినది. ఇక్కడ కూడా బలి భక్తుడు ముందు. అందుకే వస్తూనే స్వస్తి వాచకం ఇచ్చినది. ఆ తర్వాతే దానవోద్రేక స్థంభన – అంటే అహంకారం అణచడం.

మనకి అన్నీ ఇచ్చిన భగవంతుడికి మనం అసలు నిజంగా ఇవ్వగలిగేదేముంది? డబ్బులా? బట్టలా, పువ్వులా? అవన్నీ భగవంతుడికా, ప్రపంచంలో జనాల మెప్పు కోసమా? బలి కూడా వచ్చిన భగవంతుడితో ముందు ఏం కావాలో కోరుకో అంటూ ఏమన్నాడు? "*వరచేలంబులో, మాడలో*..." అంటూ తన ఆస్తులన్నీ ఏకరువు పెట్టాడు. తనకి భౌతిక సంపదలన్నీ ఇచ్చిన భగవంతుడికి మళ్ళీ ఆ భౌతిక సంపదలు ఇద్దామని ఆలోచించాడు. ప్రపంచానికే అన్నీ ఇచ్చిన భగవంతుడికి క్షణికమైన భౌతిక సంపదలు ఏపాటివి? కానీ శ్రీహరి ఏమడిగాడు బలిని? నీ మనసు నాకు శరణాగతి చేయడానికి సిద్ధంగా ఉన్నావా అంటూ స్వస్తి వాచకం చెప్పాడు. బలి అది సరిగ్గా గ్రహించాడు కనకే సంతోషంగా ఇచ్చేసాడు అడిగినది. అందుకే బలి లాంటి కార్య దక్షత ఉన్న చక్రవర్తి మరొకడు పుట్టడం అసాధ్యం.

ఈ శరీరం భగవంతుడి కోసమేననీ "నేను కాదు నువ్వే" అనీ గజేంద్రుడి లాగా, ప్రహ్లాదుడిలాగా, బలి చక్రవర్తిలాగా ఆయన అడిగినది ఇవ్వడమే మనం భగవంతుడి కివ్వగలిగే నిజమైన కానుక. ఇదే శంకర భగవత్పాదులు అన్న"*భవతు భవదర్థం మమ మనః*" అనేది. మరో సారి ఆ శ్లోకం గుర్తు తెచ్చుకుందాం.

కరస్తే హేమాద్రౌ గిరిశనికటస్తే ధనపతౌ
గృహస్తే స్వర్భూజామర సురభి చింతామణి గణే
శిరస్తౌ శీతాంసౌ చరణ యుగళస్తే అఖిలసుభే
కమర్థం దాస్యే జహం భవతు భవదర్థం మమ మనః [శివానందలహరి. 26]

(బంగారు కొండ నీచేతిలోనే ఉంది. అత్యంత ధనవంతుడైన కుబేరుడు నీ స్నేహితుడే. నీ గృహంలోనే కల్పవృక్షం, కామధేనువు, చింతామణి వజ్రం ఉన్నాయి. తలమీద చల్లదనాన్నిచ్చే చంద్రుడున్నాడు. నీ పాదాల దగ్గిర సర్వ శుభాలు ఉన్న నీకు నేనిచ్చేదేమి కనిపించదు కనక నా మనసే నీదవు గాక)

## వామనావతారం – 16

మూడడుగుల దానం ఇవ్వడం పూర్తైపోయింది. మరి ఇప్పుడీ చేస్తున్న యజ్ఞం పూర్తవలేదు కదా ఇంకా? మొత్తం తనకున్నదంతా ధారపోసిన బలి ఉండడానికి మరోచోటు చూపించాలి. ఇలా తన మనవడు దానం ఇచ్చాడని తెలియగానే ప్రహ్లాదుడు అక్కడకొచ్చాడు.

శా. ఆ దైత్యేంద్రుఁడు పీనవక్షు, నవపద్మాక్షుం, బిశంగాంబరా
చ్ఛాదున్. నిర్మలసాధువాదు, ఘనసంసారాదివిచ్ఛేదు, సం
శ్రీదున్, భక్తిలతాధిరోహిత హరిశ్రీపాదు, నిఃఖేదుఁ, బ్ర
హ్లాదున్ బోధకళావినోదుఁ గనియెన్ హర్షంబుతో ముందటన్ [8-650]

ఇక్కడ పోతన ప్రహ్లాదుణ్ణి ఏమన్నాడో గమనించారా? "ఘనసంసారాదివిచ్ఛేదు, సంశ్రీదున్, భక్తిలతాధిరోహిత హరిశ్రీపాదు, నిఃఖేదు." అతి కష్టమైన సంసారం అనే రోగాన్ని దాటినవాడు, భక్తితో భగవంతుణ్ణి లోబరుచుకున్నవాడు. ఇదంతా ఇంతకుముందు ఎలా జరిగిందో ప్రహ్లాదోపాఖ్యానంలో గమనించవచ్చు. బలికి ఇప్పుడు వామనుడిగా కనిపించే శ్రీహరి ఇంతకు ముందు తనకి నృసింహరూపంలో కనిపించినవాడే.

వ. ఇట్లు సమాగతుండైన తమ తాతం గనుఁగొని విరోచన నందనుండు వారుణపాశబద్ధుండుఁ గావునఁ దనకుం దగిన నమస్కారంబు జేయ రామింజేసి సంకులాశ్రువిలోల లోచనుండై సిగ్గుపడి నత శిరస్కుండై నమ్రభావంబున మ్రొక్కు చెల్లించె; నంతఁ బ్రహ్లాదుఁడు ముఖమండ పంబున సునందాది పరిచర సమేతుండై కూర్చున్న వామనదేవునిం గని యానంద బాష్పజలంబులుఁ బులకాకుంరంబులున్ నెరయ దండప్రణామం బాచరించి యిట్లని విన్నవించె.
[8-651]

వచ్చిన తాత ప్రహ్లాదుణ్ణి చూసి నమస్కారం చేద్దామంటే అంతకుముందు గరుడుడు పాశాలతో కట్టేశాడు కనక చేతులు విడిపించుకోలేక అలా సిగ్గుపడి తలవంచుకున్నాడు బలి. ప్రహ్లాదుడు వామన రూపంలో ఉన్న శ్రీహరితో చెప్తున్నాడు ఇదంతా చూసి.

సీ. ఇతనికి మున్ను నీ వింద్రపదం బిచ్చి;
నేఁడు త్రిప్పుటయును నెఱయమేలు
మోహనా హంకృతి మూలంబు గర్వాంధ;
తమస వికారంబు దాని మాన్పి
కరుణ రక్షించుటఁగాక బంధించుటే?
తత్త్వజ్ఞునకు మహేంద్రత్వమేల?
నీ పాదకమలంబు నియతిఁ గొల్చిన దాని;
బోలునే సురరాజ్య భోగపరత? [8-652]

తే. గర్వ మేపారఁ గన్నులు గానరావు;
చెవులు వినరావు; చిత్తంబు చిక్కుపడును;
మఱచు నీ సేవలన్నియు మహిమ మాన్పి
మేలు చేసితి నీ మేటి మేర చూపి. [8-652.1]

ఇంతముందు నువ్వే ఇతనికి ఇంద్రపదవి ఇచ్చావు. అది ఇప్పుడు వెనక్కి తీసుకోవడం మంచిదైంది. ఎందుకంటే ఈ రాజ్యాలూ భోగాలు ఉన్నవాడికి గర్వం ఎక్కువైపోయి కళ్ళు కనిపించవు, చెవులు వినిపించవు, మనసు పనిచేయదు. ఇవన్నీ వెనక్కి తీసేసుకుని ఆ వికారాలన్నీ అంటుకోకుండా రక్షించావు. నిన్ను చేరడం కంటే ఈ రాజ్యాలూ పదవులూ అవీ ఎక్కువకాదు కదా? ప్రహ్లాదుడు ఎప్పుడో యుగాల క్రితం చెప్పినది ఈ నాటిక్కూడా అక్షరం పొల్లుపోకుండా జరగడం మనం చూస్తూనే ఉన్నాం కదా? దీన్నే స్వామి వివేకానంద చెప్పిన దానితో సరిచూసుకోవచ్చు.

స్వామి గారు లండన్ లో మాట్లాడుతూంటే ఒక పెద్దమనిషి అడిగాడుట – "మీ దేశంలో అన్నీ బాగున్నాయనీ, అధ్యాత్మికత అద్భుతం అనీ చెప్తున్నారు మీరు. కానీ చూడబోతే మీ బట్టలూ అవీ ఛండాలంగా ఉన్నాయి. సరైన బట్టలే వేసుకోలేరా?" అని. దానికి స్వామిగారు ఇలా చెప్పారుట సమాధానం – "మీ దేశంలో మనిషికి విలువ బట్టల మీద ఆధారపడి ఉంటుంది. మా దేశంలో మనిషికి విలువ వాడు చేసే పనుల బట్టీ, వాడికున్న జ్ఞానం బట్టీ ఉంటుంది. డబ్బులు

ఉన్నవాడు మీ దేశంలో గొప్పవాడు. వాడికి ఎక్కడలేని గౌరవం ఇచ్చి అధికారం కట్టబెడతారు. అటువంటి డబ్బున్నవాడు ప్రజలకి చేసే చెడు ఎలా ఉంటుందో జగమెరిగిన సత్యం."

స్వామిజీ మాటల్లో మరోవిధంగా చెప్పాలంటే, "డబ్బు అనేది ప్రజా సంక్షేమం కోసం ఖర్చు పెట్టాల్సిన ఒక వితరణమైన ముడిసరుకు. ఆ దారిలోనే దాన్ని వదుల్చుకోవాలి. ఎప్పుడైతే దాన్ని నాది, నాకు అంటూ, దాచుకోవడం మొదలుపెడతామో అప్పుడే సరిగ్గా మన బుద్ధి వక్రించడం మొదలుపెట్టి ఆ డబ్బు ఎందుకూ పనికిరాకుండా పోయి మనకీ ఇతరులకీ హాని చేయడం మొదలుపెడుతుంది." ఇదే కదా ప్రహ్లాదుడు చెప్తోంది?

వ. అని పలికి జగదీశ్వరుండును నిఖిలలోక సాక్షియు నగు నారాయణ దేవునకు నమస్కరించి, ప్రహ్లాదుండు పలుకు చున్న సమయం బున. [8-653]

మ. తతమత్తద్విపయాన యై కుచ నిరుంధచ్ఛోళ సంవ్యానయై
ధృత భాష్పాంబు వితాన యై కరయుగాధీ నాలికస్థానయై
పతిబిక్షాం మమ దేహి కోమలమతే! పద్మాపతే! యంచుఁ ద
త్సతి వింద్యావళి చేరవచ్చెఁ ద్రిజగ్రద్రక్షామనున్ వామనున్. [8-654]

ఇలా ప్రహ్లాదుడు అనే సమయానికి బలి వాళ్ళావిడ వింద్యావళి వచ్చి వామనుడితో అంది – "పతిబిక్షాం మమ దేహి" అని. ఇక్కడ వామనుడు ఒక్కసారి తీసుకునేవాడి నుంచే ఇచ్చేవాడి రూపంలోకి మారాడు. మరి అటువంటి మాయా భిక్షువైన వామనుడు బలికి ప్రాణ దానం చేయగలడా? చేయగలడో లేదో పోతనే చెప్తున్నాడు "ద్రిజగ్రద్రక్షామనున్ వామనున్" అంటూ – ముల్లోకాలకీ ప్రభువైన వామనుడు. పోతన ఏ సమయంలో వామనుణ్ణి సందర్భోచితంగా ఎలా సంభోదిస్తున్నాడో గమనిస్తున్నారా?

వ. వచ్చి యచ్చేడియతచ్చరణ సమీపంబునం బ్రణతయై నిలువంబడి యిట్లనియె. [8-655]

క. నీకుం గ్రీడార్థము లగు
లోకంబులఁ జూచి పరులు లోకులు కుమతుల్
లోకాధీశుల మందురు
లోకములకు రాజవీవ లోకస్తుత్యా! [8-656]

క. కా దనఁడు పొమ్ము లే దీ
రా దనఁడు జగత్త్ర యైక రాజ్యము నిచ్చెన్
నా దయితుఁ గట్టనేటికి?
శ్రీదయితాచిత్తచోర! శ్రితమందారా! [8-657]

అలా అడిగాక ఎందుకు విడిచిపెట్టాలో కూడా చెప్తోంది. లోకాలన్నీ నువ్వు ఆడుకునే ఆట స్థలాలు. త్రిలోకాలకీ నువ్వు రాజువు; కానీ తెలివిలేని వాళ్ళు కొంతకాలం అధికారం చేతిలోకి రాగానే నేనే రాజుని అంటూ ఉంటారు. నువ్వు అడిగినదానికి కాదనలేదు, లేదు  పొమ్మనలేదు. త్రిభువనాలూ సంతోషంగా ఇచ్చేసాడు. ఎలా ఇచ్చాడు మళ్ళీ? *సత్య పదవీ ప్రమాణ తత్పరుండును, వితరణ కుతూహల సత్త్వరుండును, విమల యశస్కుండును, దృఢ మనస్కుండును, నియతసత్యసంధుండును, నర్థిజన కమలబంధుండును*" అయ్యి ఇచ్చాడు. అటువంటి వాణ్ణి కట్టేయడం దేనికీ?

వ. అని యిట్లు వింధ్యావళియుం బ్రహ్లాదుండును విన్నవించు నవసరంబున హిరణ్యగర్భుండు చనుదెంచి యిట్లనియె.
[8-658]

సీ. భూతలోకేశ్వర! భూతభావన! దేవ! ;
దేవ! జగన్నాథ! దేవవంద్య!
తన సొమ్ము సకలంబుఁ దప్పక నీ కిచ్చె;
దండయోగ్యుఁడు గాడు దానపరుఁడుఁ;
గరుణింప నర్హుండు గమలలోచన! నీకు;
విడిపింపు మీతని వెరపు దీర;

తోయపూరము చల్లి దూర్వాంకురంబులఁ;
జేరి నీ పదము లర్చించునట్టి [8-659]

తే. భక్తియుక్తుఁడు లోకేశుపదము నందు
నీవు ప్రత్యక్షముగ వచ్చి నేఁడు వేఁడ
నెఱిఁగి తన రాజ్య మంతయు నిచ్చి నట్టి
బలికిఁ దగునయ్య! దృఢపాశబంధనంబు? [8-659.1]

వీళ్లందరినీ సమర్థిస్తూ ఇప్పుడు బ్రహ్మ చెప్తున్నాడు, "ఉన్నదంతా మాట తప్పక ఇచ్చాడు కదా, అటువంటివాడు కరుణింపదగినవాడు, దండ యోగ్యుడు కాడు. అదీకాక ఇచ్చినప్పుడు కాళ్ళుకడికగి నెత్తిమీద చల్లుకుని మరీ ఇచ్చాడు అంటే నీ భక్తుడన్నమాటే కదా? అటువంటి వాడ్ని కట్టేయడం తగునా?"

వ. అని పలికిన బ్రహ్మవచనంబులు విని భగవంతుం డిట్లనియె. [8-660]

సీ. ఎవ్వనిఁ గరుణింప నిచ్ఛయించితి వాని;
యఖిల విత్తంబు నే నపహరింతు
సంసార గురుమద స్తబ్ధుఁడై యెవ్వఁడు;
దెగడి లోకము నన్ను ధిక్కరించు
నతఁ డెల్ల కాలంబు నఖిల యోనుల యందుఁ;
బుట్టుచు దుర్గతిఁ బొందుఁ బిదప
విత్త వయో రూప విద్యా బలైశ్వర్య;
కర్మ జన్మంబుల గర్వ ముడిగి [8-661]

తే. యేక విధమున విమలుఁడై యెవ్వఁ డుండు
వాఁడు నా కూర్చి రక్షింపవలయువాఁడు;

స్తంభ లోభాభిమాన సంసార విభవ
మత్తుఁడై చెడ నొల్లఁడు మత్పరుండు. [8-661.1]

అలా అన్న బ్రహ్మ తో వామనుడు చెప్తున్నాడు. ఎవరినైతే కరుణించాలని చూస్తున్నానో ముందు వాడి సంపదలన్నీ తీసుకుని నా దరికి చేర్చుకుంటాను. భగవంతుడే లేడనీ, ఈ సంసారమే నిజం అనుకునేవాళ్ళు అలా జన్మ తర్వాత మరో జన్మ ఎత్తుతూ ఉండవల్సిందే. మరి ఈ విధంగా బల, మద, విద్యా గర్వం అన్నీ పోగొట్టుకున్నాక నా దగ్గిరకి వచ్చేవాణ్ణి రక్షించవద్దూ మరో సారి సంసారంలో పడకుండా? అందుకే అలా నాకు దగ్గిరగా ఉండేలాగ బంధించవల్సి వచ్చింది. అటువంటివాడు మరోసారి సంసారంలో పడడానికి ఒప్పుకోడు. ఇక్కడ సంసారం అంటే భార్యా, పిల్లలూ అనేది కాదనీ, జన్మ తర్వాత మరో జన్మ ఎత్తుతూ అనేకానేక కష్టాలు పడడమే అనీ గ్రహించాలి.

దీన్నే అంతకుముందు వ్యాసాల్లో చూసాం. బ్రహ్మ జ్ఞానం కావాలంటే సన్యసించి తీరాలి. అందుకే 'ఎవ్వనిఁ గరుణింప నిచ్చయించితి వాని యఖిల విత్తంబు నే నపహరింతు' అని చెప్పడం. దీనినే ఇంకో విధంగా, మన కాలానికి అణుగుణంగా కూడా చెప్పుకోవచ్చు. భగవంతుణ్ణి చేరుకోవడానికి అనేకానేక మార్గాలు ఉండి ఉండొచ్చు. కానీ ఏ మార్గం చూసినా అది పదునైన కత్తి అంచుమీద నడవడం వంటిది అనేది అందరూ ఒప్పుకునే మాట. ఏకాగ్రతతో నడవకపోతే ఏమౌతుంది? మరి ఈ ఏకాగ్రత ఎలా కుదురుతుంది అన్నీ వదులుకోలేకపోతే? అంటే ఏ పనైనా చేసేటప్పుడు ఇంక దేని గురించీ ఆలోచించకుండా పనిచేయాలి కదా? బ్రహ్మ జ్ఞానం సంపాదించే దారి ఎటువంటిది? రెండు అంచులూ పదునుగా ఉన్న కత్తి వంటి అత్యంత కష్టమైనది. మరి ఈ దారిలో ఎంత ఏకాగ్రత ఉండాలి? చుట్టూరా రకరకాల వ్యాపకాలు పెట్టుకుంటే ఎలా పురోగమించగలం? అదే పెద్ద పెద్ద ఆచార్యులు చెప్తూ ఉంటారు, ఒక పని చేసేటప్పుడు అందులో మంచి పురోగతి సాధించాలంటే మరింకేమీ ఆలోచించకూడదూ అని. దీన్నే మన వివేకానంద గారు చెప్పడం ప్రకారం, "ఒక ధ్యేయాన్ని నిర్ణయించుకోండి. దాని గురించే ఆలోచిస్తూ, కలలు కంటూ బతకండి. అదే ధ్యేయం మీ నరనరాల్లో, మెదడులో, హృదయంలో, ప్రతీ అవయవంలో నింపుకోండి. మరే ఇతర ఆలోచనలూ పెట్టుకోవద్దు. ఇదే ఖచ్చితంగా ఆ ధ్యేయాన్ని జేరుకునే దారి."

ఇంతా చెప్పాక, ఇంతటి దానాన్ని ఇచ్చిన బలి చక్రవర్తినీ, అతని దానాన్నీ మహా విష్ణువు ఎలా గణించాడో, బలిని ఎక్కడ, ఎందుకు ఉండమంటాడో ముందు చూద్దాం.

బలి సుతలాగమనం; వామనావతారం – 17

ఇప్పటివరకూ మహా విష్ణువు బలి గురించి ఏమనుకుంటున్నాడో మనకి చూచాయగా మాత్రమే తెలుసు. ఇప్పుడు బ్రహ్మ, ప్రహ్లాదుడూ వచ్చారు కనక వాళ్ళతో కూడా చెప్తున్నాడు బలి ఎంతటివాడో

శా. బద్ధుండై గురుశాపతప్తుఁడయి తా బంధుప్రజత్యక్తుఁడై
సిద్ధైశ్వర్యముఁ గోలుపోయి విభవక్షీణుండునై పేదయై
శుద్ధత్వంబును సత్యముం గరుణయున్ సొంపేమియుం దప్పఁ డు
ద్బుద్ధుండై యజయాఖ్యమాయ గెలిచెం బుణ్యుం డితం డల్పుఁడే. [8-662]

బంధించబడ్డాడు, గురువు శాపానికి గురైయ్యాడు. ఉన్న అధికారం సంపదలూ అన్నీ పోగొట్టుకున్నాడు, బంధువులందర్నీ కూడా వదులుకున్నాడు ఈ దానం ఇవ్వడం కోసం. అయినా సరే సత్యాన్నీ దయా గుణాన్నీ వదులుకోలేదు. ఎంతో కష్టమైన, గెలవడానికి సాధ్యం కానీ మాయను గెలిచాడు. అంతటి పుణ్యాత్ముడైన ఈ బలి చక్రవర్తి తగిన వాళ్ళు ఇంకెవరున్నారు?

ఆ. అసురనాథుఁ డనుచు నసఘుని మర్యాద
యేను జూత మనుచు నింత వలుక
నిజము పలికె నితఁడు నిర్మలాచారుండు
మేలుమేలు నాకు మెచ్చువచ్చు. [8-663]

మరి హిరణ్యకశిపుణ్ణి చంపినట్టూ బలిని చంపలేదని అడుగుతారేమో అని చెప్తున్నాడు ఇప్పుడు. ఈ బలి చక్రవర్తి చేసే పనులవల్ల (అంటే దానాల వల్ల) పుణ్యాత్ముడైన రాక్షసేశ్వరుడిగా ఆదరిద్దామని ఇంతకాలం ఆగాను. ఎన్ని కష్టాలు వచ్చినా సత్యాన్ని వీడలేదు. నిర్మలత్వం వదులుకోలేదు. ఇప్పుడు నా మెప్పు సంపాదించాడు.

క. సావర్ణి మనువు వేళను
దేవేంద్రుండగు నితండు దేవతలకు; దు
ర్భావిత మగు నా చోటికి
రావించెద; నంతమీఁద రక్షింతు దయన్. [8-664]

రాబోయే రోజుల్లో, సావర్ణి మనువు అయినప్పుడు ఈ బలి చక్రవర్తి ఇంద్రపదవిలో ఉంటాడు. ఊహించడానికి వీలుకాని ఆ పదవిలో కూర్చోడానికి నేనే పిలుస్తాను అప్పుడు. అప్పటివరకూ నా రక్షణలోనే ఉంటాడు. అంటే మొదట్లో చెప్పుకున్నట్టూ, నూరు అశ్వమేధాలు చేస్తే ఇంద్రుడవడం నిజమే కానీ వెంఠనే అప్పటికిప్పుడు అయిపోవడం కుదరదు. అదేం అంటే, మరి ఇప్పుడున్న ఇంద్రుడి పదవీ కాలం పూర్తి కావొద్దూ? అందుకే అలా వేచి ఉండాలి. మరి అప్పటిదాకా ఏం చేయాలి? పూర్తిగా దానం ఇచ్చేసిన రాజ్యం తనది కాదు. అక్కడ రాజ్యం చేయడం కుదరదు; ఎందుకంటే అసలు ఈ దానం అడగడం దేవతలకి రాజ్యం ఇవ్వడానికి. అంటే ఇప్పుడు బలికి మరో చోటు చూపించాలి. ఆచోటులో తాను అహర్నిశలూ బలిని రక్షించగలగాలి మాట ఇచ్చిన ప్రకారం.

క. వ్యాధులుఁ దప్పులు నొప్పులు
బాధలుఁ జెడి విశ్వకర్మభావిత దనుజా
రాధిత సుతలాలయమున
నేధిత విభవమున నుండు నితఁ డందాకన్. [8-665]

రోగాలూ, శ్రమలూ, ఆపదలూ, దుఃఖాలు లేని విశ్వకర్మ నిర్మించిన సుతలంలో అప్పటివరకూ అష్టైశ్వర్యాలతో ఉంటాడు, అసురలతో సేవలు అందుకుంటూ. ఇంత చెప్పాక దానం ఇచ్చిన బలి చక్రవర్తి తో చెప్తున్నాడు ప్రత్యక్షంగా.

వ. అని పలికి బలిం జూచి భగవంతుం డి ట్లనియె. [8-666]

సీ. సేమంబు నీ కింద్రసేన మహారాజ! ;
వెఱవకు మేలు నీ వితరణంబు;
వేలుపు లం దుండ వేడుక పడుదురు;
దుఃఖంబు లిడుములు దుర్మరణము
లాతురతలు నొప్పు లందుండు వారికి;
నొందవు సుతల మందుండు నీవు;
నీ వంపు జేయని నిర్జరారాతుల;
నా చక్ర మేతెంచి నఱకుచుండు; [8-667]

ఆ. లోకపాలకులకు లోనుగా వక్కడ
నన్యు లెంతవార లచట? నిన్ను
నెల్ల ప్రొద్దు వచ్చి యేను రక్షింతెదఁ
గరుణతోడ నీకుఁ గానవత్తు. [8-667.1]

ఇప్పుడు అహంకారం అన్నీ పోయాయి కనక భగవంతుడు ఏమంటున్నాడు భక్తుణ్ణి? “ఇంద్రసేన మహారాజా!” నీకు క్షేమం. భయం లేదు. నువ్వు ఇచ్చిన దానం అతి శ్రేష్టమైంది. సుతలంలో ఉండడానికి దేవతలు సైతం కుతూహలం పడుతూ ఉంటారు. ఆకలి దప్పులూ, రోగాలు లేని ఆ లోకంలో నువ్వు ఉందువుగాని. నీకెవరైనా కీడు చేస్తే వాళ్ళని శిక్షించడానికి నేను నా చక్రాయుధం సిద్ధంగా ఉంటాము. సర్వవేళలా నీకు కనిపిస్తూ ఉంటాను.

మొదటి వాక్యం ఏమిటీ పద్యంలో? “సేమంబు నీ కింద్రసేన మహారాజ!” దీన్ని గమనిస్తే ఏమర్థమౌతోంది మనకి? మొదటినుండీ కూడా విష్ణువు బలి చక్రవర్తిని సన్మార్గంలో (భక్తపాలన కళాసంరంభకున్, దానవోద్రేక స్థంభకు) ఉంచడానికే చూస్తున్నాడని కదా? అదీకాక మొదట్లో యజ్ఞవాటికలోకి వస్తూ బలికి వామనుడిచ్చిన ఆశీర్వచనం ఓ సారి గుర్తు తెచ్చుకుంటే ఏమన్నాడు వస్తూనే? “స్వస్తి జగత్రయీభువన..” వస్తూనే స్వస్తి వాచకం ఇచ్చాడు. బ్రహ్మాండమైన కార్యదక్షత కలిగిన బలి అది గ్రహించాడు కనకే మనసులోకి కల్మషం రాకుండా అడిగినది ఇచ్చేసాడు. కానీ ఇక్కడ గుర్తు పెట్టుకోవల్సింది ఏమిటంటే, వచ్చినవాడు భగవంతుడో కాదో తెలుసుకోవడం ఎలా? అది అందరికీ అంత సులభంగా

తెలిసేది కాదు కదా? అందుకే ఇచ్చేటప్పుడు ఒళ్ళు జాగ్రత్తగా పెట్టుకోవడం, అహంకారం అడ్డురాకుండా చూసుకోవడం అనేవి ముఖ్యం. దీనినే బైబిల్ లో చెప్తున్నారు చూడండి.

"Do not neglect to show hospitality to strangers, for thereby some have served angels unawares" – Hebrews 13:2.

క. దానవ దైత్యుల సంగతిఁ
బూనిన నీ యసురభావమును దోడ్తో మ
ద్ధ్యానమునఁ దలఁగి పోవును
మానుగ సుతలమున నుండుమా మా యాజ్ఞన్. [8-668]

ఓ సారి నూరు అశ్వమేధాలు చేయగానే ఇంద్రపదవికి అర్హత వస్తుంది సరే కానీ వెను వెంఠనే ఇంద్రుడైపోవడం కుదరదు. ఉన్న అసుర భావాలు పూర్తిగా పోవాలి. అవెలా పోతాయి? అదే చెప్తున్నాడు ఈ పద్యంలో, "మద్ధ్యానమున దలగిపోవు" అదేపనిగా దానవదైత్యులతో కలిసి ఉండడం వల్ల అంటుకున్న అసుర భావాలు పోవాలంటే సత్సంగం, భగవద్యానం తప్పనిసరి. అంటే మంచి ఆలోచనలు రావాలంటే చెడు వదుల్చుకోవాలి. దానికే ఈ ధ్యానం అనేది. ఈ ధ్యానం కోసం సావర్ణి మనువు కాలం దాకా సుతలంలో ఉండమని చెప్తున్నాడు. బ్రహ్మ జ్ఞానం అనే దారి ఎంత కష్టమైనదో ఇప్పుడు తెలుస్తోంది కదా? నూరు అశ్వమేధాలు చేసినా అంత సులభం కాదు. కానీ సాధ్యమే.

వ. అని యిట్లు పలుకుచున్న ముమ్మూర్తుల ముదుకవేల్పు తియ్యని నెయ్యంపుఁ బలుకుఁ జెఱకు రసంపుసోనలు వీనుల తెరువులం జొచ్చి లోను బయలు నిండి ఱెప్పల కప్పు దప్పం ద్రోచికొని కనుఁ గవ కొలంకుల నలుగులు వెడలిన చందంబున సంతసంబునం గన్నీరు మున్నీరై పఱవ, నురః ఫలకంబునం బులకంబులు కులకం బులయి తిలకంబు లొత్తఁ, గేలు మొగిడ్చి నెక్కొన్న వేడుకం ద్రొక్కుడు పడుచుఁ జిక్కని చిత్తంబునఁ జక్కని మాటల రక్కసుల ఱేఁ డిట్లనియె. [8-669]

ఇలా విష్ణువు అనేసరికి బలికి సంతోషమైంది – తాను చేసినపనికి భగవంతుడి ఒప్పుకోలు లభించింది అని తెలియగానే. మనసులో సంతోషం నిండిపోగా ఇప్పుడు చెప్తున్నాడు.

ఉ. ఎన్నఁడు లోకపాలకుల నీ కృపఁ జూడని నీవు నేఁడు న
న్నున్నతుఁ జేసి నా బ్రతుకు నోజయు నానతి యిచ్చి కాచి తీ
మన్నన లీ దయారసము మాటలు పెద్దఱికంబుఁ జాలవే?
పన్నగతల్ప! నిన్నెఱిఁగి పట్టిన నాపదఁ గల్గనేర్చునే? [8-670]

ఎప్పుడూ దిక్పాలకుల మీద కూడా ఇటువంటి దయ చూపించినట్టు కనిపించదు. కానీ ఈ రోజు నన్ను కరుణించడానికి స్వయానా వచ్చావంటే అది నా జన్మకి చాలదా? నిన్ను ఆశ్రయించినవారికి ఏం ఆపదలు వస్తాయి?

వ. అని పలికి హరికి నమస్కరించి బ్రహ్మకుం బ్రణామంబు జేసి, యిందు ధరునకు వందనం బాచరించి, బంధవిముక్తుండై తన వారలతోఁ జేరికొని బలి సుతలంబునకుం జనియె; నంత హరి కృపావశంబునం గృతార్థుండై కులోద్ధారకుం డయిన మనుమనిం గని సంతోషించి ప్రహ్లాదుండు భగవంతున కిట్లనియె. [8-671]

ఇలా అని అందరితోటీ బలి సుతలానికి వెళ్ళాడు. అప్పుడు శ్రీహరి వల్ల కృతార్థుడైన మనుమణ్ణి చూసి సంతోషించి ప్రహ్లాదుడు అంటున్నాడు. ఒక విషయం గమనించాలి ఇక్కడ. హిరణ్యకశిపుణ్ణి చంపేసాక విష్ణువు ప్రహ్లాదుడితో నీ వల్ల నీ తండ్రీ, “త్రిశప్త పూర్వజులుం..” కూడా సద్గతి పొందారు అని చెప్పడం చూసాం. అలాగే తర్వాతి తరాలు కూడా వృద్ధి పొందుతాయి కదా? ప్రహ్లాదుడి కొడుకు విరోచనుడు దేవతలు అడిగితే తన ఆయువునీ, దేహాన్ని ఇచ్చాడని చెప్పుకున్నాం. బలి కూడా అంతకన్నా గొప్పవాడే. అంటే ప్రహ్లాదుడినుంచీ కూడా తరం నుంచి మరో తరానికి రాక్షసులైనా సన్మార్గంలోకి మారుతున్నారు. ఎందువల్ల? భగవద్దర్శనం వల్ల అనే చెప్పుకోవచ్చు. మనుమడు తనంతటివాడని తెలిసింది కనక ప్రహ్లాదుడికి సంతోషం కలిగింది – కులాన్ని ఉద్ధరించే బలి అంతటి మనుమడు కలిగినందుకూ, జీవితంలో కృతార్థుడైనందుకూ.

సీ. చతురాననుఁడు నీ ప్రసాదంబు గానఁడు;
శర్వుఁడీ లక్ష్ముల జాడఁ బొందఁ,
డన్యుల కెక్కడి? దసురులకును మాకు;
బ్రహ్మాదిపూజితపదుఁడ వయిన
దుర్లభుండవు నీవు దుర్గపాలుఁడ వైతి;
పద్మజాదులు భవత్పాదపద్మ
మకరంద సేవన మహిమ నైశ్వర్యంబు;
లందిరి కాక యే మల్పమతుల [8-672]

తే. మధిక దుర్యోనులము కుత్సితాత్మకులము
నీకృపాదృష్టిమార్గంబు నెలవు చేర
నేమి తప మాచరించితి మెన్నఁగలమె?
మమ్ముఁ గాచుట చిత్రంబు మంగళాత్మ! [8-672.1]

బ్రహ్మదేవుడికి కానీ శివుడికికానీ నీ అనుగ్రహం కలగదే అటువంటప్పుడు మిగతావాళ్ళ మాట దేనికీ? అయినా రాక్షసులమూ అల్ప బుద్ధులమూ అయిన మా మీద నీకు మామీద దయ కలిగిందంటే విచిత్రమే కదా?

ఆ. సర్వగతుఁడ వయ్యు సమదర్శనుఁడ వయ్యు
నొకట విషమవృత్తి నుందు దరయ
నిచ్ఛలేనివారి కీవు భక్తులు గోరు
తలఁపు లిత్తు కల్పతరువు మాడ్కి. [8-674]

అన్నిచోట్లా ఉండేవాడివీ, అందరినీ సమదృష్టితో చూసేవాడివీ అయినప్పటికీ ఒక్కోసారి ఒకరిమీద పక్షపాతం చూపుతున్నట్టూ అనిపిస్తూ ఉంటుంది. భక్తుల కోరికలు తీరుస్తూ ఉంటావు. అది అంత సులభంగా అర్ధమవదు.

ఈ "భగవంతుడి కరుణ" అనే విషయం మీద ఒక చిన్న కథ చెప్పుకుందాం. పౌండ్రక వాసుదేవుడనేవాడు కాశీ రాజ్యాన్ని పరిపాలిస్తూ తానే వాసుదేవుణ్ణనీ, విష్ణువు అవతారమనీ నమ్మి శంఖ చక్రాల ముద్రలు వేయించుకున్నాట్ట. కృష్ణుడి సంగతి తెలిసి "ఏమోయ్, నేను ఇక్కడ మహావిష్ణువు అవతారాన్ని ఉండగా నువ్వు కూడా అలా శంఖ చక్రాలు ఉంచుకున్నావు. అవన్నీ తీసేయి లేకపోతే నాతో యుద్ధానికి వచ్చి చావ వచ్చు" అని కృష్ణుడికి సందేశం పంపిచాట్ట. అది విని కృష్ణుడు నవ్వుకుని యుద్ధానికి పోయి వాడు వేయించుకున్న శంఖ చక్రాల గుర్తులూ అవీ చూసి నవ్వి వాణ్ణి యుద్ధంలో చంపాక వాడికి తెలిసి వచ్చింది అసలు విష్ణువెవరో. అయితే ఇలా చంపబడిన పౌండ్రక వాసుదేవుడికి కూడా, శిశుపాలుడికి కలిగినట్టే మోక్షం లభించింది. ఇదేమిటి, ముప్పొద్దులా భగవంతుణ్ణి తిట్టేవాళ్ళకి మోక్షం అంటే, మానవ జన్మ ఎత్తిన మనకి అర్ధంకావడానికి కష్టం. ఎందుకంటే, మోక్షం అనేది అనేకానేక జన్మల ఫలితం. ఒక్కో మెట్టూ ఎక్కుతూ ఏ దశలో ఎవరు ఉన్నారో తెలుసుకోవడం మనకి కష్టం కదా? దీనినే ప్రహ్లాదుడు అంటున్నాడు – ఒక్కోసారి కొంతమంది కోరికలు తీరుస్తూ వాళ్ళ మీద పక్షపాతం చూపిస్తున్నట్టు ఉంటావు. కొంతమంది కోరికలు తీర్చవు. దీనికేమిటి కారణం? దాన్నే కర్మ ఫలితం అనడం. ఒక జన్మలో చేసిన పనులన్నింటికీ ఫలితం అదే జన్మలో రావడం – మానవ జన్మ అనేది కొంత ఆయుర్దాయం తో కూడినప్పటిది కనక - కుదరకపోవచ్చు కదా? చేసిన కర్మలు ఎక్కువా ఆయుర్దాయం తక్కువాను; మరి కర్మలు చేస్తూ ఉంటే వాటిని మూటకట్టుకుంటూ వాటి ఫలితాలు అనుభవించడం ఎలా? దానికోసమే మరో జన్మ ఎత్తడం. ఆ జన్మలో చేసుకున్న కర్మల వల్ల మరో జన్మ. ఇలా పురరపి మరణం, పునరపి జననం అప్రతిహతంగా సాగుతోంది. అయితే ఎవరు ఏ జన్మలో ఏ మంచి, చెడ్డ కర్మలు చేసారో ఎవరు చెప్పగలరు? మనకి తెలియవుకానీ అన్నీ గమనించే, అన్నిచోట్లా ఉండేవాడికీ అందరినీ సమదృష్టితో చూసేవాడికీ తెలుస్తూనే ఉంటాయి. దీన్నే నారాయణీయంలో భట్టాత్తిరిగారు శ్లోకంలో చెప్తున్నారు.

జాడ్యేన బాలకగిరాపి కిలాహమేవ
శ్రీవాసుదేవ ఇతి రూఢమతి శ్చిరం సః
సాయుజ్యమేవ భవదైక్యధియాగతోభూత్
కోనామ కస్య సుకృతం కథమిత్యవేయాత్ (నారాయణీయం 83-5)

జాడ్యం చేత నేనే వాసుదేవుణ్ణి అని ఎగిసిపడి మనసులో చేసిన స్వారూప్య భావన చేతన తోనే పౌండ్రకవాసుదేవుడు నీ సాయుజ్య సిద్ధి సంపాదించగలిగాడు. స్వామీ, లోకంలో ఏ జీవి ఏం పుణ్యం చేసుకుందో చెప్పడం ఎవరితరం?

ఇదంతా మనం వామనావతారంలో చూడవచ్చు.  అలాగే అతి క్రూరమైన హిరణ్యకశిపుడికి ప్రహ్లాదుడంతటివాడు పుట్టడం అవీను.

మరి ఈ కర్మ గురించీ రాబోయే జన్మల గురించీ తెలుసుకోవడం ఎలా? అది తెలిస్తే కాస్త జీవితం సులభంగా ఉంటుందేమో? దీనికి రామకృష్ణుల సమాధానం వింటే తెలుస్తుంది ఎలాగో – "మనకీ జన్మ ఎందుకు కలిగిందో తెలుసుకోవడం ఎందుకు? దానివల్ల మనకి వచ్చే ఉపయోగం ఏమిటి? మనం మామిడితోటలోకి వెళ్ళింది పళ్ళు తినడానికి. ఎన్ని చెట్లున్నాయి, ఒక్కో చెట్టుకీ ఎన్ని ఆకులున్నాయి అనేది చూస్తూ కూర్చుంటే ఏమిటి ఉపయోగం?" అందుకే ప్రస్తుతం మనం చేగలిగింది ఏమిటంటే, మనకీ జన్మ వచ్చినందుకు భగవంతుడికి కృతార్ధులమై ఉండడం, మరో జన్మ రాకుండా ఉండడానికి భగవధ్యానం చేసుకోవడమూను.  మనం చేసేవన్నీ మంచి కర్మలైనప్పుడు, ఫలితాలు చూసుకునే పనిలేదు. వాటికవే సర్దుకుంటాయి.

ఇంకో విషయం ఏమిటంటే "మేము ఇంతటి కరుణకి పాత్రులవడం, మమ్ముఁ గాచుట చిత్రంబు మంగళాత్మ" అన్న ప్రహ్లాదుడు విష్ణువుని, నా మనవడు క్రితం జన్మలో ఎవరూ, ఏం చేసి ఇలా పుట్టాడు అవన్నీ చెప్పు అని విష్ణువుని అడిగాడా? అంటే, తోటలో మామిడి చెట్లు ఎన్ని, ఎన్ని ఆకులున్నాయి అనే చెత్త ప్రశ్నలు అడగట్లేదు. అవన్నీఅనవసరం. సరిగ్గా అదే శ్రీరామకృష్ణ పరమహంస చెప్పినది.

వ. అని విన్నవించుచున్న ప్రహ్లాదుం జూచి పరమ పురుషుం డిట్లనియె. [8-675]

తే. వత్స! ప్రహ్లాద! మేలు నీ వారు నీవు
సొరిది మనుమనిఁ దోడ్కొని సుతలమునకుఁ
బయనమై పొమ్ము నే గదాపాణి నగుచుఁ
జేరి రక్షింప దురితంబు చెంద దచట. [8-676]

ఇలా అన్న ప్రహ్లాదుడితో భగవంతుడు చెప్తున్నాడు – మనుమడితో పాటు సుతలానికి వెళ్ళండి. నేనక్కడ గదాపాణినై మిమ్మల్ని సదా రక్షించడానికి వస్తున్నాను.

దానం పూర్తైపోయింది. లోకాలన్నింటినీ దేవేంద్రుడికీ, దేవతలకీ ఇవ్వాలి. అదో పెద్ద పనికాదు కానీ బలి చేస్తున్న యాగం ఇంకా పూర్తి కాలేదు. దాన్ని అలా వదిలేయవచ్చా? ముందు ముందు మిగిలిపోయిన యాగం గురించీ, వామనావతారం ముగింపూ చూద్దాం.

వామనావతారం, ముగింపు – 18

ఇంతవరకూ వచ్చాం కనక ఇప్పుడు మిగిలిన యాగం కూడా పూర్తి చేయాలి. బలి సుతలానికి వెళ్ళాడు, ప్రహ్లాదుడూ వెళ్ళడానికి సిద్ధంగా ఉన్నాడు. యాగం ఎవరో, ఏదో విధంగా చేయాలి కదా?

వ. అని యిట్లు నియమించినం బరమేశ్వరునకు నమస్కరించి వలగొని కరకమల పుట ఘటిత నిటల తటుండయి, వీడ్కొని, బలిం దోడ్కొని సక లాసురయూథంబునుం దాను నొక్క మహాబిలద్వారంబు చొచ్చి ప్రహ్లాదుండు సుతల లోకంబునకుం జనియె; నంత బ్రహ్మవాదు లయిన యాజకుల సభామధ్యంబునం గూర్చున్న శుక్రునిం జూచి నారాయణుం డి ట్లనియె. [8-677]

మరింక ఎవరు పూర్తి చేసేది? వామనుడు అదే చెప్తున్నాడు శుక్రాచార్యులతో.

ఆ. ఏమిఁ గొఱత పడియె నీతని జన్నంబు
విస్తరింపు కడమ విప్రవర్య!
విషమ మయిన కర్మ విసరంబు బ్రాహ్మణ
జనులు చూచినంత సమతఁ బొందు. [8-678]

ఈ మిగిలిన యజ్ఞం మీరు పూర్తి చేయండి. అది అలా ఆగిపోకూడదు మధ్యలో. మీ వంటి బ్రహ్మ వేత్తలవల్ల అది సఫలం కావాలి అని. బలి దానం ఇచ్చేటప్పుడు కలశంలోంచి నీళ్ళు పడకుండా శుక్రాచార్యులు అడ్డుకున్నప్పుడు వామనుడు దర్భతో ఆయనకి ఒక కన్ను పోగొట్టాడు కదా? అప్పుడు ఒక కన్ను మాత్రమే ఎందుకు పోయింది, రెండూ పోవచ్చుగా అనే ధర్మ సందేహానికి ఇక్కడ సమాధానం దొరుకుతుంది. ఎందుకంటే మధ్యలో ఆగిపోయిన యజ్ఞం పూర్తి చేయడానికి. అందుకే ఒక కన్ను మిగిల్చినది. ఇదంతా — బలిని దానం అడగడం, శుక్రాచార్యులకి ఒక కన్ను మిగల్చడం, బలిని సుతలం లో ఉండమనడం – చూస్తే మొదటినుండీ ఎంతో జాగ్రత్తగా ఒక పథకం ప్రకారం జరిగినట్టూ మనకి అర్థం అవుతుంది. ఆ పథకాన్నే కర్మ అంటున్నాము. అది ఎవరూ తప్పించుకోలేనిది.

చిన్న సరదా ప్రశ్న తెలుగు అంటే ఇష్టం ఉన్న నా లాంటి వాళ్ళకి. పై పద్యంలో యజ్ఞం, యాగం అనే పదం ఎక్కడుందో చెప్పగలరా? (జన్నంబు)

సీ. అఖిల కర్మంబుల కధినాథుఁడవు నీవ;
యజ్ఞేశుఁడవు నీవ యజ్ఞపురుష!
ప్రత్యక్షమున నీవు పరితుష్టి నొందినఁ;
గడ మేలఁ కల్గు నే కర్మములకు?
ధనదేశకాలార్హతంత్రమంత్రంబులఁ;
గొఱఁతలు నిన్నుఁ బేర్కొనిన మాను;
నయినఁ గావింతు నీ యానతి భవదాజ్ఞ;
మెలఁగుట జనులకు మేలుఁ గాదె? [8-680]

తే. యింతకంటెను శుభము నా కెచటఁ గలుగు
ననుచు హరిపంపు శిరమున నావహించి
కావ్యుఁ డసురేంద్రు జన్నంబు కడమఁ దీర్చె
మునులు విప్రులు సాహాయ్యమునఁ జరింప. [8-680.1]

ఆలా చెప్పిన విష్ణువుతో శుక్రాచార్యులు అంటున్నాడు. నువ్వే యజ్ఞాలకి అధికారివీ, ప్రపంచంలో జరిగే కర్మలకన్నింటికీ సాక్షీభూతుడవీను. నిన్ను తృప్తి పరుస్తే వేరే ఇంకేమీ చేయక్కర్లేదు. నీవు చెప్పినట్టూ అలాగే చేస్తాను. అలా అని యజ్ఞాన్ని పూర్తి చేసాడు, అక్కడే ఉన్న మునులూ విప్రుల సహాయంతో.

వ. ఇవ్విధంబున వామనుండయి హరి బలి నడిగి, మహిం బరిగ్రహించి, తనకు నగ్రజుండగు నమరేంద్రునకుం ద్రిదివంబు సదయుం డయి యొసంగె; న త్తరి దక్ష భృగు ప్రముఖ ప్రజాపతులును, భవుండును, గుమారుండును, దేవర్షి, పితృగణంబులును, రాజులును, దానును గూడికొని చతురాననుండు గశ్యపునకు నదితికి సంతోషంబుగా లోకంబులకు

లోకపాలురకు "వామనుండు వల్లభుం" డని నియమించి యంత ధర్మంబునకు యశంబునకు లక్ష్మికి శుభంబులకు దేవతలకు వేదంబులకు వ్రతంబులకు స్వర్గాపవర్గంబులకు "నుపేంద్రుండు ప్రధానుం" డని సంకల్పించె నా సమయంబున.

[8-681]

ఆ విధంగా ఇంద్రుడికి మళ్ళీ దేవతలమీద అధిపత్యం, సింహాసనం కలిగాయి. ఇదంతా విన్నాక అదితికీ కశ్యపుడికీ సంతోషం వేసింది – కొడుకు చేస్తానని చెప్పినపని చేసిపెట్టినందుకు. అప్పుడు, అన్ని శుభాలకీ, దేవతలకీ, వేదాలకీ, వ్రతాలకీ, ధర్మానికీ, కీర్తి సంపదలకీ, స్వర్గానికీ, మోక్షానికీ వామనుడే అధికారి అని నిశ్చయించారు. మనం ఆచమనం చేసేటప్పుడు వామనుణ్ణి స్మరించడం గమనించవచ్చు. " ... ఓం విష్ణవే, మధుసూధన, త్రివిక్రమ, వామన, శ్రీధర, హృషీకేశ, పద్మనాభ, దామోదర, సంకర్షణ, వాసుదేవ, ప్రద్యుమ్న, అనిరుద్ధ, పురుషోత్తమ, అధోక్షజ, నారసింహ, అచ్యుత, జనార్ధన, ఉపేంద్ర, హరి, శ్రీకృష్ణాయ నమ:"

క. కమలజుఁడు లోకపాలురు
నమరేంద్రునిఁగూడి దేవయానంబున న
య్యమరావతికిని వామను
నమరం గొనిపోయి రంత నట మీఁద నృపా! [8-682]

బ్రహ్మ, దిక్పాలకులూ వామనుణ్ణి అమరావతికి తీసుకెళ్ళారు. అవతారం పూరి అయ్యి ఇక్కడదాకా వచ్చాము కనక ఇప్పుడు పద్యంలో శుకమహర్షి, పరీక్షిత్తుతో చెప్తున్నట్టు "నృపా" అంటున్నాడు పోతన. మొదట్లో ఇదంతా శుకమహర్షి ధర్మరాజు మనవడికి కథ చెప్పడం తో మొదలైంది కదా?

ఆ. బల్లిదంపుదోడు ప్రాపున నింద్రుని
కింద్రపదము చేరు టిట్లు గలిగెఁ;
దనకు నాధ్యుఁడైన తమ్ముఁడుఁ గలిగినఁ
గోర్కులన్న కేల కొఱంత నొందు? [8-683]

ఇంకా శుకమహర్షి అంటున్నాడు – అలా తమ్ముడి మంచితనంతో ఇంద్రుడికి మళ్ళీ రాజ్యం వచ్చింది. మంచి దక్షుడైన తమ్ముడు ఉంటే అన్నగారి కోరికలు తీరడం అంత కష్టం కాదు కదా? ఇక్కడ మనం గుర్తు ఉంచుకోవలసింది ఏమిటంటే, ఇంద్రుడు సింహాసనం కోసమూ, బలి మరో ప్రయోజనం ఆశించో వాళ్ళ వాళ్ల కర్మలు మొదలుపెట్టారు. కానీ వీళ్ళందరికన్నా మరో మెట్టు పైనున్న భగవంతుడు ఎవరికి ఇవ్వాల్సింది వాళ్ళ వాళ్ళ కర్మల ద్వారా ఇచ్చి రాబోయే ఇంద్రుణ్ణీ, ప్రస్తుతానికున్న ఇంద్రుణ్ణి వారి వారి స్థలాల్లో కూర్చోపెట్టాడు. అదే చూచాయగా భట్టాత్తిరి గారు, "కోనామ కస్య సుకృతం కథమిత్యవేయాత్" అన్నది.

క. పాలడుగఁడు మే లడుగం
డేలఁడు బిక్షించి యన్నకిచ్చెఁ ద్రిజగమున్
వేలుపులతల్లి కడపటి
చూలుం బోలంగఁ గలరె సొలయని తమ్ముల్. [8-684]

ఆ. కడుపు బదరగాఁగ గొడుకులఁ గనుకంటె
దల్లి కొకఁడె చాలు బల్లిదుండు;
త్రిదశగణముఁ గన్న యదితి గానుపు దీఱఁ
జిన్ని మేటివడుగుఁ గన్న యట్లు. [8-685]

ఇంతా చెప్పాక మరో విషయం గుర్తు చేస్తున్నాడు పోతన – వామనుడు బలిని దానం అడిగి అందులో ఇంత నాకు కావాలి, పోనీ ఇది నీకు ఇచ్చాను కనకు దానికి బదులుగా నాకు మరొకటి ఇయ్యి అని వాటా గాని, లాభం గానీ అడగలేదు. అటువంటి తమ్ములు ఉండగలరా? అలాగే అదితికి పుట్టిన ఆ చిన్నవడుగే అదృష్టం పండినట్టు పుట్టాడు. అలాంటివాడు పుట్టడం – కడుపు పగిలేటట్టూ పదిమంది పనికిరాని కొడుకులు పుట్టడం కంటే – మంచిది కదా?

తే. మనుజనాథ! త్రివిక్రము మహిమ కొలఁది
యెఱుఁగఁ దర్కింప లెక్కింప నెవ్వఁడోపుఁ?
గుంభినీ రేణుకణములు గుఱుతు పెట్టు
వాఁడు నేరఁడు; తక్కిన వారి వశమె? [8-687]

క. అద్భుత వర్తనుఁడగు హరి
సద్భావితమైన విమలచరితము వినువాఁ
డుద్భట విక్రముఁడై తుది
నుద్భాసితలీలఁ బొందు నుత్తమ గతులన్. [8-688]

ఈ ఒళ్ళు గగుర్పొడిచే కథంతా చెప్పాక విష్ణువు గురించి మరోసారి గుర్తు చేస్తున్నాడు శుకమహర్షి వారం రోజుల లోపుల ప్రాణాలు పోగొట్టుకోబోయే పరీక్షిత్తుకి – భూమ్మీద ఉన్న ధూళి రేణువులెన్ని ఉన్నాయో లెక్కపెట్టడం సాధ్యం కావచ్చు గానీ వామనుడి త్రివిక్రమ మహిమ వివరించడం సాధ్యమౌతుందా?

దీనినే ఆత్మని దర్శించిన జ్ఞానులు చెప్పడం మనం వింటూ ఉంటాం. రామకృష్ణ పరమహంస కూడా ఇదే అనేకానేక సార్లు చెప్పడం చూడవచ్చు – ఆత్మని దర్శించినవాడు నేను చూసాను అనలేడు అంటారు ఎందుకంటే “నేను” అనేది ఉన్నంతకాలం తాను వేరు అనే భావం ఉన్నట్టే కదా? అది పోగానే, “హరిమయము విశ్వమంతయు, హరి విశ్వమయుండు...” మరి “నేను” అనేది పోగానే తాను దర్శించినది బయటకి చెప్పడం ఎలా? సర్వం విష్ణుమయం జగత్ అనేది అవగతమైనది ఎలా చెప్పగలం? ఎవరైతే “నేను” చూసాను అంటారో అటువంటివారు నిజంగా చూడలేదు అని అర్థంట. అంటే “నేను చూసాను అని చెప్పడం” నిజంగా చూసినవారికి జరిగే పనికాదు. అందుకే ఆత్మని చూసినవాడు ఆ అనుభవంలో మునిగి ఈదులాడడమే గానీ బయటకి చెప్పలేడు. దాన్నే శివానందులు అనడం ప్రకారం “to know THAT is to become THAT.”

మ. జడులై నాకముఁ గోలుపోవు సురలం జంభారినిం బ్రోవఁగా
వడుగై భూమి బదత్రయం బిడుటకై వైరోచనిన్ వేఁడి రెం
డడుగుల్ సాఁచి త్రివిక్రమస్ఫురణ బ్రహ్మాండంబుఁ దా నిండుచుం
గడు మోదంబున నుండు వామనున కెక్కాలంబునన్ మ్రొక్కెదన్. [8-690]

జంభాసురుణ్ణి సంహరించిన ఇంద్రుడూ, మిగతా దేవతలూ జడులైపోయి, స్వర్గాన్ని పోగొట్టుకుంటే వడుగులా అవతరించి వైరోచనుడి కుమారుడైన బలి చక్రవర్తి నుంచి త్రిలోకాలూ దానం పుచ్చుకుని మళ్ళీ అవి దేవతలకి దక్కేలాగ చేసాడు విష్ణువు. మూడడుగులు అడిగినా రెండు అడుగులతోనే బ్రహ్మాండం అంతా నిండిపోయిన ఆ వామనుడికి ఎప్పుడూ మొక్కుతూ ఉంటాను అంటూ శుకమహర్షి వామనావతారం కథ పూర్తి చేసాడు. చివరిలో ఇలా అనడం ఎందుకంటే, కథ చెప్పేది చావు రాబోయే పరీక్షిత్తుకి. ఈ వారం రోజులూ భగవంతుణ్ణి మర్చిపోకుండా చేయడానికన్నమాట. ప్రాణం ఎవరిది ఎప్పుడు పోతుందో చెప్పలేం కనక ఇది అందరికీ వర్తించేదే.

ఈ వామనావతార పరంపర ముగించేముందు పోతన ఇచ్చేవాడికీ తీసుకునేవాడికీ రాసిన అనేక పదాలు మరోసారి పరిశీలించుదాం. వామనుడు "ఎవరైనా మంచి దాతలున్నారా, దానాలు ఇస్తారా?" అని తనకి కనిపించిన బ్రాహ్మలని అడిగినప్పుడు "మాయామాణవకుండు" అంటే కపట బ్రహ్మచారి; ఏమీ తెలియనట్టు నటించేవాడు. అసలు దేనికోసం పుట్టాడో తెలిసీ అయినా ఇలా అడుగుతున్నాడంటే కపటం ప్రదర్శిస్తున్నాడు కదా? మరి "ఇతడే దానవ చక్రవర్తి..." అంటున్నప్పుడు "మాయాభిక్షుండు," అక్కడ బలి "రక్షోవల్లభుండు." వామనుడి ఆశీర్వచనం విని ఏమి కావాలో కోరుకో అనేటప్పుడు బలి అక్కడ "యజమాని," అప్పుడు వామనుడు "అభ్యాగతి." సరిగ్గా సరిపోయే మాటలు ఎలా వాడుతున్నాడో చూసారా? "వడుగా ఎవ్వరివాడ..." అన్నప్పుడు సమాధానం చెప్పే శ్రీహరిని "ఈశ్వరుడు" అన్నాడు ఎందుకంటే ఆ తర్వాతి పద్యంలో వామనుడు తానెవరో ఎలా చెప్పాడు? "ఇది నాకు నెలవనినేరీతి బలుకుదు.... నదినేర్తు నిదినేర్తునని ఏల చెప్పంగ.." అంటూ ఈశ్వరుణ్ణి, జగత్ప్రభువుని సుమా అని చూచాయగా తన విభూతి చెప్పాడు కదా? అన్నీ చెప్పాక మూడడుగుల నేల దానం అడిగినప్పుడు పోతన ఏమన్నాడు ఇద్దరినీ, "పరమ యాచకునకు ప్రదాత." మరీ చిన్న దానం గర్భ దరిద్రుడిలా అడిగినందుకు వామనుడు పరమయాచకుడు, బలి ఏదైనా సరే – అంటే అడిగిన అతి చిన్న దానం అయినా సరే ఇవ్వగలిగిన వాడు కనక ప్రదాత. అదేమిటయ్యా ఇంతటి చిన్న దానం అడిగావు, నీకు అడగడం

తెలియదు అని బలి అన్నప్పుడు "గృహమేధికి మేధావి." అంటే సంసారంలో చిక్కుకుని అన్నీ తనకున్న ఆస్తులే సుమా అనుకునే గృహమేధి బలికి సంతోషం ఉంటే చాలు అంటూ మేధావిలాగా వివేకం చెప్తున్నాడు కదా వామనుడు? అలాగే శుక్రాచార్యులు దానం ఇవ్వద్దు అన్నప్పుడు కీర్తి కోసం, మాట నిలుపుకోవడం కోసం ఇచ్చి తీరుతాను అన్నప్పుడు బలి "యశస్వి." "ఎవ్వని కరుణింప నిశ్చయించితి..." అంటున్నప్పుడు శ్రీహరి సాక్షాత్తూ భగవంతుడు. ఇలా రాసుకుంటూ పోతే ఒక ఉద్గ్రంథం అవుతుంది.

అంటే వామనావతారం రాసేముందు నిఘంటువు చూసుకుంటూ అందులో ఉన్న తనకి దొరికిన పదాలు అన్నీ ఒకచోట కూర్చి పెట్టుకుని ఒకదాని తర్వాత ఒకటి వాడటం కాదు పోతన చేసినది. ఏది ఎక్కడ ఎలా వాడాలో అలాగే సందర్భోచితంగా వాడాడు. మరి అవి పోతనకి ఆ సందర్భానుసారంగా ఎలా తట్టాయి అనేదానికి మనకి దొరికే ఒక సమాధానం "పలికించెడు వాడు రామభద్రుడట." భగవత్కృప, విభూతి అనేవి అలాగే ఉంటాయి. అన్నమయ్య అందుకే అంటాడు "బ్రహ్మ కడిగిన పాదము, బ్రహ్మము తానెని పాదము, చెలగి వసుధ కొలిచిన నీ పాదము బలి తల మోపిన పాదము తలకగ గగనము తన్నిన పాదము బలరిపు గాచిన పాదము... పరమ యోగులకు పరి పరి విధముల వరమొసగెడి నీ పాదము."

పోతన భాగవతం ఇంటర్నెట్లో ఇక్కడ చూడవచ్చు: http://telugubhagavatam.org/